www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు

సుప్రీం కొలీజియం సిఫారసు

రాష్ట్రానికి తిరిగి రానున్న జస్టిస్ రమేశ్, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

కోల్‌కతా నుంచి జస్టిస్ శుభేందు కూడా

14


జస్టిస్ రమేశ్


జస్టిస్ మానవేంద్రనాథ్


జస్టిస్ శుభేందు

సుప్రీంకు ఇద్దరు కొత్త జడ్జీలు.. జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ పంచోలీలకు పదోన్నతి 2

మంగళవారం | 26-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 132 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: తదియ మ.1:55 తదుపరి చవితి, నక్షత్రం: హస్త పూర్తి, వర్జ్యం: మ.1:00-2:45, దుర్ముహూర్తం: ఉ.8:33-9:22, రా.10:17-11:01, అమృతఘడియలు: రా.11:30-1:15, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:03, సూర్యాస్తమయం: 6:29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నాడు జగన్మాయ.. నేడు నిజమాయె!

కుప్పం నియోజకవర్గానికి కృష్ణమ్మ



- ఎన్నికల ముందు జగన్ మాయా జలాలు
- ఉత్తుత్తి గేటు పెట్టి నీటి విడుదల నాటకం
- 20% పనులూ పూర్తిచేయకుండా మోసం
- కుప్పం కాలువపై చంద్రబాబు దృష్టి
- ఏడాదిన్నరలోనే శరవేగంగా పనులు

(కుప్పం - ఆంధ్రజ్యోతి)

నాటి జగన్ పాలనకు, నేటి చంద్రబాబు పాలనకు మధ్య తేడా ఇది! జగన్ హయాంలో కుప్పంలో పారింది 'మాయా జలాలు'! ఇప్పుడు పారుతున్నది నిజంగా... కృష్ణా జలాలు. రాయలసీమకు జల సిరులు పంచేందుకు శ్రీశైలం జలాశయం నుంచి

మిగతా 13వ పేజీలో...

ఫేక్ ప్రచారాలే కాదు... ఫేక్ గేట్లు, ఫేక్ నీళ్లు కూడా! ఇది... వైఎస్ జగన్మాయ! 'చంద్రబాబు నియోజకవర్గానికి నీళ్లు ఇచ్చాం' అని చెప్పుకోవడానికి సీఎం హోదాలో జగన్ పెద్ద మాయ చేశారు. గత ఏడాది ఎన్నికల ముందు ఉత్తుత్తి గేట్లు పెట్టి... నీటిని ఎత్తిపోశారు.

సరిగ్గా ఏడాదిన్నరలో... చిత్రం మారిపోయింది! కుప్పం కాల్వలకు జల కళ వచ్చింది. మాయలేదు... మోసం లేదు! హంద్రీ నీవా కాల్వల్లోకి కృష్ణా జలాలు గలగలా ప్రవహించాయి. కుప్పం నియోజకవర్గ దశాబ్దాల కల నెరవేరింది. ఆ ప్రాంతానికి కృష్ణా నీళ్లొచ్చాయి.

మాయ

2024 ఫిబ్రవరి 24వ తేదీన రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఉత్తుత్తి గేటు పెట్టి జగన్ 'నీళ్ల విడుదల' చేశారు. ఆ గేటును మరుసటి రోజునే జేసీబీతో ఇలా ఎత్తేశారు.





నిజం

జగన్ 'మాయా జలాలు' ఇచ్చిన అదే రాజుపేట వద్ద... కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో నిండుగా పారుతున్న కృష్ణా జలాలు.. (ఇన్‌సెట్) సోమవారం కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువుకు చేరుతున్న కృష్ణా జలాల్లో జనం సంబరాలు.

బెట్టింగ్ కట్టడెలా?

మారుమూలలకూ ఆన్‌లైన్ యాప్‌ల విజృంభణ

- కుటుంబాలను నాశనం చేస్తున్న మహమ్మారి
- అప్పులపాలై కొందరు యువత ఆత్మహత్య
- కేంద్రం తెచ్చిన చట్టంతో కొత్త ఆశలు
- దేశంలో ఇక లీగల్ యాప్‌లూ కనుమరుగు
- మరో రూపంలో ముప్పు ఉందంటున్న నిపుణులు
- విదేశాల నుంచి టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లోకి ఏపీకే ఫైల్స్ ఆపడమెలా? సర్వర్ల ట్రాకింగ్ ఎలా?
- ప్రచారమే విరుగుడంటున్న నిపుణులు, పోలీసులు

ఏపీలో నిషేధమున్నా ఫలితం అంతంతే

కొన్ని రాష్ట్రాల్లో లీగల్ కావడమే సమస్య



● నిషేధం ఉన్నా విచ్చలవిడి..

ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ ఆన్‌లైన్ బెట్టింగ్, జూదంపై ఇప్పటికే నిషేధం ఉంది. అయినా ఈ మహమ్మారి రాష్ట్రమంతా విజృంభించింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను కట్టడి చేయలేకపోవడానికి కారణం.. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కేరళ వంటి రాష్ట్రాల్లో చట్టబద్ధం కావడమే. బెట్టింగ్ నిర్వాహకులు అక్కడి నుంచి యువతకు వల వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధిత చట్టం తీసుకొచ్చింది. దీనివల్ల దేశంలో యాప్‌లను కట్టడి చేసినా.. విదేశాల నుంచి సవాల్ ఎదురయ్యే అవకాశముందని నిపుణులు అంటున్నారు. సోషల్ మీడియా ద్వారా యువతకు వ్యసనంగా మార్చే ప్రమాదముందని చెబుతున్నారు.

● గేలం వేసి ఉచ్చులోకి..

ఆన్‌లైన్ బెట్టింగ్ మోసగాళ్లు 'ఏపీకే ఫైల్' రూపంలో లింక్ పంపుతారు. ఆకర్షించేలా వాచీలు, చీరలు, తదితర బ్రాండెడ్ వస్తువులపై ఆఫర్లు ఇస్తారు. తర్వాత మెల్లగా బెట్టింగ్ ముగ్గులోకి దించుతారు. ఎవరైనా అంతటితో విషయం తెలుసుకుని జాగ్రత్త పడితే గండం తప్పినట్టే. అత్యాశతో ముందుకుపోతే అంతే. మొదట్లో సులువుగా వంద, రెండు వందలు గెలిచేలా చేస్తారు. ఆ తర్వాత అసలు కథ మొదలవుతుంది. వందల నుంచి వేలు బెట్టింగ్ కాచేలా చేస్తారు. అలా ఆ వ్యక్తి స్థాయిని బట్టి భారీ మొత్తానికి చేరుకోగానే విత్ డ్రా చేయకుండా కేటుగాళ్లు అకౌంట్‌ను బ్లాక్ చేస్తారు. స్క్రీన్‌పై మాత్రమే డబ్బులు ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ అప్పటికే డబ్బులు లాగేసి ఉంటారు. ఇలా ఎందరో యువత అప్పులపాలై రోడ్డున పడ్డారు. కొందరు దిక్కుతోచక ఆత్మహత్యకు పాల్పడ్డారు. బెట్టింగ్ మహమ్మారి ఎన్నో కుటుంబాలను నాశనం చేసింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆన్‌లైన్ బెట్టింగ్.. మాదక ద్రవ్యాల కంటే తీవ్రమైన సమస్యగా మారుతోంది. కంటికి కనిపించని ఈ మహమ్మారి.. నగరాలు, పట్టణాలు దాటి చివరికి మారుమూల గ్రామాలకు సైతం పాకింది. రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదంపై నిషేధం ఉన్నా కొన్ని ఇతర రాష్ట్రాల్లో చట్టబద్ధం కావడంతో అరికట్టడం సవాల్‌గా మారింది. అక్కడ లీగల్ అయినందున నిర్వాహకులపై చర్యలు తీసుకోలేని పరిస్థితి. దీంతో బెట్టింగ్ మహమ్మారిని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం బెట్టింగ్

మిగతా 14వ పేజీలో...


జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో సీఎం చంద్రబాబు

మీ విజయం ఎందరికో స్ఫూర్తినివ్వాలి

ఉన్నత చదువుల్లోనూ మరింత ప్రతిభ చూపాలి


- జాతీయ స్థాయిలో రాణించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో సీఎం
- ఐఐటీ, నిట్, నీట్‌కు రాష్ట్రం నుంచి 55 మంది ఎంపిక
- ఈ సంఖ్య వచ్చే ఏడాది నాలుగు రెట్లు పెరగాలని ఆకాంక్ష
- ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వజ్రమైనా సానబెడితేనే దాని విలువ తెలుస్తుందని.. అలాగే మట్టిలో మాణిక్యాలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్‌లలో సాధించిన విజయాలే అందుకు నిదర్శనమని చెప్పారు. వీళ్ల విజయం ఎందరికో స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో సత్తాచాటి.. ఐఐటీ, నిట్, నీట్‌లలో సీట్లు సాధించిన 55 మంది

మిగతా 12వ పేజీలో...

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో నక్సల్స్‌కు..

20 ఏళ్లు ఊపిరి!



- తర్వాత జరిగిన హింసకు రాహుల్ జవాబివ్వాలి
- వామపక్ష సానుభూతిపరుడనే ఆయన ఎంపిక
- పదవీచ్యుతి బిల్లుపై విపక్షాల వైఖరి ఘోరం
- రాహుల్ నైతిక ప్రమాణాలు ఎటు పోయాయి?
- నాడు ఆర్డినెన్స్ చించి నేడు లాలూకు మద్దతా?
- మోదీ పట్టుబట్టి ప్రధానినీ బిల్లులో చేర్చారు
- సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు పెట్టగానే గుజరాత్ హోం మంత్రి పదవిని త్యజించా
- నా బెయిలు దరఖాస్తు పరిష్కారానికి రెండేళ్లు పట్టింది.. అప్పటిదాకా రాష్ట్రం వెలుపలే ఉన్నా
- కేసు కొట్టేసే వరకు ఏ పదవీ తీసుకోలేదు
- చివరికి కోర్టే దురుద్దేశ పూరిత కేసుగా తేల్చింది

ఏఎన్ఐ ఇంటర్వ్యూలో అమిత్‌షా

న్యూఢిల్లీ, ఆగస్టు 25: ఇండీ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన ఒక తీర్పు కారణంగా కొన ఊపిరితో ఉన్న నక్సలైట్ ఉద్యమం మరో రెండు దశాబ్దాల పాటు దేశంలో మనగలిగిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. సల్వాజుడుం వ్యవస్థను రాజ్యాంగ విరుద్ధమని, రద్దు చేయాలని ఆదేశించడం ద్వారా సుదర్శన్‌రెడ్డి గిరిజనులకు ఉన్న స్వీయరక్షణ హక్కును కాలరాశారని మండిపడ్డారు. గిరిజనులు తమను తాము కాపాడుకొనేందుకే సల్వాజుడుం ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలను నక్సల్స్ కూల్చేస్తుంటే ప్రభుత్వాలు సాయుధ బలగాలను మోహరించాయని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒక్క కలంపోటుతో వాళ్లను రోడ్డున పడేశారని చెప్పారు. ఆ తర్వాత భద్రతా దళాల మీద నక్సల్స్

మిగతా 2వ పేజీలో...

అమిత్ షా వ్యాఖ్యలతో న్యాయవ్యవస్థ స్వతంత్రతకు

తీవ్ర విఘాతం

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పులో ఎక్కడా నక్సలిజాన్ని సమర్థించలేదు
- సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించడం జడ్జీల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడమే

18 మంది మాజీ జడ్జీల ప్రకటన



ఒత్తిడి పెరిగినా భరిస్తాం

2

రైతులు, పశు పోషకులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలపై రాజీ పడం

అమెరికా 50% సుంకాల అమలుపై మోదీ

మోదీ డిగ్రీ వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదు: ఢిల్లీ హైకోర్టు


మాదాబత్తుల తిరుమల శ్రీదేవి

12

విశాఖ ఉపాధ్యాయినికి జాతీయ అవార్డు

- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక
- ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ విధానంలో వినూత్నంగా బోధన


ఎమ్మెల్యే జిబాన్ కృష్ణ: ఎమ్మెల్యేను పట్టుకున్న ఈడీ అధికారి

ఈడీని చూసి ఎమ్మెల్యే పరార్

- బెంగాల్‌లో ఘటన.. ఇంటిపైనుంచి దూకిన టీఎంసీ ఎమ్మెల్యే
- ఆ తర్వాత ఎత్తైన ప్రహరీ పైనుంచి దూకి పారిపోయే ప్రయత్నం
- వెంబడించి పట్టుకున్న అధికారులు.. ఆధారాలు దొరక్కుండా ఫోన్‌ను మురుగు కాల్వలోకి విసిరిన ఎమ్మెల్యే కృష్ణ సాహా

కోల్‌కతా, ఆగస్టు 25: ఈడీ అధికారులు తన ఇంట్లో సోదాలు చేయడానికి వస్తున్నారని తెలిసి పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యే ఒకరు తన ఇంటి మొదటి అంతస్తు నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇంటి చుట్టూ ఉన్న ఎత్తైన ప్రహరీని కూడా ఎక్కి, దూకేశారు. ఆయన్ను చూసి అధికారులు వెంబడించగా, ఆధారాలు దొరక్కుండా తన ఫోన్‌ను దూరంగా డ్రైనేజీలోకి

మిగతా 2వ పేజీలో...

అరుణ అరాచకం!

- సూళ్లూరుపేటలో కిరాయి హత్య
- తండ్రి హత్యకు సుపారీ ఇచ్చిన ఓ వ్యక్తి
- నాడు సహజ మరణం ఖాతాలోకి
- నేడు.. అరుణ మొబైల్‌లో తేలిన నిజం
- మరొకరి ఆత్మహత్యకూ కారణమైన ముఠా
- మాజీ ఎమ్మెల్యే కిలివేటితో కిలేడీ బంధం
- ఆయన తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ
- ఆమె ఎన్నికల ఏజెంటుగా వైసీపీ ఎంపీపీ


వైసీపీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో అరుణ (ఫైల్)

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

పోలీసు అధికారులనే ఒక ఆటాడించిన, ఐఏఎస్ అధికారులనూ గుప్పిట పట్టిన, రాజకీయ నాయకుల అండతో చెలరేగిపోయిన కిలేడీ నిడిగుంట అరుణ 'కిరాయి హత్యల' చరిత్ర బయటపడుతోంది. ఆమె మొబైల్ ఫోన్‌లో కాల్‌డేటా తీగలాగితే... మొత్తం నేరాల డొంక కదులుతోంది. అప్పుడెప్పుడో 'సహజ మరణం'గా భావించిన ఒక వ్యక్తిని అరుణ గ్యాంగ్ చంపించినట్లుగా తేలింది. రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్‌కు పెరోల్ ఇప్పించడానికి పైస్థాయిలో పైరవీలు నడిపిన అరుణను ఇటీవల నెల్లూరు పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఆమె మొబైల్ ఫోన్ నుంచి సేకరించిన కాల్ రికార్డింగ్‌లను పరిశీలించే క్రమంలో సూళ్లూరుపేటలో జరిగిన ఒక హత్య సంగతి వెలుగులోకి వచ్చింది. ఆ పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు. ఆస్తి మొత్తం చిన్న భార్యకు రాసిస్తాడనే అనుమానంతో పెద్ద భార్య కొడుకే.. తండ్రి హత్యకు అరుణ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చినట్లు పోలీసులకు క్లూ లభించింది. ఇంతకాలం

మిగతా 12వ పేజీలో...



వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

12

దసరా ఉత్సవాలకూ అందిస్తాం: లోకేశ్

నేడు డీఎస్సీ కాల్‌లెటర్లు

- ఎల్లుండి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం
- ఈలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటన
- 2 జిల్లాల్లో సాంకేతిక సమస్యలతో ఆలస్యం



11



3

ప్రతి రైతుకూ ఎరువులిస్తాం

- రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో 6.48 లక్షల టన్నులు
- 6న గంగవరం పోర్టుకు 15 వేల టన్నుల యూరియా
- 2వ వారంలో కాకినాడ పోర్టుకు 30 వేల టన్నులు: అచ్చెన్న

డిప్యూటీ తహశీల్దార్ డ్రగ్స్ దందా!

- కొండాపూర్‌లో డ్రగ్స్‌తో రేవ్ పార్టీ
- ఆరుగురిని అరెస్టు చేసిన టీ-పోలీస్
- ప్రధాన నిందితుడికి డ్రగ్స్ అలవాటు చేసింది రాజమండ్రి డీటీ మణిదీప్
- ప్రతి వారం విమానంలో హైదరాబాద్‌కు
- రాజమండ్రి ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీలు
- ఉన్నతాధికారులతో సత్సంబంధాలు?


నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

నాకు ఏ సంబంధమూ లేదు: మణిదీప్ 14

రోజుకు 16 గంటల ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో..

హృద్రోగాల ముప్పు 135% ఎక్కువ

తాజా అధ్యయనంలో వెల్లడి



ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ (ఐఎఫ్).. రోజులో 12 గంటల నుంచి 16 గంటలపాటు ఏమీ తినకుండా ఉండడం. ఏది తిన్నా మిగతా 8-12 గంటల సమయంలోపే తినడం. ఇటీవలికాలంలో చాలా మంది బరువు తగ్గడానికి అనుసరిస్తున్న పద్ధతి ఇది. ఈ పద్ధతిని అనుసరించేవారు సాయంత్రం 6 గంటల నుంచి మర్నాడు ఉదయం అల్పాహార సమయం దాకా ఏమీ తినరు. కానీ.. ఇలా 16 గంటలపాటు ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసేవారు హృద్రోగంతో మరణించే ముప్పు.. 12-14 గంటల ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసే వారితో పోలిస్తే 135% ఎక్కువని తాజా అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలో భాగంగా.. అమెరికా జాతీయ ఆరోగ్య, పోషకాల పరిశీలన సర్వే (ఎన్‌హేన్స్) నుంచి సేకరించిన 19 వేల మంది వ్యక్తుల డేటాను పరిశోధకులు నిశితంగా పరిశీలించారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసినవారిలో ఎంత మంది క్యాన్సర్‌తో చనిపోయారు? ఇతరత్రా కారణాలతో ఎందరు మరణించారు? అనే విషయాలను పరిశీలించి.. తక్కువ సమయం ఐఎఫ్ చేసినవారితో పోలిస్తే రోజులో ఎక్కువ సమయం ఏమీ తినకుండా ఉండేవారు హృద్రోగాల బారిన ఎక్కువగా పడినట్టు గుర్తించారు. కాబట్టి ఈ విధానాన్ని దీర్ఘకాలం అనుసరించేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ సొంతంగా చేయకుండా.. వైద్యులను సంప్రదించి, వారి సలహాలు సూచనలను అనుసరించాలని పేర్కొన్నారు. గతంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చేసిన ఒక అధ్యయనంలో కూడా.. ఇలా రోజులో ఎక్కువ గంటలపాటు ఉపవాసం ఉండేవారు హృద్రోగాల బారిన పడే ముప్పు 91% ఎక్కువని తేలినట్టు బెంగళూరుకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రంజన్ శెట్టి తెలిపారు. రోజులో కేవలం 8 గంటలపాటు మాత్రమే తినడం.. అరిత్మియా (హృదయ స్పందనలు సరిగా లేకపోవడం) వంటి సమస్యలతో బాధపడేవారికి మంచిది కాదని, 16 గంటలపాటు ఉపవాసం ఉండడం వల్ల వారి రక్తంలో చక్కెరస్థాయులు తగ్గి, గుండెదడ, హృదయస్పందన రేటు పెరగడం వంటి సమస్యలు వస్తాయని.. గుండెపోటు బారిన పడే ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు. "16 గంటలపాటు ఏమీ తినకుండా.. ఆ సమయంలో రోజువారీ పనులు చేసుకోవాలని భావిస్తే.. రక్తసరఫరా చేయడానికి గుండె ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది" అని ఆయన వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు,మధుమేహ బాధితులు,మూత్రపిండాలు, కాలేయం, గుండె జబ్బులున్నవారు ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయకూడదని సూచించారు. ఒకవేళ అలాంటివారు ఐఎఫ్ చేయాలన్నా.. వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

లోకం తీరు



నిందితుడు నిర్దోషిగా విడుదలైతే బాధితులు, వారి వారసులు సవాల్ చేయొచ్చు

- బాధితుల హక్కును పరిమితం చేయలేం: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 25: నిందితుడు నిర్దోషిగా విడుదలైనప్పుడు.. బాధితులు, వారి చట్టబద్ధ వారసులు కూడా సవాల్ చేయవచ్చని సుప్రీం కోర్టు ఓ కేసు తీర్పు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితుడి హక్కును దోషిగా నిర్ధారించిన నిందితుడి హక్కుతో సమానంగా ఉంచాలంటూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథ్ ధర్మాసనం పేర్కొంది. "నిందితుడికి తక్కువ శిక్ష పడ్డప్పుడు, బాధితుడికి తగినంత నష్ట పరిహారం ఇవ్వాల్సిందిగా కోర్టు ఆదేశించకపోయినా, నిందితుణ్ని నిర్దోషిగా విడిచిపెట్టినా.. ఆ తీర్పుపై అప్పీల్ చేయడానికి సీఆర్‌పీసీ సెక్షన్ 372 నిబంధనల ప్రకారం బాధితుడికి హక్కు ఉంది" అని వెల్లడించింది. బాధితుల హక్కును పరిమితం చేయలేమని స్పష్టం చేసింది. అలాగే అప్పీల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో బాధితుడు మరణిస్తే వారి చట్టబద్ధ వారసులు కూడా కేసును కొనసాగించవచ్చని తెలిపింది. క్రిమినల్ కేసులో దోషిగా తేలిన వ్యక్తి ఎలాంటి షరతులూ లేకుండా అప్పీలు చేసుకోవడానికి సీఆర్‌పీసీ సెక్షన్ 374 ప్రకారం ఎలా హక్కు ఉందో.. బాధితులకు కూడా అప్పీలు చేసుకునే హక్కు ఉండాలని పేర్కొంది. బాధితులు ఫిర్యాదుదారా కాదా అనే దాంతో సంబంధం లేకుండా.. అప్పీలు చేసుకోవడానికి 2009లో సీఆర్‌పీసీ సెక్షన్ 372లో ఓ నిబంధనను జోడించారని గుర్తు చేసింది.

ఆర్టికల్ 32 కింద మరణశిక్షనూ సవాల్ చేయొచ్చు..

మరణశిక్ష విధించిన కేసుల్లో నిందితులకు సంబంధించి విధానపర రక్షణ ప్రమాణాలను ఉల్లంఘించినట్లు తేలితే రాజ్యాంగంలోని అధికరణం 32 ప్రకారం తిరిగి కేసు తెరవవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. మరణశిక్ష పడిన దోషి సైతం ప్రాథమిక హక్కులను కోల్పోకూడదని స్పష్టం చేసింది. మరణశిక్ష పడిన ఓ దోషి పిటిషన్‌ను విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది. 2008లో నాగ్‌పూర్‌కు చెందిన వసంత్ నాలుగేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడ్డాడు. అతడికి మరణశిక్ష పడటంతో పలుమార్లు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తాజాగా అతడికి ఊరట దక్కింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ పంచోలి!

న్యూఢిల్లీ, ఆగస్టు 25: బాంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు సీజే జస్టిస్ విపుల్ పంచోలిలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతులు కల్పించాలని కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ బీవీ నాగరత్న కొలీజియం సోమవారం మధ్యాహ్నం సమావేశమై చర్చించి ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సుధాంశు ధులియా పదవీ విరమణ పొందడంతో 34 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవుల్లో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. కొలీజియం సిఫారసులను కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే.. రాష్ట్రపతి ఉత్తర్వులతో వారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు.

యూపీఎస్ నుంచి ఎన్‌పీఎస్‌కు మరో చాన్స్

న్యూఢిల్లీ: కొత్తగా ప్రవేశ పెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)లో చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వీరు ఈ పథకం నుంచి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లోకి మారేందుకు అవకాశం కల్పించింది. అయితే ఇలా మారే అవకాశం ఒకసారికి మాత్రమే పరిమితమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎన్‌పీఎస్‌లోని ఉద్యోగులు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్‌కు మారేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెలాఖరు వరకు ఈ ఆప్షన్ ఉంటుంది. గత నెల 20 నాటికి దాదాపు 31,555 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పీఎస్ నుంచి యూపీఎస్‌కు మారారు. కావాలనుకుంటే వీరు మళ్లీ ఎన్‌పీఎస్‌కు మారవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఉద్యోగార్థులకు వ్యక్తిగత ఇంటర్వ్యూ తప్పనిసరి

- ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో ఏఐ దుర్వినియోగం : పిచాయ్

న్యూఢిల్లీ, ఆగస్టు 25: ఐటీ, టెక్నాలజీ సంస్థలు నిర్వహిస్తున్న ఉద్యోగ నియామక ప్రక్రియలో అభ్యర్థులు ఏఐ టూల్స్ వాడుతున్నారన్న అనుమానాల మధ్య గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్.. ఉద్యోగార్థులకు ఒక రౌండ్ వ్యక్తిగత ఇంటర్వ్యూ తప్పనిసరని తెలిపారు. ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో ఏఐ దుర్వినియోగం అవుతోందని అభిప్రాయపడ్డారు. కాగా, పలు దిగ్గజ సంస్థలు, టెక్ నియామక ఏజెన్సీలు కూడా 50 శాతానికి పైగా ఉద్యోగార్థులు ఆన్‌లైన్ ఇంటర్వ్యూల్లో అనధికారిక టూల్స్ వాడుతున్నారని అనుమానిస్తున్నాయి. అప్లికేషన్ల ప్రక్రియలో ఏఐ టూల్స్ వాడకంపై ఆంత్రోపిక్ నిషేధం విధించగా, సిస్కో, మెకెన్సీ, డెలాయిట్ ముఖాముఖీ ఇంటర్వ్యూలతో నియామక ప్రక్రియ చేపట్టాయి.

అమెరికాలో భారత్ రెండో 'లాబీయింగ్' సంస్థ

వాషింగ్టన్, ఆగస్టు 25: మరి కొద్ది రోజుల్లో భారత వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50% సుంకాలు అమలుకానున్న వేళ భారత్ ఆ దేశంలో రెండో లాబీయింగ్ సంస్థను నియమించింది. మాజీ సెనెటర్ డేవిడ్ విటర్‌కు చెందిన లాబీయింగ్ సంస్థ మెర్క్యురీ పబ్లిక్ ఎఫయిర్స్‌ని భారత్ నూతనంగా నియమించినట్లు ఒక అమెరికన్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ సంస్థకు ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌తో దగ్గరి సంబంధాలు ఉన్నాయి. భారత్ ఇప్పటికే అమెరికాలో ఎస్‌హెచ్‌డబ్ల్యూ పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్‌సీ లాబీయింగ్ సంస్థను 1.8 మిలియన్ డాలర్లకు నియమించింది. మరోవైపు మెర్క్యురీకి నెలకు 75,000 డాలర్ల చొప్పున మూడు నెలలకు చెల్లించనున్నట్లు సమాచారం. దీంతో మెర్క్యురీ భాగస్వామి, ట్రంప్‌నకు కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా పని చేసిన బ్రయన్ లాంజా భారత్ కోసం పనిచేయనున్నట్లు సమాచారం. ట్రంప్ అధికారంలోకి వచ్చాక దాదాపు 30 దేశాలు తమ లాబీయింగ్ సంస్థలను అమెరికాలో ఏర్పాటు చేసుకున్నాయి.


ఇజ్రాయెల్ దాడుల్లో ఆరుగురు జర్నలిస్టులు మృతి

- విచారం వ్యక్తం చేసిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

గాజా, టెల్ అవీవ్, ఆగస్టు 25: ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆరుగురు జర్నలిస్టులు మృతిచెందారు. గాజాలోని నాసెర్ మెడికల్ కాంప్లెక్స్ ఆసుపత్రిపై జరిపిన దాడుల్లో ఐదుగురు జర్నలిస్టులు, ఖాన్‌యూనిస్‌లో జరిపిన దాడిలో మరో జర్నలిస్టు మృతిచెందారు. మృతుల్లో అల్ జజీరాకు చెందిన మొహమ్మద్ సలామా, రాయ్‌టర్స్‌కు చెందిన హుస్సామ్ అల్ మస్రీ, ఖుద్స్ ఫీడ్ నెట్‌వర్క్‌కు చెందిన అహ్మద్ అబు అజీజ్, అసోసియేటెడ్ ప్రెస్‌కు చెందిన మరియం డఖ్హా, గాజా ప్రభుత్వ మీడియాకు పనిచేస్తున్న మోయిజ్ అబూ తాహా, అల్ హయత్ అల్ జదియాకు చెందిన హస్సాన్ దౌహాన్ ఉన్నారు. వాస్తవానికి నాసెర్ ఆసుపత్రిపై జరిపిన దాడిలో మొత్తం 21 మంది చనిపోయారు. వీరిలో ఐదుగురు జర్నలిస్టులే. ఇజ్రాయెల్ దాడిని ఐక్యరాజ్యసమితితో పాటు పలు మీడియా సంస్థలు ఖండించాయి. ఈ నెల 10న ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు అల్‌జజీరా జర్నలిస్టులు మృతిచెందారు. కాగా, ఇజ్రాయెల్ బలగాల దాడిలో జర్నలిస్టుల మృతిపై ప్రధాని నెతన్యాహు విచారం వ్యక్తం చేశారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో నక్సల్స్‌కు..

20 ఏళ్లు ఊపిరి!



(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున దాడులు చేశారన్నారు. ఈ తీర్పునకు సంబంధించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కన్నా రాహుల్ గాంధీ ఎక్కువ సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు. ఇండీ కూటమి సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడంలో వామపక్ష భావజాలమే ప్రాతిపదికగా తీసుకున్నారని అమిత్‌షా ఆరోపించారు. సోమవారం ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వామపక్ష సిద్ధాంత సానుభూతిపరుడైన సుదర్శన్‌రెడ్డిని ఎందుకు ఎంపిక చేశారో రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జైల్లోంచి దేశాన్ని నడిపిస్తామంటే ఎలా?

క్రిమినల్ కేసుల్లో జైలుపాలైన మంత్రులను పదవుల నుంచి తొలగించే మూడు బిల్లుల విషయంలో విపక్షాల వైఖరిపై అమిత్‌షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జైలు పాలైన నేత ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాలన నడవదన్న విపక్షాల ఆలోచనను బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ప్రకటించారు. "పీఎం, సీఎం లేదా మరో నేత జైలు నుంచి దేశాన్ని నడిపిస్తానంటే ఎలా" అని ప్రశ్నించారు. ఈ మూడు బిల్లులను నెగ్గించుకొనే సంఖ్యాబలం ఉందో లేదో సభలోనే తేలుతుందన్నారు. మోదీ స్వయంగా తన పదవిని కూడా రాజ్యాంగ సవరణలో చేర్చాలని పట్టుబట్టి చేర్పించుకున్నారని చెప్పారు. 1975లో ఇందిర 39వ రాజ్యాంగ సవరణ ద్వారా తనను రక్షించుకోవడం కోసం ప్రధాని ఎన్నికను న్యాయ సమీక్ష పరిధి నుంచి తప్పించారని అమిత్‌షా ప్రస్తావించారు. ఇద్దరి మధ్య తేడాను గుర్తించాలన్నారు. యూపీఏ హయాంలో శిక్షపడ్డ ఎంపీలను కాపాడే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తే రాహుల్‌గాంధీ చించి పారేశారని అమిత్‌షా గుర్తు చేశారు. అదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌కు శిక్ష పడ్డా ఆయనకు అండగా నిలుస్తోందని చెప్పారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ వరుసగా మూడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన నైతిక ప్రమాణాల్లో రాజీ పడ్డారని ఎద్దేవా చేశారు.

కోర్టులు కళ్లు మూసుకొని కూర్చోవు

సుప్రీంకోర్టు, హైకోర్టులు కళ్లు మూసుకొని కూర్చోలేదని, ఒక సీఎంపై తప్పుడు కేసు పెడితే కోర్టులు బెయిలిస్తాయని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎక్కువ మంది సీఎంలు, ప్రధాని ఎన్డీయే వారేనని గుర్తు చేశారు. ఎన్డీయే సీఎంలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులే పెట్టడం లేదని చేస్తున్న వాదనను కొట్టిపారేశారు. వారు అవినీతిపరులైతే విపక్షాలు కోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేసి కేసు నమోదుకు ఆదేశాలు తెచ్చుకోవచ్చన్నారు. గతంలో చాలామంది సీఎంలు జైలుకు వెళ్లారని, వాళ్లు నైతిక బాధ్యత వహించి రాజీనామాలు చేశారని, ఇప్పుడు అలా చేయకపోవడం వల్లే ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి వస్తోందని అన్నారు. ఇక రాహుల్‌గాంధీ రీల్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడాన్ని ఒక పథకం ప్రకారం జరుగుతున్న కార్యక్రమంగా అమిత్‌షా అభివర్ణించారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ కలిగిస్తున్న భ్రాంతి ఎక్కువకాలం పని చేయదన్నారు.

రెండేళ్లు రాష్ట్రానికి దూరంగా ఉన్నా

సొహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు విచారణను తాను ప్రభావితం చేస్తానేమోనని కేసును విచారిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ అఫ్తాబ్ ఆలం సందేహం వెలిబుచ్చిన నేపథ్యంలో తానే విచారణ పూర్తయ్యే వరకు రాష్ట్రం విడిచి వెళతానని ప్రతిపాదించానని అమిత్‌షా వెల్లడించారు. రెండేళ్ల రాష్ట్రం వెలుపల ఉండటం తన స్వీయ నిర్ణయమని చెప్పారు. సాధారణంగా ఒక బెయిలు అప్లికేషన్‌ను 11 రోజుల్లో పరిష్కరిస్తారని, తన బెయిలు దరఖాస్తును పరిష్కరించడానికి రెండేళ్ల సమయం తీసుకున్నారని, అన్ని రోజులు తాను రాష్ట్రం వెలుపల ఉండాల్సి వచ్చిందని చెప్పారు. తనపై సీబీఐ కేసు నమోదు చేయగానే మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. కేసు పూర్తిగా కొట్టేసే వరకు ఎలాంటి పదవులు చేపట్టలేదన్నారు. చివరికి ఈ కేసు రాజకీయ ప్రతీకారంతో పెట్టిందేనని న్యాయస్థానం స్వయంగా తేల్చిందని ప్రస్తావించారు.

అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం: సుప్రీం మాజీ జడ్జిలు

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ సుదర్శన్ రెడ్డికి వ్యతిరేకంగా అమిత్ షా వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన 18 మంది మాజీ న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరమని వారు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తీర్పులో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎక్కడా నక్సలిజాన్ని, దాని సిద్ధాంతాలను సమర్థించలేదని.. ఆ తీర్పు సారాంశంలో ఎక్కడా అలాంటి ఉద్దేశం లేదని వారు స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి పదవికి జరిగే ప్రచారం మర్యాదగా, హుందాగా ఉండాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో ఉన్నత స్థానంలో ఉన్న ఒక వ్యక్తి దురుద్దేశంతో వక్రీకరించడం న్యాయవ్యవస్థ స్వతంత్రతను కుదిపివేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ ప్రకటనపై జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ లోకూర్, జస్టిస్ చలమేశ్వర్ తదితరులు సంతకం చేశారు.

తప్పుడు కేసులు పెట్టిన మంత్రికి ఎన్నేళ్లు జైలు శిక్ష విధించాలి?

- అమిత్ షాకు కేజ్రీవాల్ కౌంటర్



న్యూఢిల్లీ, ఆగస్టు 25: అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని, పదవులు కట్టబెట్టే నేతలు కూడా వారి పదవులకు రాజీనామా చేయాలని ఆప్ అధినేత కేజ్రీవాల్ అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యాలయం సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టుకు సోమవారం ఆయన ఈ మేరకు ఘాటుగా స్పందించారు. 30 రోజులు అంతకంటే ఎక్కువ కాలం జైల్లో ఉన్న వారు పీఎం, సీఎం, మంత్రుల పోస్టుల్లో కొనసాగకుండా నిషేధం విధించాలన్న బిల్లులపై అమిత్ షా స్పందిస్తూ.. అవినీతి, క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారు ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులుగా జైలు నుంచి పాలన కొనసాగిస్తారా? అని ప్రశ్నించారు. ఈ పోస్ట్‌పై కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. "తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని పార్టీలో చేర్చుకొని, వారిపై కేసులన్నీ ఎత్తివేయించి, మంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులు/ముఖ్యమంత్రులుగా చేస్తున్నారు. అలాంటి మంత్రి లేదా ప్రధాన మంత్రి కూడా తమ పదవులకు రాజీనామా చేయాలి కదా? ఎవరినైనా తప్పుడు ఆరోపణలతో జైలుకు పంపించిన తర్వాత వారు అమాయకులని తేలితే ఎలా? తప్పుడు కేసు పెట్టిన మంత్రికి ఎన్నేళ్లు శిక్ష విధించాలి?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. "రాజకీయ కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నన్ను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపింది. అక్కడి నుంచే నేను 160 రోజుల పాటు ప్రభుత్వాన్ని నడిపా" అని చెప్పారు. అలాంటి సమయంలో కూడా తాను ఢిల్లీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూశానన్నారు.

ఒత్తిడిని భరిస్తాం

- రైతులు, పశు పోషకులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలపై రాజీ పడం: మోదీ

అహ్మదాబాద్, ఆగస్టు 25: 'మనపై ఒత్తిడి పెరుగొచ్చు. కానీ, మనం దాన్ని భరిద్దాం' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి భారత్ వస్తువులపై అమెరికా 50% సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని మోదీ సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పలు పథకాలను ప్రారంభించిన రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రైతులు, పశు పోషకులు, చిన్న పారిశ్రామికవేత్తల ప్రయోజనాల విషయమై రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించకుండానే ఆర్థిక ప్రయోజనాల చుట్టూ ప్రపంచ రాజకీయాలు తిరుగుతున్నాయన్నారు. రక్షణ, శక్తికి మారుపేరుగా నిలిచిన 'సుదర్శన చక్రధారి శ్రీకృష్ణుడు.. జాతీయోద్యమంలో రాట్నంపై నూలు వడికి స్వదేశీ దుస్తులు వాడాలన్న మహాత్మాగాంధీ బాటలో భారత్ సాధికారత సాధించిందని మోదీ చెప్పారు. 60-65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. దిగుమతి కుంభకోణాలకు పాల్పడేందుకు విదేశాలపై దేశం ఆధార పడేలా చేసిందన్నారు. ఇదిలా ఉండగా, భారత్, పసిఫిక్ ద్వీప దేశం ఫిజీ మధ్య ఏడు అంశాలపై ఒప్పందాలు కుదిరాయి. మూడు రోజుల పర్యటనకుగాను ఫిజీ ప్రధాని సితివేని రబూకా ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్నారు.

ఈడీని చూసి ఎమ్మెల్యే పరార్

(మొదటిపేజీ తరువాయి)

విసిరిగొట్టారు. కానీ, అధికారులు ఆయన్ను పట్టుకొని అరెస్టు చేశారు. ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన అక్రమాలపై ఈడీ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సోమవారం ముర్షీదాబాద్ జిల్లాలోని బుర్వాన్ ఎమ్మెల్యే జిబాన్ కృష్ణ సాహా, ఆయన బంధువుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించడానికి ఈడీ అధికారులు వెళ్లారు. వారిని చూసిన సాహా పారిపోవడానికి విఫల యత్నం చేశా రు. ఇదే వ్యవహారంలో సాహాను 2023 ఏప్రిల్‌లో సీబీఐ అరెస్టు చేసింది. అప్పుడూ ఆయన ఇదే విధంగా ప్రవర్తించారు. తన ఫోన్లను ఓ చెరువులోకి విసిరిగొట్టారు.

ప్రియురాలి నోట్లో జిలెటిన్ స్టిక్ పేల్చివేత

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో లాడ్జికి వెళ్లిన మహిళ దారుణ హత్యకు గురైంది. నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తే ఆమె నోట్లో జిలెటిన్ స్టిక్ పెట్టి పేల్చి చంపేశాడు. మైసూరు జిల్లా భేర్యలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. హత్యకు గురైన మహిళను గరసనహళ్లి గ్రామానికి చెందిన రక్షిత(20)గా పోలీసులు గుర్తించారు. ఆమె ప్రియుడు సిద్దరాజును అదుపులోకి తీసుకున్నారు. రక్షితకు కేరళకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. మైసూరు ప్రాంతానికి చెందిన సిద్దరాజు అనే యువకుడితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. కప్పడి ఆలయానికి వెళదామని సిద్దరాజు పిలవడంతో రక్షిత వెంట వెళ్లింది. ఆమెను సిద్దరాజు లాడ్జికి తీసుకెళ్లాడు. పథకం ప్రకారం వెంట తీసుకెళ్లిన జిలిటిన్ స్టిక్‌ను ఆమె నోట్లో పెట్టి పేల్చాడు.

ప్రధాని మోదీ డిగ్రీ వెల్లడిలో

ప్రజా ప్రయోజనం ఏమీ లేదు!

- దాన్ని వెల్లడించాల్సిన అవసరం లేదు
- స్మృతి ఇరానీ విషయంలో కూడా అంతే
- మోదీ డిగ్రీపై మాడభూషి ఆదేశాల్ని కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం



న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రధాని మోదీ, కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీల విద్యాభ్యాసం వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. దాంట్లో ప్రజాప్రయోజనం ఏమీ లేదని పేర్కొంది. ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను కోరుతూ నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన దరఖాస్తుపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ).. 2016లో ఢిల్లీ వర్సిటీకి ఆదేశాలు జారీ చేస్తూ సదరు వివరాలు వెల్లడించాలని పేర్కొంది. 1978 బ్యాచ్‌లో వర్సిటీలో బీఏ పాసైన (అదే ఏడాది మోదీ బీఏ పూర్తి చేశారని సమాచారం) వారి వివరాలను దరఖాస్తుదారు పరిశీలించే అవకాశం కల్పించాలని తెలిపింది. ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ వర్సిటీ పిటిషన్ వేయగా.. కోర్టు 2017లో స్టే విధించింది. తర్వాతకాలంలో ఈ అంశంపై హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన తీర్పును రిజర్వు చేసిన జస్టిస్ సచిన్‌దత్తా సోమవారం వెలువరించారు. పాలనలో పారదర్శకత కోసం ఆర్టీఐ చట్టాన్ని తీసుకొచ్చారుగానీ సంచలనాలకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వటం కోసం కాదన్నారు.

పదవులకు కనీస విద్యార్హతలు ఏమీ లేవు

ప్రధాని, మంత్రి వంటి ప్రభుత్వ పదవులు నిర్వహించేవారికి ఎటువంటి విద్యార్హతలను రాజ్యాంగం నిర్దేశించలేదని, కాబట్టి, వారి విద్యార్హతల సమాచారం వెల్లడించాల్సిన అవసరం లేదని జస్టిస్ సచిన్ దత్తా తెలిపారు. ఒక వ్యక్తికి సంబంధించిన మార్కుల మెమో, ఫలితాలు, డిగ్రీ, సర్టిఫికెట్ వంటివి వ్యక్తిగత సమాచారమని, అది ఆర్టీఐ పరిధిలోకి రాదని.. ప్రభుత్వ పదవుల్లో ఉన్న వారికైనా ఇదే వర్తిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర మాజీమంత్రి స్మృతీ ఇరానీ చదివిన 10, 12వ తరగతుల ఫలితాలను వెల్లడించాలన్న సీఐసీ ఆదేశాల్ని కూడా జస్టిస్ సచిన్‌దత్తా కొట్టివేశారు. సంచలనం కోసమే ముందుకొచ్చే ఇటువంటి డిమాండ్లను ఆమోదిస్తే.. అవి తామరతంపరగా పెరిగిపోతాయని న్యాయమూర్తి తన 175 పేజీల తీర్పులో పేర్కొన్నారు. కాగా, విచారణ సందర్భంగా ఢిల్లీ వర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. 1978 బ్యాచ్ బీఏ ఫలితాల్ని బహిరంగపర్చలేంగానీ కోర్టుకు చూపించటానికి వర్సిటీకి ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. కాగా, ప్రధాని మోదీ డిగ్రీ వివరాలు వెల్లడించాల్సిందేనని, అలా వెల్లడించేందుకు నిరాకరించిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రజాసంబంధాల అధికారి జీతం నుంచి రూ.25 వేలు కోత విధించాలని అప్పటి కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు 2016 డిసెంబర్‌లో జారీ చేసిన తుది ఆదేశాల్ని హైకోర్టు కొట్టేసింది.

రాజస్థాన్‌ను ముంచెత్తిన వరదలు

వేర్వేరు ఘటనల్లో నలుగురు చిన్నారులు సహా ఆరుగురి మృతి



జదావతా గ్రామంలో వరదతో ఏర్పడిన భారీ బిలం

జైపూర్/న్యూఢిల్లీ, ఆగస్టు 25: రాజస్థాన్‌ను వాన ముంచెత్తింది. తెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షాలతో 19 జిల్లాలు అతలాకుతలమవుతున్నాయి. సుర్వాల్ డ్యామ్ ఉప్పొంగడంతో.. జదావతా అనే గ్రామంలో నేల తీవ్రంగా కోతకు గురై, 2 కిలోమీటర్ల మేర 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతుతో బిలం ఏర్పడింది. గ్రామాలు, పట్టణాలు, నగరాలు అని తేడా లేకుండా అంతటా వరద ఉధృతి కనిపించింది. జైపూర్‌లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా.. రహదారులు చెరువులను తలపించాయి. పలు గ్రామాలకు రాకపోకలు తెగిపోయి.. ప్రజలు ఆకలికేకలు పెడుతున్నారు. సైన్యం, జాతీయ విపత్తు నిర్వహణ బృందం(ఎన్‌డీఆర్ఎఫ్), ఎస్‌డీఆర్ఎఫ్ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఉదయ్‌పూర్‌లోని వర్షిన్ గనుల్లో ఆదివారం వరదనీరు చేరి.. 14 ఏళ్ల వయసున్న లక్ష్మీ గమేటీ, భవేశ్, 12 ఏళ్ల వయసున్న రాహుల్, శంకర్ అనే చిన్నారులు.. నాగోర్‌లో ఇల్లు కూలిన ఘటనతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. సుర్వాల్‌లోని అజ్నోటీ గ్రామం వద్ద ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో.. ఓ యువకుడు మృతిచెందాడు. ఝలావర్ జిల్లాలో ముగ్గురు ప్రయాణిస్తున్న కారు వరదలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో వీరంతా మరణించి ఉంటారని అధికారులు చెబుతున్నారు. సోమవారం ఉదయానికి(గడిచిన 24 గంటల్లో) నాగోర్ జిల్లాలో అత్యధికంగా 17.3 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లోనే రాజస్థాన్‌లో ఇదే అత్యధిక వర్షపాతమని వివరించారు. 1975 తర్వాత రాజస్థాన్‌లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నట్లు వెల్లడించారు. మరో మూడ్రోజులపాటు మోస్తరు నుంచి భారీ/అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు, ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని ఐఐఎంలో భారీగా వరద నీరు చేరింది. క్యాంపస్‌లోని నాలుగు బ్లాకుల్లో గ్రౌండ్‌ఫ్లోర్లు పూర్తిగా నీట మునిగాయి. విద్యార్థులు పైఅంతస్తుల్లో నిలబడి హాహాకారాలు చేసే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ప్రపంచ అయ్యప్ప సంగమానికి సీఎం స్టాలిన్‌కు ఆహ్వానమా?

- హిట్లర్ యూదులతో కలిసి పండుగ చేసుకున్నట్లుగా ఉంది: బీజేపీ

తిరువనంతపురం, ఆగస్టు 25: మొట్టమొదటి 'ప్రపంచ అయ్యప్ప సంగమం' కార్యక్రమానికి తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించిన కేరళ సీఎం విజయన్‌పై బీజేపీ మండిపడింది. ఇది జర్మన్ నియంత హిట్లర్.. తాను అహరహం ద్వేషించే యూదులతో కలిసి పండుగ చేసుకున్నట్లుగా ఉందని ధ్వజమెత్తింది. ఈ అయ్యప్ప సంగమం వచ్చే నెల 20వ తేదీన పథనంథిట్టలో జరుగనుంది. తన మంత్రివర్గ సహచరులు హిందూయిజంపై అవమానకర వ్యాఖ్యలు చేసినా స్పందించని స్టాలిన్‌ను దీనికి ఆహ్వానించడం హిందూమతాన్ని అవమానించడమేనని బీజేపీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శబరిమలలో అయ్యప్ప భక్తులపై పోలీసు చర్యకు విజయన్ గతంలో ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. ఈ ఇద్దరు అయ్యప్ప భక్తులకు క్షమాపణ చెప్పకపోతే సంగమంలో వారిని పాల్గొననివ్వబోమన్నారు.

మైసూరు దసరా ఉత్సవాలపై వివాదం

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలను ఈ ఏడాది బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్ చేత ప్రారంభించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించడంపై కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. కన్నడ మాతగా భువనేశ్వరీదేవిని ఎలా అంగీకరించాలని గతంలో ఓ ఇంటర్వ్యూలో బాను ముస్తాక్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. భువనేశ్వరీదేవిని కన్నడ మాతగా అంగీకరించని బాను ముస్తాక్, చాముండేశ్వరి దేవికి పుష్పార్చన ఎలా చేస్తారని, చాముండేశ్వరి దేవిపై ఆమెకు నమ్మకం ఉందా అని కేంద్రమంత్రి శోభా కరంద్లాజె ప్రశ్నించారు.

ప్రతి రైతుకూ ఎరువులు అందిస్తాం

రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో 6.48 లక్షల టన్నులు

- 6న గంగవరం పోర్టుకు 15వేల టన్నుల యూరియా
- రెండో వారంలో కాకినాడ పోర్టుకు 30 వేల టన్నులు
- పారదర్శకంగా పంపిణీకి ఇంటిగ్రేటెడ్ సిస్టం ద్వారా పర్యవేక్షణ
- కొరత రాకుండా సమన్వయంతో చర్యలు: మంత్రి అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో ప్రతి రైతుకూ ఎరువులు అందేలా కృషి చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్ర-రాష్ట్ర సమన్వయంపై సోమవారం ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేశారు. 'ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికి 21.34 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరాయి. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ కలిపి 6.22 లక్షల టన్నులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రం మొత్తం రైతుల అవసరాలను బట్టి జిల్లాల వారీగా సరఫరాలను పర్యవేక్షిస్తూ ఎక్కడా కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుని, 1.10 లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఉంచాం' అని మంత్రి వివరించారు. డిపోల్లో 79,633 టన్నుల నిల్వలు ఉండగా, అవసరమైన ప్రాంతాలకు తరలింపు జరుగుతోందని తెలిపారు. కేంద్రం నుంచి 1.30 లక్షల టన్నులు వచ్చాయని, 0.47 లక్షల టన్నులు రాబోతున్నాయని తెలిపారు. ఆగస్టులో 1.65 లక్షల టన్నులు కేటాయించగా, 0.75 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 0.90 లక్షల టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒడిశా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని వివరించారు. ఒడిశాలోని ధమ్రా పోర్టు నుంచి 10,800 టన్నుల యూరియా దిగుమతికి కేంద్రం ఉత్తర్వులిచ్చిందని, వచ్చే నెల 6న గంగవరం పోర్టుకు 15వేల టన్నులు, రెండో వారంలో కాకినాడ పోర్టుకు 30వేల టన్నుల యూరియా రానుందని తెలిపారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఐఎఫ్ఎంఎస్) ద్వారా పర్యవేక్షిస్తున్నామని, తద్వారా రియల్ టైమ్ సమాచారం అందుతోందని తెలిపారు. జిల్లా అధికారులు, సహకార సంఘాలు, వ్యవసాయశాఖ సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో ఎవరైనా అధిక ధరలకు అమ్మే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 6.48లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. 'వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటలకు ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎరువులు అందిస్తున్నాం. నల్లబియ్యం, అరటి, చెరకు వంటి పంటలకు తగిన ఎరువులు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం' అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

ఆ ఆలోచన వెంటనే విరమించుకోవాలి.. సీపీఐ రాష్ట్ర మహాసభ డిమాండ్

- మహాసభలో మొత్తం 64 తీర్మానాలు
- బీజేపీ చెప్పుచేతల్లో రాజ్యాంగ వ్యవస్థలు: డి.రాజా

ఒంగోలు, ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల త్యాగాలతో ఏర్పాటై జాతికి గర్వకారణంగా, స్వావలంబనకు చిహ్నంగా ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. అందుకోసం తీసుకుంటున్న చర్యలను తక్షణం నిలిపివేయాలని కోరింది. ఒంగోలులో జరుగుతున్న పార్టీ 28వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై చర్చించి తీర్మానాలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకుడు ఎం.ఆదినారాయణ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలో కోనేరు రంగారావు కమిటీ సిఫారసులకు అనుగుణంగా పేదలకు భూ పంపిణీ చేయాలని, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మహాసభ తీర్మానించింది. రాష్ట్రంలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పించాలని మహాసభ కోరింది. లులూ సంస్థకు ఆర్టీసీ స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం తెచ్చిన 133 జీవోను తక్షణం రద్దు చేయాలని, స్త్రీ శక్తి (ఉచిత బస్సు) పథకం విజయవంతానికి 3వేల కొత్త బస్సుల కొనుగోలు చేయాలని, పది వేల మంది సిబ్బందిని నియమించాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని, నీటి హక్కులకు భంగం కలగకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని మహాసభ కోరింది. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని, దానిని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. రాజధాని అమరావతి నిర్మాణానికి అదనపు భూసేకరణను వ్యతిరేకించింది. మహాసభలో మొత్తం 64 తీర్మానాలు చేశారు.



సీపీఐ రాష్ట్ర మహాసభల్లో 'బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ సీపీఐ ఇన్ ఆంధ్రప్రదేశ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డి.రాజా తదితరులు

ట్రంప్ డైరెక్షన్‌లో మోదీ ప్రభుత్వం:డి.రాజా

మహాసభ ముగింపు సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగ వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకొని పాలిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఐ స్వతంత్ర బలం పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా రాష్ట్రంలో పార్టీ పటిష్టత, విస్తరణపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. 'బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ సీపీఐ ఇన్ ఆంధ్రప్రదేశ్' పేరుతో రచించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా రాజా ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో డి.రాజా మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితిలోకి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ రాజకీయ కారణాలతో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేశారో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పహల్గాం ఉగ్రదాడిని కూడా రాజకీయం చేస్తున్నారని, ట్రంప్ డైరెక్షన్‌లో మోదీ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. స్వతంత్రంగా ఉండాల్సిన ఎన్నికల కమిషన్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకుని ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సెప్టెంబరు 1న బిహార్‌లో పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో సీపీఐ 25వ జాతీయ మహాసభలు నిర్వహిస్తామని వెల్లడించారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అందులో భాగంగా డిసెంబరు 26న ఖమ్మంలో భారీ ప్రదర్శన ఉంటుందని, డిసెంబరు 24, 25 తేదీల్లో వివిధ దేశాల ప్రతినిధులతో విజయవాడలో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, తెలంగాణ కార్యదర్శి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. పార్టీ నిబంధనల మేరకు రామకృష్ణ ఇప్పటికే మూడు పర్యాయాలు రాష్ట్ర కార్యదర్శి పదవిలో కొనసాగినందున ఇప్పుడు కొత్తవారిని ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో నూతన రాష్ట్ర కార్యదర్శి పదవి కోసం గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు, కడప జిల్లాకు చెందిన గుజ్జుల ఈశ్వరయ్య మధ్య పోటీ నెలకొంది. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేసినట్టు తెలిసింది.

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

నేడు, లేదా రేపు అల్పపీడనం
ఉత్తరకోస్తాకు రెండు రోజులు భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు అనుకుని వాయవ్య బంగాళాఖాతంలో సోమవారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో మంగళవారం లేదా బుధవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉత్తరకోస్తాలో పలుచోట్ల ముసురు వాతావరణం నెలకొని తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. మంగళ, బుధవారాల్లో ఉత్తకోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాలో మంగళవారం భారీ నుంచి అతి భారీ, బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే, మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం విశాఖ జిల్లాలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది. కాగా, సోమవారం దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగింది. బాపట్లలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

'పదోన్నతుల్లో రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు అమలుచేయాలి'

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు తీర్పును అనుసరించాలని ఆలిండియా ఈక్వాలిటీ ఫోరం సెక్రటరీ శ్రీనివాస్, సచివాలయ బీసీ, ఓసీ సంఘ నాయకులు రాజేశ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఐఏఎస్ అధికారుల కమిటీ ఇన్షియల్ క్యాడర్ ప్రాతిపదికగా ప్రమోషన్లలో రిజర్వేషన్ అంశాన్ని పునఃసమీక్షించి, తదనుగుణంగా రివైజ్డ్ ప్యానెల్స్ రూపొందించాలని నివేదిక ఇచ్చిందన్నారు. అయితే ఇప్పుడు కొందరు అధికారులు ఆ రిపోర్టులోని ఇన్షియల్ క్యాడర్ పదాన్ని మార్చి ఫీడర్ క్యాటగిరీ ప్రాతిపదికగా తీసుకోవాలని సవరించి మంత్రివర్గ ఉప సంఘానికి ఇచ్చి తప్పు దోవ పట్టించినట్టు తెలిసిందని చెప్పారు.

గ్రామాల ఆదాయం గ్రామాభివృద్ధికే: మంత్రి నారాయణ

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల నుంచి వచ్చే ఆదాయాన్ని వాటి అభివృద్ధికే ఖర్చుపెట్టాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలు, పట్టణాభివృద్ధి సంస్థలకు ఆ దిశగా ఆదేశాలు ఇచ్చామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి తరువాత తిరుపతి నగరపాలక సంస్థ, తుడా అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "గత వైసీపీ ప్రభుత్వం ప్రజావసరాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. పోతూపోతూ పది లక్షల కోట్ల అప్పు, 85 లక్షల టన్నుల చెత్త మిగిల్చి వెళ్లారు. చెత్త నిల్వల వలన ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఎన్జీటీ, సుప్రీం కోర్టు అక్షింతలు వేసినప్పటికీ గత ప్రభుత్వానికి చలనం రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబరు 2వ తేదీలోపు తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికే 73 లక్షల టన్నుల చెత్త తొలగించాం. అదే విధంగా రాష్ట్రంలోని ఆరు కేంద్రాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నాం.' అని చెప్పారు.

ఆయుష్‌కు ఆదరణ పెరుగుతోంది

- జోన్-2 మేళాలో ఆయా విభాగాల రాష్ట్ర ఏడీల వెల్లడి

ఏలూరు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖల వైద్య విధానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రజల నుంచి వీటికి ఆదరణ లభిస్తోందని ఆయుర్వేద విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సాయి సుధాకర్, యునాని అసిస్టెంట్ డైరెక్టర్ వై.శేఖర్ చెప్పారు. ఈ వైద్య విధానంలో చేపట్టిన సంస్కరణలు, విస్తరణలో భాగంగా జోన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, రిటైల్ షాపుల నిర్వహణ, రెన్యువల్స్ కోసం ఏలూరులో మేళా నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన మేళాలో సాయి సుధాకర్, వై.శేఖర్ మాట్లాడారు. చిత్తూరు, ధర్మవరం, కాకినాడల్లో ప్రైవేటు రంగంలో కొత్తగా ఆయుర్వేద కళాశాలలు స్థాపించే ప్రతిపాదనలు ఉన్నాయని సాయి సుధాకర్ చెప్పారు. ఆయుర్వేద వైద్యం పొందినవారు వైద్య ఖర్చులను తిరిగి పొందేందుకు ఉద్దేశించిన చట్టాన్ని అసెంబ్లీ ఆమోదించిందని, దీనివల్ల వైద్య ఖర్చులను ప్రైవేటు ఆయుర్వేద క్లినిక్‌లకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోందని తెలిపారు. అమరావతి పరిధిలోని మూలపాడు వద్ద 200 ఎకరాల విస్తీర్ణంలో హెర్బల్ మెడిసినల్ ప్లాంట్, ల్యాబ్ స్థాపనకు మెడిసినల్ ప్లాంట్ బోర్డుతో ఒప్పందం జరిగిందని తెలిపారు. విజయవాడ సమీపంలోని కాటూరి మెడికల్ కాలేజీ పక్కన 10 ఎకరాల విస్తీర్ణంలో నేచురోపతి రీసెర్చి స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ఫోన్‌లో ఆర్డర్ చేస్తే గంజాయి డెలివరీ!

- అనంతపురంలో 8.291 కిలోలు స్వాధీనం, ముగ్గురి అరెస్టు

అనంతపురం క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో ఆర్డర్ చేసి, గంజాయి తెప్పించి విక్రయిస్తున్న ముగ్గురిని అనంతపురం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 8.291 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లక్ష్మి సురేఖ, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ వెల్లడించారు. గత నెల 18న టీవీ టవర్ ప్రాంతంలో తనిఖీలు చేయగా, 418 గ్రాముల గంజాయి దొరికింది. నిఘా ఉంచిన పోలీసులు ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని మసీదు దగ్గర బుడ్డప్ప నగర్‌కు చెందిన షికారి నాగమణి, ఎన్టీఆర్ కాలనీకి చెందిన షికారి శీనా, వెంగమనాయుడు కాలనీకి చెందిన షికారి జునను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

చిన వెంకన్న సేవలో జస్టిస్ కృష్ణమోహన్



ద్వారకాతిరుమల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సోమవారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో జస్టిస్ హరిహరనాథ శర్మ



తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

మల్లేశ్వరుని సన్నిధిలో జస్టిస్ చక్రవర్తి



పెదకాకాని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకానిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి దంపతులు సోమవారం దర్శించారు. మల్లేశ్వర స్వామి వారికి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్ జస్టిస్ చక్రవర్తి దంపతులను శేష వస్త్రాలతో సత్కరించారు.

చిట్వేలి అడవిలో పెద్దపులి

- శేషాచలంలోకీ వచ్చి ఉండచ్చని అంచనా


చిట్వేలి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి

మంగళం(తిరుపతి)/రైల్వేకోడూరు రూరల్/చిట్వేలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా చిట్వేలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టు అటవీ శాఖ వన్యప్రాణి విభాగం గుర్తించింది. దీంతో తిరుమల అడవుల్లోకి కూడా పెద్దపులి అడుగుపెట్టి ఉండచ్చని అంచనా వేస్తున్నారు. చిట్వేలి రేంజ్ పరిధిలో 30 ట్రాప్ కెమెరాలను ఇటీవల ఏర్పాటు చేయగా... రాత్రి సమయంలోనే కాక, పగటి పూట కూడా స్వేచ్ఛగా పెద్దపులి తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి .రెండు లేదా మూడు పులులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు భావిస్తున్నారు. శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు నుంచి నల్లమల శేషాచలం కారిడార్ ద్వారా ఇవి చిట్వేలి ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని అంటున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వీధికుక్కల వివాదం

ఎనిమిది వారాల్లోగా ఒక్క వీధికుక్క దేశరాజధాని రోడ్లమీద కనబడకూడదంటూ సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ జారీచేసిన ఆదేశాలు కఠినంగా ఉండటంతో పాటు, ఆచరణలో అసాధ్యమని కూడా గ్రహించినందున అనంతరం సర్దుబాట్లు, దిద్దుబాట్లు జరిగాయి. అత్యంత వివాదాస్పదమైన ఓ అంశంమీద తీర్పు కూడా వివాదాస్పదమైన రీతిలో ఉన్నందున, మరుసటి తీర్పు జంతుప్రేమికులకు నచ్చింది. ఢిల్లీ, సబర్బన్‌ప్రాంతాల్లో పదిలక్షలవరకూ వీధికుక్కలు ఉంటాయన్న అంచనాల నేపథ్యంలో, రెండునెలల్లోనే ఈ వీధికుక్కలన్నింటినీ పట్టుకొని, జంతు సంరక్షణాకేంద్రాలకు తరలించాలనడమే కాదు, మళ్ళీ వాటిని వీధుల్లోకి వదలకుండా అక్కడే నిర్బంధించాలన్న తొలి తీర్పు ఆచరణలో ఎంతో అమానవీయంగా అమలు జరుగుతుందని జంతుప్రేమికులు బాగా భయపడ్డారు. మూగజీవులమీద కేవలం ప్రేమతో ఆ ఆదేశాలను వ్యతిరేకించినవారిని అటుంచితే, సదరు తీర్పు పలుకారణాల రీత్యా ఆశించినదానికి పూర్తి విరుద్ధమైన ఫలితాన్నిస్తుందని కూడా కొందరు విశ్లేషించారు. టీకాలువేసి, డీవార్మింగ్ చేసి, కుటుంబనియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, వీధికుక్కలను మళ్ళీ అవి ఉంటున్న ప్రాంతాల్లోనే వదిలేయాలని సుప్రీంకోర్టు తన సవరణ తీర్పులో ప్రకటించింది. రాబిస్ ఉన్నవాటినీ, భయానకంగా ప్రవర్తిస్తున్నవాటినీ మినహాయించినప్పటికీ, తొలి, మలి తీర్పులమీద ఇంకా చర్చ సాగుతూనే ఉంది, వివాదం నడుస్తూనే ఉంది.

సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం ఇలా తీర్పు సరిదిద్దుకొనేట్టుగా చేసిన జంతుప్రేమికులకూ, సెలబ్రిటీలకు కుక్కలమీదమాత్రమే అంత ప్రేమ ఎందుకుంటుందని కొందరి ప్రశ్న. శునకాల పట్ల కరుణచూపమంటూ సామాజిక మాధ్యమాల్లో నిజానికి ఒక యుద్ధమే సాగింది. పేరొందిన ప్రముఖులు కోర్టుకు తమ వాదనను, వేదనను నివేదించారు, అభ్యర్థించారు, కొందరు కన్నీళ్ళు కూడా పెట్టుకున్నారు. ఇదంతా న్యాయస్థానాన్ని ప్రభావితం చేసినందునే, వెంటనే తీర్పును సవరించుకున్నదని అనలేం కానీ, తొలి తీర్పు మరీ కఠినంగా ఉన్నదని న్యాయమూర్తులే ఒప్పుకున్నారు. లక్షలాది వీధికుక్కలను నిర్బంధించి, నిర్వహించగలిగే షెల్టర్ల నిర్మాణం, నిర్వహణ అత్యంత కష్టమైన పని. ఎకరాలకొద్దీభూమి, శునకసేవలకు సరిపడా సిబ్బంది, వాటి ఆహారం, మందులు తడిసిమోపెడవుతాయి. ఆర్భాటంగా ఆరంభమైనా, నిర్వహణ అనతికాలంలోనే భ్రష్టుపడుతుందన్నది వాస్తవం. స్టెరిలైజ్ చేసిన తరువాత, ఎక్కడి కుక్కలను అక్కడే విడిచిపెట్టాలన్న నియమం చాలా అధ్యయనాల అనంతరం రూపొందినందువల్ల అనంతర తీర్పులో సుప్రీంకోర్టు దానిని ఆమోదించింది. గత ఏడాది దేశవ్యాప్తంగా 37లక్షల కుక్కకాట్లు నమోదైతే, రేబిస్‌తో సంభవించిన మరణాల సంఖ్య అధికారికంగా 55మాత్రమే. సామాజిక మాధ్యమాల కారణంగా దేశంలో ఏ మూల కుక్కదాడిచేసినా ఇప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. రేబిస్ సోకినవారి వేదనను తెలియచేసే ఆ కొద్ది వీడియోలు కూడా ఒకటికి పదిసార్లు తిరుగుతూ వీధికుక్కలంటేనే వొణికిపోయేట్టు చేస్తున్నాయి. రేబిస్‌తో ఏటా 20వేల మరణాలు సంభవిస్తున్నాయన్న అనధికారిక లెక్కలను అటుంచితే, కుక్కకాటు తీవ్రమైన సమస్య. సకాలంలో ఇంజక్షన్లు తీసుకొని జాగ్రత్త పడినప్పటికీ, భౌతికంగానూ, మానసికంగానూ ఆ ఘటన మిగల్చే గాయం చిన్నది కాదు. కొందరిని జీవితాంతం అది వెంటాడుతూ ఉంటుంది.

వీధికుక్కలకు సామూహిక సంరక్షణ కేంద్రాల ఏర్పాటుతో సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందనుకొని ఇచ్చిన తొలితీర్పు వివాదాస్పదమై, మళ్ళీ పాతపద్ధతులకే మలితీర్పు ప్రాధాన్యం ఇచ్చింది. వీధికుక్కల సమస్య, వివాదం ఈనాటిది కాదు. భవిష్యత్తులోనూ న్యాయస్థానాల జోక్యం అవసరం రాకుండా ప్రజలు, మరీ ముఖ్యంగా జంతుప్రేమికులు చొరవ చూపాలి. వీధికుక్కల నియంత్రణ, నిర్వహణకు సంబంధించి చట్టంలో నిర్దేశించిన అంశాల్లో సగభాగం కూడా మునిసిపాలిటీలు అమలుచేయడం లేదని, తగినన్ని నిధుల కేటాయింపు, వినియోగం జరగడం లేదని, అబద్ధపు లెక్కలతో అధికారగణమే అత్యధిక భాగాన్ని తినేస్తున్నదని జంతుప్రేమికుల విమర్శ. సుప్రీంకోర్టు మలితీర్పు ఈ అంశాలను విస్తృతంగా చర్చించి, పరిష్కారాలను అన్వేషించేందుకు ఉపకరిస్తుంది. స్థానిక సంస్థల నిర్లక్ష్యాన్ని, నిధుల దుర్వినియోగాన్ని జంతుప్రేమికులు ఎప్పటికప్పుడు ప్రశ్నించాలి. ఏటా నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు పరిపూర్తి చేసేట్టుగా నిరవధిక ఒత్తిడి ఉంచాలి. వాక్సినేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియలు నిక్కచ్చిగా, నిర్దిష్టంగా జరిగేట్టు చేస్తే వీధికుక్కలు పరిమితంగా ఉంటాయి, వివాదాలూ హద్దులు దాటవు.

‘సుప్రీం’ సందిగ్ధత ఎన్నికలకు శాపం!



ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇంతగా వివాదాస్పదమై పలచనైపోయిన సందర్భం ఇంతకుముందు ఎప్పుడూ లేదనుకుంటాను. ఒకవైపు ఎన్నికలు చేరువలో ఉన్న బిహార్‌లో ఉన్నట్టుండి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో చేపట్టిన కార్యక్రమం అభాసుపాలవుతున్నది. ఇంకొకవైపు ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పరిశోధించి బయటపెట్టిన భారీ దొంగ ఓట్ల బండారం ప్రజాస్వామ్యానికి పెనుముప్పును సూచిస్తూ కమిషన్ తలదించుకోవలసిన పరిస్థితిని కలిగించింది. ఈ రెండు ఉదంతాల్లోనూ అది కేంద్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిపోయింది.

ఏ పార్టీ, లేదా ఏ శక్తి, వ్యక్తి ఒత్తిడికీ లొంగకుండా సర్వ స్వతంత్రంగా పని చేయడానికే ఈసీకి రాజ్యాంగ హోదా కల్పించారు. ఎన్నికల నిలువుటద్దంలో ప్రజల తీర్పును యథాతథంగా ప్రస్ఫుటింపజేయవలసిన గురుతర బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు దీనికి అప్పగించారు. అందుకు విరుద్ధంగా అది డూడూ బసవన్న అయిపోవడం ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. శేషన్ హయాంలో మితిమించిన కాఠిన్యం, ఇప్పుడు శ్రుతిమించిన దాసోహం. ప్రజాస్వామ్యంలోని సున్నితత్వాన్ని హరించిన శేషన్‌ను భరించగలిగాం గాని, జ్ఞానేశ్ వెన్నెముకలేమి దుర్భరంగా ఉన్నదని ప్రజలు, విజ్ఞులు వాపోతున్నారు.

రాజ్యాంగం 324 అధికరణ ఎన్నికల సంఘానికి ప్రాణం పోసింది. ఈ ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్‌కు, రాష్ట్రాల శాసనసభలకు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు నిష్పాక్షిక, నిర్భయ వాతావరణంలో ఎన్నికలు జరిపించడం ఎన్నికల కమిషన్ ప్రధాన బాధ్యత. ఇంకా ఆయా ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడం, ఎన్నికల్లో పార్టీలకు ప్రవర్తనా నియమావళి (కోడ్) విడుదల చేయడం, అభ్యర్థుల ప్రచార ఖర్చుపై పరిమితి విధించడం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను ప్రవేశపెట్టడం, నోటా మాదిరి విధానాలను చేర్చి ప్రజాస్వామ్య నైశిత్యానికి పదునుపెట్టడం, అభ్యర్థుల క్రిమినల్ నేపథ్యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం ఎన్నికల కమిషన్‌కు గల ఇతర అధికారాలు.

ఈ కమిషన్ 1950లో నెలకొన్నది. 1989లో ఓటింగ్ కనీస వయసును 21ఏళ్లకు బదులు 18 సంవత్సరాలు చేశారు. అప్పుడు తొలిసారిగా ఏకసభ్య కమిషన్ ముగ్గురు సభ్యుల వ్యవస్థగా మారింది. ఎన్నికల కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉండే జీతభత్యాలు, సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయి. ఎన్నికల నిష్పాక్షికతను కాపాడి ఓటు పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూడవలసిన అవసరాన్ని గుర్తించి ఎన్నికల సంఘాన్ని ఇంతటి ఉన్నత స్థానంలో ఉంచారు. ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళనకరం. ఎన్నికల కమిషన్ ఎంత నిష్పక్షపాతంగా ఉండాలో సుప్రీంకోర్టు అనేకసార్లు విశదీకరించింది. ఇంత ప్రాధాన్యం కలిగిన ఎన్నికల కమిషన్‌కు కమిషనర్లను నియమించే ప్రక్రియ చాలా కాలం పాటు కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో ఉంది. దానికి స్వస్తి చెప్పేందుకు సుప్రీంకోర్టు సాగించిన ప్రశంసాపాత్రమైన కృషి విఫలమై తిరిగి కేంద్రం గుత్తాధిపత్యానికే దారితీసింది. ఇదే ప్రస్తుత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌ను ఏరికోరి నియమించుకునే అధికారాన్ని మోదీ ప్రభుత్వానికి ఇచ్చింది.

ఉన్నత న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రభుత్వం పార్లమెంటు ద్వారా నెలకొల్పిన జాతీయ న్యాయ నియామక కమిషన్‌ను కొనగోటితో తొలగించి కొలీజియంను కాపాడుకున్న సుప్రీంకోర్టు... ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని తిరిగి చేర్పించే విషయంలో ఇంతగా వెనుకాడడం దేశ ప్రజాస్వామ్యాన్ని కంపింపజేస్తున్నది.

ఎన్నికల కమిషనర్లుగా సీనియర్ ఐఏఎస్‌లను, కేంద్ర కేబినెట్ సెక్రటరీలుగా పనిచేసిన వారిని, ఆ స్థాయి ఇతరులను నియమించేవారు. అందుబాటులోని ఇటువంటివారిలో తమకు ఇష్టులైన వ్యక్తులను సీఈసీలుగా, ఈసీలుగా ప్రధానమంత్రులు సిఫారసు చేయడం, వారిని రాష్ట్రపతి నియమించడం ఆనవాయితీగా చాలాకాలం పాటు కొనసాగింది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ 2015లో రిటైర్డ్ ఐఏఎస్ అనూప్ బరన్వాల్ దాఖలు చేసిన జనహిత వ్యాజ్యం ఈ వ్యవహారాన్ని కీలకమైన మలుపు తిప్పింది. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ, ఎవరి జోక్యానికీ అతీతంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలని ఈ పిటిషన్‌లో కోరారు. అప్పటికున్న నియామక విధానం ఎన్నికల స్వచ్ఛతను, నిష్పాక్షికతను హరిస్తున్నదని పిటిషనర్ వాదించారు. వాస్తవానికి ఎలక్షన్ కమిషనర్ల నియామకానికి అనుసరించవలసిన పద్ధతిని నిర్దేశిస్తూ పార్లమెంటు ప్రత్యేక చట్టాన్ని చేయాలని రాజ్యాంగం 342(2) 53(3)(బి)లు సూచిస్తున్నాయి. అటువంటి చట్టం లేకపోవడాన్ని ఆసరా చేసుకుని కేంద్ర పాలకులు ఇంతటి ముఖ్యమైన విషయంలో నిరంకుశంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ కేసును విచారణకు స్వీకరించిన జస్టిస్ కేఎం జోసెఫ్ ఆధ్వర్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2023లో తీర్పు ఇచ్చింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి తగినవారిని రాష్ట్రపతికి సిఫారసు చేయడానికి ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో ఒక కమిటీని వేయాలని స్పష్టం చేసింది. పార్లమెంటు ఒక చట్టం చేసేవరకు ఈ కమిటీ కొనసాగాలని చెప్పింది.

స్వేచ్ఛతో కూడిన, స్వచ్ఛమైన ఎన్నికలకు నిష్పాక్షిక సీఈసీ అత్యంత అవసరమన్న ధర్మాసనం సందేశానికి విరుద్ధంగా కేంద్రం అతి తెలివిని ప్రదర్శించింది. కమిషనర్లుగా నియామకానికి తగినవారిని సిఫార్సు చేసే కమిటీ నుంచి సీజేఐని తొలగిస్తూ పార్లమెంటు చేత చట్టం చేయించింది. ఈ చట్టం ప్రకారం ప్రధాని, ఒక కేంద్రమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకానికి పేర్లను సిఫారసు చేస్తుంది. ఆ విధంగా కేంద్ర పాలకులు ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో తమ నిరంకుశ నిర్ణయానికి దారి చేసుకున్నారు. ఈ చట్టాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ మధ్యప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయా ఠాకూర్ 2024 జనవరిలో సుప్రీంకోర్టులో దావా దాఖలు చేశారు. ఆ తర్వాత ‘అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్’ దీనిని (ఎడిఆర్) సవాలు చేసింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించింది. కానీ కేంద్ర చట్టంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.


పార్లమెంట్‌కు, న్యాయవ్యవస్థకు పోటీ సృష్టించిన ఈ కేసులో చొరవ చూపడానికి సుప్రీంకోర్టు వెనుకాడుతున్నదని, దానివల్ల ఎన్నికలు కేంద్ర పాలకుల చేతిలో మైనపు ముద్దలా తయారై ప్రజాస్వామ్య ధర్మానికి తీవ్ర విఘాతం కలుగుతున్నదని భావించక తప్పడం లేదు. ఇంత పెద్ద దేశంలో ఎన్నికల వ్యవస్థ పాలకుల పంజరంలో చిలుక కావడం దారుణం. దీని ఫలితమే ప్రస్తుత సీఈసీ నిర్వాకం. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేశారు. మరో కమిషనర్ సతీశ్ చంద్ర పాండే అప్పటికే రిటైర్ అయ్యారు. కేంద్రం ఈ సందును ఉపయోగించుకుని జ్ఞానేశ్ కుమార్‌ను, సుఖ్‌బీర్‌సింగ్‌ను ఎన్నికల కమిషనర్లుగా నియమింపజేసింది. ఆ తర్వాత జ్ఞానేశ్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ చేశారు. ఇంతలోగా జస్టిస్ ఖన్నా విచారణ బాధ్యతల నుంచి తప్పుకోవడం, కేసు మరో ధర్మాసనానికి వెళ్లడం జరిగిపోయాయి. దీనితో ఈ కేసు ఇప్పటికీ ఒక కొలిక్కి రాకుండా, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ కేంద్రం నిరంకుశాధిపత్యంలోనే కొనసాగుతున్నది.

సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ తదుపరి సార్వత్రిక ఎన్నికలకు తెరలేవడానికి ముందు వరకు కొనసాగుతారు. ఎన్నికల కమిషనర్లకు సమాన హోదా లేదు, ముగ్గురినీ రాష్ట్రపతే నియమిస్తున్నప్పటికీ సీఈసీని తొలగించడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉద్వాసన చెప్పే పద్ధతినే అనుసరించవలసి వుండగా, ఎన్నికల కమిషనర్లను మాత్రం సీఈసీ సిఫార్సుల మేరకు తప్పించాల్సి ఉంటుంది. ఇది కమిషనర్లను సీఈసీ చెప్పుచేతల్లో ఉంచుతుంది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి పార్లమెంట్ చేసిన చట్టంపై ఖన్నా ధర్మాసనం స్టే విధించి ఉన్నా, దానిని రద్దు చేసినా ఈ దుస్థితి తొలగి ఉండేది. ఉన్నత న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రభుత్వం పార్లమెంటు ద్వారా నెలకొల్పిన జాతీయ న్యాయ నియామక కమిషన్‌ను కొనగోటితో తొలగించి కొలీజియంను కాపాడుకున్న సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని తిరిగి చేర్పించే విషయంలో ఇంతగా వెనుకాడడం దేశ ప్రజాస్వామ్యాన్ని కంపింపజేస్తున్నది. ఇప్పటికైనా అత్యున్నత న్యాయ స్థానం కర్తవ్య స్పృహతో ఈసీల నియామక నిరంకుశ చట్టాన్ని రద్దు చేసి ఎన్నికల సంఘాన్ని జోక్యానికి, చొరబాటుకు వీలులేని దుర్భేద్య వ్యవస్థగా చేస్తుందని ఎదురు చూద్దాం.

▪ **గార శ్రీరామమూర్తి**
సీనియర్ పాత్రికేయులు

విదేశాంగ విధానంలో మోదీ తడబాట్లు!

భారత్-పాక్ మధ్య తానే యుద్ధాన్ని ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముప్పైసార్లు ప్రకటిస్తే, పార్లమెంట్ వేదికగా జరిగిన చర్చలో ప్రధానమంత్రి మోదీ మాటమాత్రమైనా ట్రంప్ వ్యాఖ్యల్ని ఖండించలేదు. దాయాది దేశమైన పాక్ విషయంలో కానీ, మన కశ్మీర్ విషయంలో కానీ భారత్ ఏనాడూ మూడోదేశం జోక్యాన్ని అనుమతించలేదు. అయితే, ఈ విషయంలో మోదీని వాణిజ్యం సాకుగా చూపి ఒప్పించానని ట్రంప్ పదేపదే చెప్పారు. అయితే, ఏ వాణిజ్య అంశం ఆపరేషన్ సిందూర్ ద్వారా పీఓకేను తిరిగి తెచ్చుకునే అవకాశానికి అడ్డంకిగా మారిందో, ఇప్పుడు ఆ వాణిజ్య ప్రయోజనం కూడా దక్కలేదు. మొన్నటి ఆగస్టు 1 నుంచి 25శాతం సుంకంతో పాటు, ఈ నెల 27 నుంచి మరో 25శాతం జరిమానాను కలిపి, మొత్తం 50శాతం సుంకాలను భారత ఉత్పత్తులపై విధిస్తున్నామన్న ట్రంప్ ప్రకటనతో మన దేశ పరిస్థితి రెంటికీ చెడిన రేవడి అయింది. కరోనా భయాలు పోయి వాణిజ్యం గాడిన పడుతున్నదనుకుంటున్న దశలో పులి మీద పుట్రలా ట్రంప్ సుంకాలు దాపురించాయి. ఒకవైపు ఐటీ కంపెనీల లే ఆఫ్‌లు, ఎంఎస్ఎంఈల మూసివేతలు కొనసాగుతుండగానే ఇప్పుడీ అమెరికా వాణిజ్య సుంకాల బరువుతో మన దేశంలో నిరుద్యోగ పరిస్థితి ఎంత పెరుగుతుందో అన్న ఆందోళన కలుగుతున్నది.



అమెరికా సుంకాల యుద్ధం నుంచైనా మోదీ ప్రభుత్వం తీరు మార్చుకోవాలి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఎకానమీగా మారబోతున్నాం అన్న పేరుతో ప్రజల కష్టాన్ని దొంగిలించడం కన్నా మన ఎగుమతుల కోసం ప్రపంచవ్యాప్తంగా ఇతర మార్కెట్లను సృష్టించి ఆ మార్పులో నిజమైన భాగస్వామ్యాన్ని పొందాలి. విదేశాంగ విధానమంటే వ్యక్తిగత ఇమేజ్ బిల్డ్ చేసుకున్నంత ఈజీ కాదని తెలుసుకోవాలి.

విదేశాంగ విధానం దేశానికి పట్టుగొమ్మలా ఉండాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ అలీన విధానంతో ప్రపంచంలోనే భారత్‌కు ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది. తొలి ప్రధాని నెహ్రూ విధానంతో ప్రతీ ఒక్కరూ మన దేశాన్ని గౌరవించారు. నాటి ప్రచ్ఛన్న యుద్ధ కాలంలోనూ మన దేశం అటు సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలను నెరుపుతూనే ఇటు అమెరికాతోనూ స్నేహ సంబంధాలను కొనసాగించింది. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలోనూ అమెరికా తమ భాగస్వామి పాకిస్థాన్ కోసం మన దేశంపై ఎంత ఒత్తిడి తెచ్చినా, నాటి ప్రధాని ఇందిర ఏ మాత్రం లొంగలేదు. మరో కొత్త దేశంగా బంగ్లాదేశ్ ఆవిర్భవించేదాకా యుద్ధాన్ని విరమించేది లేదని తెగేసి చెప్పి సాధించింది. ఆ తర్వాత పోఖ్రాన్‌లో తొలి అణుపరీక్షల సమయంలోనూ అదే తెగువను అమెరికాకు చూపించింది భారత్. పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక అమెరికా-రష్యాలతో పాటు ప్రపంచ దేశాలతో మన సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. అణు పరీక్షలు వద్దని ఆంక్షలు విధించిన అదే అమెరికా 2008లో మన్మోహన్ సింగ్ హయాంలో మనతో అణు ఒప్పందాలు చేసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాలు విదేశాంగ విధానంలో అనుసరించిన అత్యద్భుత విధానాలు మనకు అందించిన గొప్ప విజయాలు ఇవి.

కానీ గత పదకొండేళ్లుగా బీజేపీ హయాంలోని కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కొంత గందరగోళంతో వ్యవహరించింది. ఒక దేశాధినేతగా మరో దేశం అంతర్గత ఎన్నికల అంశాల్లో జోక్యం చేసుకోవడం అవసరం లేనిది. కానీ 2019లో అమెరికాలోని హ్యూస్టన్‌లో ‘హౌడీ మోడీ’ పేరుతో ఏకంగా అగ్రరాజ్య ఎన్నికల్లో ట్రంప్‌కు, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మోదీ ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. 2020లో గుజరాత్‌లో ‘నమస్తే ట్రంప్’ పేర ఆయనతో ర్యాలీ చేయించారు. ఇవి వ్యక్తిగత ప్రతిష్ఠకు, తమ పార్టీ బలోపేతానికి పనికొచ్చాయి కానీ, దేశ ప్రయోజనాలకు కాదన్న సత్యం ఇప్పుడు వారికి బోధపడుతున్నది. మరోవైపు బంగ్లాదేశ్, చివరికి శ్రీలంక, మాల్దీవులు సైతం భారత్‌తో వైరిభావనలో ఉన్నాయి.

ఒకవైపు ‘మేకిన్ ఇండియా’ అనే నినాదాన్ని ఎత్తుకొని, మరోవైపు మార్కెట్లను మన వస్తువులకు మూసేసే విధంగా విదేశాంగ విధానాలు ఉంటే నష్టపోయేది మన ప్రజలే. ఇప్పటికే జీఎస్టీ వసూలుతో కుదేలయిన భారత వస్త్ర పరిశ్రమ ఇప్పుడు అమెరికా సుంకాల పరిధిలోకి రావడంతో పూర్తిగా దిక్కుతోచని స్థితిలో ఉంది. ఆక్వా రైతులు అల్లల్లాడుతున్నారు. మరోవైపు రష్యా చమురు ద్వారా దక్కుతున్న ప్రయోజనం వినియోగదారుడికి చేరడమే లేదు. బ్యారెల్ ముడి చమురు 150 డాలర్లు ఉన్నప్పుడే యూపీఏ ప్రభుత్వం రూ.60కి లీటరు పెట్రోలు అందించింది. ఇప్పుడు 80డాలర్లకు దొరుకుతున్నా రూ.110కి పెట్రోలు కొంటున్నారు సామాన్యులు. మరోవైపు ఈ లాభాలు అంబానీ, అదానీల రిఫైనరీల కోసమే అనే వార్తల్నీ మనం చూస్తున్నాం. ఇదే నిజమైతే అటు విదేశాంగ విధానంలో విఫలమై, ఇటు ఆప్త మిత్రులైన గుజరాతీ వ్యాపారుల కోసం దేశాన్నే తాకట్టు పెట్టే స్థితికి వెళ్లడం మోదీ నియంతృత్వ, అసమర్థ పోకడలకు తార్కాణం.

అమెరికా సుంకాల యుద్ధం నుంచైనా మోదీ, ఆయన ప్రభుత్వం తీరు మార్చుకోవాలి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఎకానమీగా మారబోతున్నాం అన్న పేరుతో ప్రజల కష్టాన్ని దొంగిలించడం కన్నా మన ఎగుమతుల కోసం ప్రపంచవ్యాప్తంగా ఇతర మార్కెట్లను సృష్టించి ఆ మార్పులో నిజమైన భాగస్వామ్యాన్ని పొందాలి. విదేశాంగ విధానమంటే వ్యక్తిగత ఇమేజ్ బిల్డ్ చేసుకున్నంత ఈజీ కాదని తెలుసుకోవాలి.

• **పున్నా కైలాస్ నేత**
జనరల్ సెక్రటరీ, టీపీసీసీ

సింగపూర్ వలె రవాణా చార్జీలు తగ్గించాలి

మన రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా పెంచిన బస్సు చార్జీల కారణంగా, సొంత వాహనంలో ప్రయాణించటం చౌక అని భావించి దూరప్రాంతాలకు సైతం కుటుంబీకులు తమ సొంత కార్లలో, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించటం ఎక్కువైంది. అంతేగాక కారుచౌక వాహన రుణాలతో నగరాలూ, పట్టణాల్లో ఇంటికొక కారు, మనిషికొక ద్విచక్ర వాహనం అనే స్థితి వస్తున్నది. ఫలితంగా విపరీతంగా రద్దీ పెరిగి పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాల వంటివి నిత్యకృత్యాలుగా మారాయి.

ఇంతకు ముందు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కూడా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించినా, గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే తాజా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఓటింగ్ శాతం తగ్గిపోయింది. అంటే ఆ అనుచిత పథకాల కంటే ప్రజలు సుపరిపాలననే కోరుకున్నారు. మన రాష్ట్రంలో కూడా సుపరిపాలన కోసమే వైసీపీ ప్రభుత్వ బటన్ నొక్కుడు జనాకర్షక పథకాలను పట్టించుకోకుండా, క్రమశిక్షణ గల పార్టీగా భావించి ప్రజలు టీడీపీని గద్దె నెక్కించారు. ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం కూడా మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టింది. ఇందుకు ప్రభుత్వంపై, అంటే మళ్ళీ ప్రజలపై పడే అదనపు భారం సాలుకి దాదాపు రెండు వేల కోట్ల రూపాయలట. ఈ ఉచిత బస్సు పథకంలో హేతుబద్ధత లేదు. ఎందుకంటే మహిళా ఉద్యోగులు, సంపన్న మహిళలు కూడా ఉచితంగా ప్రయాణిస్తుంటే ఉద్యోగాల కోసం తిరిగే పేద నిరుద్యోగులు, మగ ప్రయాణికులు మాత్రం ఈ అధిక చార్జీల భారం మోయాలి. ముందు ముందు బస్సుల రద్దీ, కొరత వంటి సమస్యల వల్ల సిబ్బందికి కూడ ఇబ్బందులు రావచ్చు.

ఇక సింగపూర్, మరికొన్ని యూరప్ దేశాలు ట్రాఫిక్, వాయు కాలుష్యాలు, పెట్రోలు, డీజిల్ వాడకం తగ్గించటానికి చౌక రవాణా వ్యవస్థను ఏర్పాటు చేశాయి. మనది అధిక జనాభా కలిగిన ఉష్ణ మండల దేశం, కనుక మన రాష్ట్రంలో కూడా గత వైసీపీ ప్రభుత్వం భారీగా పెంచిన బస్సు చార్జీలతో పాటు, మరికొంత చార్జీలు తగ్గిస్తే మహిళలతో పాటు ప్రజానీకం మొత్తానికి ప్రయోజనం కలుగుతుంది, వ్యక్తిగత వాహన ప్రయాణాలు తగ్గి ఇంధన వాడకం, వాయు కాలుష్యాల వంటివి తగ్గుతాయి. తాత్కాలిక ప్రయోజనాల కంటే దీర్ఘకాలిక ప్రయోజనాలు ముఖ్యం, కాబట్టి ప్రజలు కూడ హర్షిస్తారు. కొందరు మంచి పనులను కూడా విమర్శిస్తూనే ఉంటారు. వారిని పరిగణనలోకి తీసుకోకుండా ఆ పనులు చేసుకుంటూ పోవటమే ప్రభుత్వం బాధ్యత.

– **తిరుమలశెట్టి సాంబశివరావు**, గుంటూరు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

హాస్యానికి ‘శంకు’ తీర్థం!

ప్రముఖ కార్టూనిస్ట్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్, బుల్లితెర సీరియల్స్ డైరెక్టర్ శంకు మరణం కార్టూన్, టీవీ రంగాలకు తీరని లోటు. బాల్యం నుంచే చిత్రలేఖనం మీద ఆసక్తి ఉన్న శంకు పూర్తి పేరు సంపర భీమ శంకర్ కుమార్. ఆయన సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు. 1946 డిసెంబర్ 16న తెనాలిలో జన్మించారు. తండ్రి సంపర రామచంద్రారావు, తల్లి ప్రభావతి. ఐదుగురు సంతానంలో శంకర్ కుమార్ పెద్దవాడు. ఐదో తరగతి చదువుతున్న సమయంలోనే శంకర్ కుమార్‌కు వడ్డాది పాపయ్య బొమ్మల పట్ల ఆసక్తి కలిగింది. ఆ తర్వాత బాపు రేఖాచిత్రాలు చూసి తానూ కార్టూనిస్ట్ కావాలనుకున్నారు. బాపు కార్టూన్లను సేకరించి, ఓ పుస్తకంలో అంటించుకుని వాటిని ప్రాక్టీస్ చేస్తూ కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. శంకర్ కుమార్ గీసిన తొలి కార్టూన్ 1962లో ఆంధ్ర సచిత్ర వార ప్రతికలో ప్రచురితమైంది. అలా మొదలైన ప్రయాణం 2025 ఆగస్టు 24వ తేదీన శంకు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగుతూనే ఉన్నది. అంటే కార్టూనిస్ట్‌గా ఆయనది 63 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం.



కుమార్, శంకర్ కుమార్ పేర్లతో కార్టూన్లు గీస్తున్న సమయంలోనే ఆంధ్రజ్యోతి వారపత్రికలో పనిచేస్తున్న పురాణం సుబ్రహ్మణ్యం శర్మ ‘శంకర్ కుమార్’ పేరులో మొదటి రెండు అక్షరాలైన ‘శం.కు’ను తీసుకుని కలం పేరుగా మార్చుకోమని సలహా ఇచ్చారు. అలా 1970 నుంచి శంకర్ కుమార్ ‘శంకు’గా మారిపోయారు. కార్టూనిస్ట్‌గా ఆయనది 63 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం.

కుమార్, శంకర్ కుమార్ పేర్లతో కార్టూన్లు గీస్తున్న సమయంలోనే ఆంధ్రజ్యోతి వారపత్రికలో పనిచేస్తున్న పురాణం సుబ్రహ్మణ్యం శర్మ ‘శంకర్ కుమార్’ పేరులో మొదటి రెండు అక్షరాలైన ‘శం.కు’ను తీసుకుని కలం పేరుగా మార్చుకోమని సలహా ఇచ్చారు. అలా 1970 నుంచి శంకర్ కుమార్ ‘శంకు’గా మారిపోయారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లోని పత్రికల్లో ఆయన కార్టూన్లు ప్రచురితమయ్యాయి. పలు వారపత్రికలకు ముఖచిత్ర కార్టూన్లూ గీశారు. అప్పట్లో పలు పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో బహుమతి పొందిన కథలకు ఆయన ఇల్లస్ట్రేషన్స్ గీశారు. కొన్ని దిన, వార పత్రికల్లో కార్టూన్ ఫీచర్స్ నిర్వహించారు.

ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే తెలుగు కార్టూనిస్టులను ఏకతాటి పైకి తెచ్చేందుకు విశేష కృషి చేశారు శంకు. అప్పటి లబ్ధప్రతిష్ఠులైన కార్టూనిస్టుల సలహాతో 1976లో ఖమ్మంలో తొలి తెలుగు కార్టూనిస్టుల సమావేశాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఏపీ క్రోక్విల్ అకాడమీని స్థాపించి, క్రోక్విల్ మేగజైన్‌ను తీసుకొచ్చారు. ఆ తర్వాత దాని పేరును ‘క్రోక్విల్ హాస్యప్రియ’గా మార్చారు. పుష్కర కాలం పాటు ఇది మాస పత్రికగా, మరికొంతకాలం పక్ష పత్రికగా వచ్చింది. ఈ పత్రిక ద్వారా కార్టూనిస్టులనే కాకుండా హాస్య రచయితలను సైతం ప్రోత్సహించారు. మద్రాస్‌లో ఉండే డాక్టర్ జయదేవ్ బాబుతో వినూత్నమైన శీర్షికలను నిర్వహించి, కొత్త కార్టూనిస్టులను ప్రోత్సహించారు. కార్టూన్లు గీయడంలో మెళకువలను తెలియచేయడంతో 1980, 90లలో వందలాది మంది యువకులు కార్టూనిస్టులుగా మారిపోయారు. వారందరి తొలి కార్టూన్లు ‘హాస్యప్రియ’లోనే ప్రచురితమయ్యాయంటే అతిశయోక్తి కాదు. అందుకే ఆనాటి కార్టూనిస్టులు ‘శంకు’లో పోసిన తీర్థంగా తమ కార్టూన్లను చెప్పుకునేవారు. వీరందరినీ పరిచయం చేస్తూ 1984లో తెలుగు కార్టూనిస్ట్ డైరెక్టరీని ప్రచురించారు శంకు.

కార్టూనిస్టులను ప్రోత్సహించడంతో ఆగిపోకుండా డీడీ నేషనల్ కోసం శంకు 1999లో ‘ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా’ పేరుతో దేశంలోని 13 మంది ప్రముఖ కార్టూనిస్టులపై డాక్యుమెంటరీని తీశారు. ఇది అనేకసార్లు దూరదర్శన్‌లో ప్రసారమైంది. దాంతో డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్‌గా ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆ ఉత్సాహంతోనే 2006లో మునిమాణిక్యం నరసింహారావు ‘కాంతం కథలు’ను, సత్యం శంకరమంచి ‘అమరావతి కథలు’ను ధారావాహికగా తీసుకొచ్చారు. ప్రముఖ దర్శకుడు వంశీ రాసిన ‘మా పసలపూడి కథలు’ను, సలీం కథలను కూడా సీరియలైజ్ చేశారు. దీనితో పాటు ‘మహదానందం’, ‘కాదంబరి’, ‘హాస వికాసం’ వంటి సీరియల్స్ నిర్మించారు. ఇవన్నీ చక్కని ఆదరణ పొందాయి. దీంతో ఏకంగా శంకు తొమ్మిది నంది అవార్డులను అందుకున్నారు. శంకు రాసిన తొమ్మిది కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 1992లో నాకీస్ట్ అంతర్జాతీయ కార్టూన్ల పోటీలో అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ సహకారంతో బెల్జియం వెళ్లి స్వయంగా దానిని స్వీకరించారు. తెలుగు ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్‌గానూ సేవలు అందించారు. ‘ఈ కార్టూన్లు మీవే’ పేరుతో కలర్‌లో శంకు కార్టూన్ల సంకలనాన్ని తీసుకొచ్చారు.

ప్రముఖ దర్శకుడు బాపుతో ఉన్న సాన్నిహిత్యంతో శంకు ఆయన దర్శకత్వం వహించిన దాదాపు తొమ్మిది చిత్రాలకు సహాయకుడిగా పనిచేశారు. రాజేంద్ర ప్రసాద్, ఆమని జంటగా నటించిన ‘మిస్టర్ పెళ్లాం’ సినిమాకు సహ నిర్మాతగా వ్యవహరించారు. ‘అల్లరికం’ పేరుతో ఓ సినిమా స్క్రిప్ట్ రాసి, రేలంగి నరసింహారావు దర్శకత్వంతో దాన్ని తెరకెక్కించే ప్రయత్నం చేశారు. ప్రతిరోజూ తన స్నేహితులకు, సన్నిహితులకు తాను గీసిన కార్టూన్లను వాట్సప్ ద్వారా, శుభోదయ సందేశంగా పంపడం శంకుకు అలవాటు. ఎనభై ఏళ్ళు సమీపిస్తున్నా నిత్య చైతన్యశీలిగా ఉంటూ, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని కార్టూనిస్టులకు గురువుగా, మార్గదర్శిగా వ్యవహరించారు.

చిత్రం ఏమిటంటే– కార్టూనిస్ట్ వాడ్రేవు శ్రీనివాసరావు డీడీ యాదగిరి ఛానెల్‌లోని ‘కార్టూన్ కబుర్లు’ ప్రోగ్రామ్ కోసం శంకును ఇటీవల ఇంటర్వ్యూ చేశారు. ఆగస్ట్ 23 ఉ.9.00గంటలకు ఇది ప్రసారమైంది. దీన్ని చూసిన వారంతా ఆ తర్వాత 24 గంటలు గడవకముందే శంకు తనువు చాలించారంటే నమ్మలేకపోయారు. శంకు భౌతికంగా దూరమైనా ఆయన కార్టూన్ రంగానికి చేసిన సేవ చిరస్మరణీయం.

◆ **ఓనావ**
కార్టూనిస్ట్

సురవరా.. సకల జనవరా...

ప్రతి దేశానికి ఒక జాతీయ జెండా ఉంటుంది
కానీ, దేశ దేశాల పీడితులకు మాత్రం
ఎర్ర జెండానే!
ఈ దేశపు ఎర్రజెండా సురవరం

సురవరం ప్రతాపరెడ్డి అంటే
గోలకొండ, ఆంధ్రుల సాంఘిక చరిత్ర
సురవరం సుధాకర్ రెడ్డి అంటే
ఎగరేసిన ఎర్రజెండా చరిత్ర

ఎట్టి చాకిరీపై తిరగబడుతున్నప్పుడు
ప్రాణం పోసుకున్నాడు
దేశానికి ఏ స్వాతంత్రం లేనప్పుడు
కళ్ళు తెరిచినోడు

మాకింకా స్వాతంత్రం రాలేదని
కలబడుతున్నోళ్ళ పక్కన నిలబడి
కన్నుమూసే దాకా కలబడ్డోడు
వీర తెలంగాణ పోరు కళ్ళజూసి
తన చూపును
విముక్తిదిశగా మళ్ళించినవాడు



సురవరం
నీ స్వరంలో వున్నదేమో భాస్వరం
నువ్వు గొంతెత్తి మాట్లాడుతుంటే
యుద్ధ శతఘ్నులు పేలినట్లు ఉండేది

మా బుగ్గలను ఎరుపెక్కించిన
సురవరా, సకల పీడిత జనవరా

నోరులేనోళ్లకు శ్వాసవై
నిలువలేనోళ్లకు అండవై
మా విముక్తి దేశానికి స్వాతంత్రం అని
కంచు కంఠం పగిలేలా వినిపించిన
సురవరం నువ్వు లేవంటే
గుండె కలుక్కుమంటుండే

సురవరానికి ఎర్ర ఎర్రని లాల్ సలాం
తనను తాను పీడిత దేశానికే
అంకితం చేసుకున్నోడికి
అరుణారుణ సలాం

– **జూలూరు గౌరీశంకర్**






మహామండపం పూర్తిగా భక్తులకే..

దుర్గగుడి అధికారుల ప్రతిపాదనలు

ఐదు, ఆరు మినహా అన్ని అంతస్థులు భక్తులకే వినియోగం

- భక్తులు వేచి ఉండేందుకు కంపార్టుమెంట్లు నిర్మించే యోచన
- ఇప్పటికే దేవస్థాన అవసరాలకు మహామండపం వినియోగం
- దసరా నాటికి కొత్త భవనాలు అందుబాటులోకి..
- అన్నదానం, ప్రసాదంపోటు తరలివెళ్తే మహామండపం ఖాళీ

8



ఇంద్రకీలాద్రిపై మహామండపం

వేగంగా దసరా ఏర్పాట్లు

- లడ్డూ కొరత లేకుండా పోటు భవనంలో గాటు పొయ్యిలు
- గత అనుభవాల దృష్ట్యా ప్రణాళికాబద్ధంగా పనులు
- ప్రధాన ఆలయం, ఉపాలయాలు రంగులతో ముస్తాబు

6

వేరే దారి లేదా?

రోడ్లపై పార్కింగ్ ప్లేసులా?

- వన్‌టౌన్‌లో కార్పొరేషన్ అధికారుల నిర్వాకం
- కీలక రహదారులు పార్కింగ్ ప్లేస్‌లకు కేటాయింపు
- కెనాల్ రోడ్డు, బీఆర్పీ రోడ్డులో పరిస్థితి దారుణం
- రోడ్లలోని సగభాగం వాహనాల నిలిపివేత
- మిగతా వాహనాల రాకపోకలకు ఇబ్బందికరం
- పార్కింగ్ మాఫియాలు.. నిత్యం గొడవలు



ఇవి రోడ్లా.. పార్కింగ్ ప్లేసులా.. వన్‌టౌన్‌లోని కెనాల్ రోడ్డు, బీఆర్పీ రోడ్డును చూస్తే వచ్చే ప్రశ్న ఇది. ఆదాయమే పరమావధిగా కార్పొరేషన్ అధికారులు రహదారులపై పార్కింగ్‌ల ఆట ఆడుతుండగా, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా.. ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకున్న వారు కరువయ్యారు. ఫలితంగా కార్పొరేషన్, కాంట్రాక్టర్లకు కాసుల పంట పండుతుండగా, వాహనదారులకు, దుర్గమ్మ భక్తులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

కెనాల్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు




బీఆర్పీ రోడ్డులో రోడ్డుకు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన కార్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కెనాల్ రోడ్డు, బీఆర్పీ రోడ్డు.. వన్‌టౌన్‌లో కీలకమైన రహదారులివి. ఇంద్రకీలాద్రిపైకి వెళ్లేందుకు ప్రధానమైనది కెనాల్ రోడ్డు. ఈ రోడ్డులో ఒక భాగాన్ని కార్పొరేషన్ అధికారులు పార్కింగ్‌కు కాంట్రాక్టు ఇచ్చారు. దీనివల్ల విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. కెనాల్ రోడ్డు రెండోభాగం కూడా వినియోగంలో ఉంటే రద్దీ తగ్గుతుంది. కాళేశ్వరరావు మార్కెట్ నుంచి భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నంవైపు వెళ్లేవారు ఈస్ట్ కృష్ణా మెయిన్ కెనాల్ బ్రిడ్జి మీదుగా కార్పొరేషన్ కార్యాలయం, శనీశ్వరుడి గుడి నుంచి ప్రకాశం బ్యారేజీ దగ్గర కుడివైపు తిరిగి కుమ్మరిపాలెం చేరుకోవాల్సి వస్తోంది. వాహనదారులకు ఇదొక పరీక్షగా మారింది. ఇక వన్‌టౌన్‌లో బీఆర్పీ రోడ్డుపై గాంధీజీ స్కూల్ దగ్గర రోడ్డులో సగభాగాన్ని పార్కింగ్‌కు కాంట్రాక్టు ఇచ్చారు. ఇక్కడ వాహనాలు పార్క్ చేయడం వల్ల ఒక వరసలోనే వాహనాలు మిగతా 6లో..

కార్పొరేషన్ చెప్పే సాకులివీ..

కాళేశ్వరరావు మార్కెట్, వన్‌టౌన్‌కు భారీసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కానీ, వాహనాలు పార్కింగ్ చేయటానికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. షాపుల దగ్గర పార్కింగ్ చేస్తే రోడ్లు బ్లాక్ అవుతాయి. కాబట్టి రోడ్లను పార్కింగ్ కోసం ఇస్తున్నామని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. కానీ ఇది ఎంతవరకు సబబు అనే ప్రశ్న వస్తోంది. కార్పొరేషన్‌కు ఆదాయం వస్తున్నప్పుడు ఖాళీ స్థలాలు కానీ, కాల్వలపై ఐరన్ గ్రిల్స్‌తో కూడిన మల్టీమోడల్ కార్ పార్కింగ్ స్టాండ్లను ఏర్పాటు చేయవచ్చు. ప్రత్యామ్నాయ ఆలోచనలను వదిలిపెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేలా రోడ్లను ఆక్రమించడం సరికాదనే వాదనలు వినిపిస్తున్నాయి.



కొత్త కార్డులొచ్చాయ్..

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. నగరంలోని వరలక్ష్మీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ఈ కార్డులు పంచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు. 8

డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు నేడు

మధ్యాహ్నం నుంచి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు

- 28 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- డీఈవో పి.వి.జె.రామారావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఉద్యోగ నియామక ప్రక్రియ వేగవంతమైనట్లు డీఈవో పి.వి.జె.రామారావు సోమవారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి అభ్యర్థుల సెల్‌ఫోన్లకు కాల్ లెటర్లు వస్తాయన్నారు. మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28 ఉదయం 9 గంటల నుంచి నోబుల్ కళాశాలలో జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే నోబుల్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. జిల్లా పరిశీల కుడిగా సమగ్ర శిక్ష అధికారి ప్రసన్నకుమార్ హాజరవుతున్నారని వివరించారు.

పోస్టల్ సేవలు వేగవంతం

- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో రిజిస్టర్, స్పీడ్ పోస్ట్, అకౌంట్స్, ఇన్సూరెన్స్ సేవలు

6



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఓపీఎస్ అమలుచేసే వరకు ఉద్యమం

- ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రతరం
- మహాధర్నాలో డీఎస్సీ 2003 ఉపాధ్యాయ ఫోరం హెచ్చరిక

6

29న అమరావతి జాబ్‌మేళా

- తుళ్లూరులోని నాక్-సీఆర్‌డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో..
- 300కు పైగా ఉద్యోగాల భర్తీ

8

విజయం ఎవరిది?

విజయ డెయిరీలో ఎన్నికల కోలాహలం

- మూడు డైరెక్టర్ల పోస్టులకు 5 నామినేషన్లు
- పరిశీలన అనంతరం మిగిలినవి 4
- మహిళా కేటగిరీ ఏకగ్రీవం అయినట్టే..
- జనరల్ కేటగిరీ డైరెక్టర్ల ఎన్నికపై ఉత్కంఠ
- నామినేషన్ల ఉపసంహరణకు గడువు నేడు



నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందిస్తున్న వెంకట నగేశ్, వాణిశ్రీ. పక్కనే పలువురు డైరెక్టర్లు

చిట్టినగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీలో ఎన్నికల సందడి మొదలైంది. కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సమితి (విజయ డెయిరీ) పాలకవర్గంలో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల పోస్టులకు (జనరల్-2, మహిళా కేటగిరీ-1) సోమవారం పాలఫ్యాక్టరీలోని క్షీరదర్శన్ హాల్లో ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఎల్.గురునాథం 5 నామినేషన్లను పరిశీలించి, ఒక నామినేషన్‌ను వివిధ కారణాలతో తిరస్కరించారు. 4 నామినేషన్లు మిగిలాయి. పెడనలోని పెనుమల్లికి చెందిన అర్జా వెంకట నగేశ్, వత్సవాయిలోని భీమవరానికి చెందిన ఇంజం రామారావు, తిరువూరులోని ముష్టికుంటకు చెందిన గద్దె రంగారావు, విస్సన్నపేటకు చెందిన నెక్కళపు వాణిశ్రీ, తిరువూరులోని చిట్టేలకు చెందిన బోయపాటి సుశీల నామినేషన్లు ఇవి. బోయపాటి సుశీల నామినేషన్ వివిధ కారణాలతో తిరస్కరణకు గురైంది. దీంతో మహిళా కేటగిరీకి సంబంధించి ఒకే నామినేషన్ మిగలడంతో దాదాపు ఏకగ్రీవం అయినట్టే.

ఏకగ్రీవమా? ఎన్నికా?

జనరల్ కేటగిరీలో రెండు డైరెక్టర్ల పోస్టులకు మూడు నామినేషన్లు మిగిలాయి. మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ముగ్గురిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. జనరల్ కేటగిరీలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే మిగతా 6లో..

పీఎఫ్ సొమ్ము స్వాహా

16 మంది మున్సిపల్ వర్కర్ల ఖాతాలు రద్దు


- విధుల్లో ఉన్నా రద్దు కావడంపై అనుమానాలు
- కార్మికుల ఫిర్యాదుతో అడిషనల్ కమిషనర్ విచారణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మున్సిపల్ స్కూళ్లలో పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, కంటింజెంట్ వర్కర్లుగా పనిచేస్తున్న 16 మంది ఉద్యోగుల ఈపీఎఫ్ అకౌంట్లు రద్దు కావడం కార్పొరేషన్‌లో కలకలం సృష్టిస్తోంది. చిత్రమేమిటంటే.. వీరంతా ఇప్పటికీ స్కూళ్లలో పనిచేస్తూనే ఉన్నారు. ఈపీఎఫ్ రద్దు చేసిన వారి పేర్లతో ఈపీఎఫ్, ఈఎస్ఐ ఇప్పటికీ కట్ అవు తోంది. మరి ఈ డబ్బు ఎక్కడికి వెళ్తోంది? అనే ప్రశ్నకు సమాధానం లేక కార్మికులు లబోదిబోమంటున్నారు.

జరిగింది ఇదీ..

కార్పొరేషన్ పాఠశాలల్లో వాచ్‌మెన్లు, ఆయాలుగా పనిచేస్తున్న వారిలో 16 మంది పేర్లు ఈపీఎఫ్ జాబితా నుంచి గల్లంతయ్యాయి. వీరంతా గతంలో ఈపీఎఫ్ లోన్లు పెట్టుకున్నవారు కావటం గమనార్హం. పాఠశాలలో పనిచేసే తమ సహోద్యోగి ఒకరి ద్వారా వీరంతా ఈపీఎఫ్ రుణాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నారు. రుణాల సొమ్ము కొంతమేర మాత్రమే జమ అయ్యింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ అప్పటి నుంచి వారి పీఎఫ్ ఖాతాలు రద్దయ్యాయి. పూర్తిస్థాయిలో రుణం డబ్బు జమ కాకపోవటంతో కొందరు లోన్లు కట్టలేదని తెలుస్తోంది. వారంతా ఉద్యోగాలు మానేశారని రిపోర్టు అందిందని పీఎఫ్ ఉద్యోగులు చెప్పడంతో నిశ్చేష్టులైన కార్మికులు ఈ విషయాన్ని అడిషనల్ కమిషనర్ (జనరల్) దృష్టికి తీసుకెళ్లారు. రుణాలకు దరఖాస్తు చేయించిన వ్యక్తి అవినీతి అధికారులతో చేయి కలిపి ఇదంతా చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి. విచారణ చేస్తుండటంతో త్వరలోనే బాధ్యులను గుర్తించే అవకాశముంది.

వైద్యం చేస్తున్న డాక్టర్ ఆళ్ల రామశేషయ్య



రూపాయికే వైద్యం

కానూరులోని కంటి డాక్టర్ ఆళ్ల రామశేషయ్య ఔదార్యం

సుమారు 30 ఏళ్లుగా పేదలకు వైద్య సహాయం

- మొదట్లో రూ.5కే.. ఇప్పుడు రూపాయికే కన్సల్టెన్సీ
- అవయవదానంపై రోగులకు అవగాహన
- చనిపోయిన కుమారుడి పేరిట ట్రస్ట్ ఏర్పాటుచేసి సేవ
- తన శరీరాన్ని ప్రభుత్వాసుపత్రికి దానం చేస్తూ వీలునామా
- రూపాయి కంటి డాక్టర్‌గా ప్రత్యేక గుర్తింపు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గుడివాడ సమీపంలోని తమిరిశ గ్రామానికి చెందిన ఆళ్ల రామశేషయ్య ఉన్నత కుటుంబంలో జన్మించారు. చిన్నతరంలో తమ పొలంలో పనులకు వచ్చిన కూలీల పిల్లలతో ఆయన స్నేహం చేసేవారు. వారి పేదరికాన్ని చూసి చలించిపోయేవారు. ఎవరికీ తెలియకుండా స్నేహితులకు ధాన్యాన్ని దానం చేసేవారు. ఈ విషయంలో తండ్రి మందలించినా.. తల్లి కొడుకులోని సేవాగుణాన్ని మెచ్చుకునేవారు. నాటి నుంచి తల్లి కళ్లలో ఆనందం మిగతా 6లో..

వైద్యం వ్యాపారమైన ఈరోజుల్లో రూపాయికే వైద్యం చేయడమంటే మామూలు విషయం కాదు. ఆర్థిక పరిస్థితులతో పాటు అంతకుమించిన సంకల్పబలం ఉండాలి. చిన్న జ్వరానికే వేలల్లో ఫీజులు గుంజుతున్న ప్రైవేట్ ఆసుపత్రులను చూసి భయపడిపోతున్న రోగులకు నేనున్నానంటూ భరోసా ఇస్తూ రూపాయికే కంటి వైద్యం చేస్తున్నారు డాక్టర్ ఆళ్ల రామశేషయ్య. కన్నకొడుకు చనిపోయినా ఆ బాధను గుండెల్లో దాచుకుంటూ కళ్లను దానంచేసి వృత్తిపట్ల నిబద్ధతను చాటుకోవడంతో పాటు మరణాంతరం శరీరాన్ని ప్రభుత్వాసుపత్రికి దానం చేసి.. అవయవదానంపై రోగులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



అమ్మవారి ప్రధాన ఆలయం గోడకు రంగులు వేస్తున్న సిబ్బంది

వేగంగా దసరా ఏర్పాట్లు

- భక్తులకు లడ్డూ ప్రసాదం కొరత లేకుండా పోటు భవనంలో గాటు పొయ్యిలు
- గత అనుభవాల దృష్ట్యా ప్రణాళికా బద్ధంగా పనులు
- ప్రధాన ఆలయం, ఉపాలయాలు రంగులతో ముస్తాబు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సెప్టెంబరు 22నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఈవో వీకే శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రాంబాబుల ఆధ్వర్యంలో దసరా పనులను వేగవంతం చేశారు. కేశ ఖండనశాల ఎదురుగా క్యూ ఏర్పాట్లు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, లడ్డూప్రసాదం కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ముందుగానే తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దసరా ఉత్సవాలలో రోజుకు లక్ష నుంచి లక్షన్నర, మూలా నక్షత్రం రోజున సుమారు రెండున్నర లక్షల లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉండేలా అధికారులు మహామండపం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ పోటు భవనం మొదటి అంతస్తులో గాటు పొయ్యిల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శృంగేరి మఠం పక్కన రేకుల షెడ్డు, బుద్దా వారి గుడి కళ్యాణ మండపంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ పోటు భవనంలో కూడా లడ్డూలు తయారు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియపరిచేందుకు అర్జునవీధి ప్రారంభంలో ప్రత్యేక రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం రంగులతో అలంకరిస్తున్నారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, ఆలయ పరిసర ప్రాంతాలను ముస్తాబు చేస్తున్నారు. దుర్గాఘాట్, కొండపైన, ఘాట్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పనులను ముమ్మరంగా చేస్తున్నారు.



గాటు పొయ్యిలు



ఎలివేటెడ్ క్యూల నిర్మాణం



కుటుంబసభ్యులతో పీహెచ్‌సీ ఆయా చిరంజీవి

పీహెచ్‌సీ ఆయా ఆచూకీ లభ్యం

జి.కొండూరు : స్థానికంగా సంచలనం రేపిన జి.కొండూరు పీహెచ్‌సీ ఆయా మంద చిరంజీవి మిస్సింగ్ కథ సుఖాంతమయ్యింది. ఈనెల 20న డ్యూటీ ముగించుకొని సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి ఎటో వెళ్లిపోయిన ఆమె ఆచూకీని ఆరురోజుల తర్వాత పోలీసులు కనుగొన్నారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా వి.ఎం బంజర్ వద్ద ఆమె ఆచూకీని పోలీసులు సోమవారం కనుగొన్నారు. ఆమెను జి.కొండూరు తీసుకువచ్చి తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు ఎదుట పోలీసులు హాజరుపరిచారు. 30 ఏళ్లుగా ఆసుపత్రిలో పనిచేస్తున్నా తనకు జీతం పెంచడంలేదనే మనస్తాపంతో వెళ్లిపోయానని, యూడీసీ, మరెవరూ తనను వేధించలేదని చిరంజీవి అధికారులకు వివరణ ఇచ్చినట్టు మైలవరం సీఐ చంద్రశేఖర్ తెలిపారు. చిరంజీవి ఆచూకీ లభ్యం కావడంతో ఆమె కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

బస్‌స్టేషన్‌లో 5 కేజీల గంజాయి స్వాధీనం

బస్‌స్టేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు గంజాయి తరలించటానికి ప్రయత్నించిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎండీ రిజ్వాన్ అలామ్ (37)ను విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో కృష్ణలంక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బస్‌స్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే బస్సులో ఓ మహిళ వద్ద రూ.25వేలు మాయం అయ్యాయి. విధుల్లో ఉన్న కంట్రోలర్, బస్‌స్టేషన్‌లో కృష్ణలంక పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు, కంట్రోలర్ బస్సులోని ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తుండగా జార్ఖండ్ రాష్ట్రం ఇచ్చాక్ జిల్లా, మదనపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ రిజ్వాన్ అలామ్ బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో గంజాయి బండిల్స్ లభించాయి. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిసా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నట్టు వెల్లడైంది. పోలీసులు నిందితుడి వద్ద సుమారు 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ కంట్రోలర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రికి ఐదేళ్ల జైలు, జరిమానా

విజయవాడ లీగల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కంచే చేను మేసిన విధంగా మైనర్ కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై నేరం రుజువుకావడంతో ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో బాధితురాలు తమ కుటుంబంతో కలిసి జీవిస్తోంది. ఫిర్యాది భర్త దాసరి మనోజ్ కుమార్‌తో విభేదాలు రావడంతో విడిగా మైనర్ కుమార్తెతో కలిసి వుంటోంది. అప్పుడప్పుడు భర్త ఇంటికి వచ్చి పిల్లలను చూసుకొంటూ వుండేవాడు. ఈ క్రమంలో 2023 సెప్టెంబరు 11న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తల్లి లేనప్పుడు తండ్రి వచ్చి కుమార్తె ఒక్కర్తే వున్న సమయంలో టీవీ చూద్దాం రమ్మని చెప్పి బాలికను మంచంపైకి నెట్టి అసభ్యంగా ప్రవర్తించసాగాడు. బాలిక గట్టిగా అరుస్తూ అమ్మకు చెపుతాను అనడంతో అక్కడి నుంచి పారిపోయాడు. తల్లి వచ్చిన తర్వాత కుమార్తె జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాధితురాలు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ గడ్డం రాజేశ్వరరావు ఐదుగురు సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు దాసరి మనోజ్ కుమార్‌పై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ బాధిత బాలికకు రూ.50 వేల నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని ఆదేశించారు.



పోస్టల్ సేవలు వేగవంతం

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఐటీ 2.0)తో రిజిస్టర్, స్పీడ్ పోస్ట్, ఎకౌంట్స్, ఇన్సూరెన్స్ సేవలు సులభతరం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

అందుబాటులోకి వచ్చిన అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ(ఏపీటీ) 2.0 పోస్టల్ సేవలను మరింత సులభతరం చేస్తోంది. గతంలో ఉన్న సీఎస్‌ఐ, ఎస్ఏపీ స్థానే తీసుకొచ్చిన ఈ సాంకేతికత ఉద్యోగులకు పనిభారాన్ని తగ్గించి, ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించడంతో పాటు జవాబుదారీ తనాన్ని పెంచుతున్నాయి. రిజిష్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, పార్శిల్ వేగాన్ని పెంచుతూనే.., మరోవైపు పోస్టల్ కార్యాలయాల అకౌంటబలిటీ, పోస్టల్ ఇన్సూరెన్స్ సేవలను విస్తృతం చేస్తున్నాయి. గతనెల 22 నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని బ్రాంచి, సబ్, హెడ్ పోస్టాఫీస్‌లకు ఈ సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ సేవల దిశగా అడుగులు వేస్తున్న పోస్టల్ శాఖకు ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్ ఓ వరమని ఉద్యోగులు, ప్రజలు భావిస్తున్నారు.

- పోస్ట్ బుక్‌చేసిన వెంటనే అందుకునే వ్యక్తికి సమాచారం

రిజిష్టర్, స్పీడ్‌పోస్ట్, పార్శిల్ అందుకునే వరకు పోస్ట్ వచ్చిందనే విషయం గతంలో తెలిసేది కాదు. ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్ ఆ గీతను చెరిపేసింది. పోస్ట్ బుక్‌చేసిన వెంటనే బ్రాంచి, సబ్, హెడ్ పోస్టాఫీసులోని ఉద్యోగులు సదరు కవరును తూకం వేస్తారు. ఆ వెంటనే ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్‌లో పోస్ట్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేస్తారు. పోస్ట్ వేసేవ్యక్తి పేరు, ఫోన్ నెంబర్, అతని చిరునామా, ఎక్కడి నుంచి పోస్ట్ చేస్తున్నారనే సమాచారంతో పాటు, పోస్ట్ ఎవరికి చేరాలి, అందుకునే వ్యక్తి పేరు, ఫోన్ నెంబర్‌ను కంప్యూటర్‌లో ఎంటర్ చేస్తారు. దీంతో వెంటనే పోస్ట్ అందుకోవాల్సిన వ్యక్తి మొబైల్‌కు పోస్ట్‌కు సంబంధించిన మెసేజ్ వెళుతుంది. మధ్యాహ్నం ఒకసారి, సాయంత్రం ఒకసారి, రాత్రి ఒకసారి పార్సిల్స్‌ను ఆర్ఎంఎస్(రైల్వే మెయిల్ సర్వీస్)కు పంపిస్తున్నారు. దీనికారణంగా సర్వీసు వేగంగా గమ్యానికి చేరుతుంది. గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు అదేరోజు పోస్ట్ చేరుతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు 24 గంటల లోపు పోస్ట్ చేరుతుంది. ఇతర రాష్ట్రాలకు రెండురోజుల్లో పోస్ట్ చేరుతుందని ఉద్యోగులు చెబుతున్నారు.



నగదు లావాదేవీలు పారదర్శకం

బ్రాంచి పోస్టాఫీసుల నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకు ఆ రోజు జరిగిన లావాదేవీలను ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ సులభతరం చేసింది. మాన్యువల్ పద్ధతిలో రికార్డుల పరిశీలన బ్రాంచ్ పోస్టాఫీస్ నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకు రెండు రోజులకు పైబడి కొనసాగేది. అత్యాధునిక సాంకేతకతలో ఒకే రోజులో అన్ని కార్యాలయాల అకౌంట్స్ తేలిపోతున్నాయి. ఆ రోజు ఎన్ని లావాదేవీలు జరిగాయి.. ఎంత నగదు వచ్చింది.. ఎన్ని పోస్టులు చేశారనే విషయాలు ఎప్పటికప్పుడే తెలిసిపోతున్నాయి. బ్రాంచ్, సబ్‌పోస్టాఫీసుల్లో జరిగే లావాదేవీలను హెడ్ పోస్టాఫీసుల్లో ఉన్నత ఉద్యోగులు నేరుగా పరిశీలిన చేసే వెలుసుబాటును ఈ సాంకేతికత సమకూర్చింది.

ఇన్సూరెన్స్ సేవలు సులభతరం

మెకామిష్ సాఫ్ట్‌వేర్ పీఎల్‌ఐ, ఆర్పీఎల్‌ఐ తదితర పోస్టల్ ఇన్సూరెన్స్ సేవలతో పాటు సేవింగ్ ఖాతాల లావాదేవీలు, ఆర్డీ, టీడీ, సుకన్య సమృద్ధి, సీనియర్ సిటిజన్ అకౌంట్ తదితర పోస్టల్ సేవలను పరుగులు పెట్టిస్తోంది. ఖాతాదారులు క్యూలో నిలబడే అవసరం లేకుండా లావాదేవీలు చకాచకా జరిగిపోతున్నాయి. ఖాతాదారుడి వేలిముద్ర వేయగానే ఖాతాకు సంబంధించిన వివరాలు డెస్క్‌టాప్‌పై ప్రదర్శించబడుతున్నాయి. దీంతో నగదు తీసుకోవడం, జమ చేయడం వంటివి చురుగ్గా సాగిపోతున్నాయి.

బీఎస్ఎన్ఎల్‌తోనే తంటా

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ కారణంగా తరచూ సర్వర్ నెమ్మదిస్తుందని పోస్టల్ ఉద్యోగులు చెబుతున్నారు. నెట్ స్పీడ్ తక్కువగా ఉంటుందని, ఒక్కో సమయంలో నెట్ ఆగిపోతుందంటున్నారు. దీనికారణంగానే ప్రజలు వేచిఉండాల్సి వస్తుందని, నెట్ సక్రమంగా పనిచేస్తే సేవలు మరింత స్పీడ్‌గా అందిస్తామని చెబుతున్నారు.

పట్టాభి స్మారక భవనానికి గ్రీన్‌సిగ్నల్!

- మొదటివిడతగా రూ.6.5 కోట్లు
- సెప్టెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- ఎంపీ వల్లభనేని బాలశౌరి వెల్లడి



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు పట్టాభిసీతారామయ్య స్మారక భవనానికి వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తామని, కార్యక్రమానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ హాజరుకానున్నట్టు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. సోమవారం ఎంపీ మచిలీపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నాలుగేళ్ల క్రితం పట్టాభిసీతారామయ్య స్మారక భవనానికి స్థలం సమకూర్చామని, యూనియన్ బ్యాంక్ పట్టాభి స్మారక భవనానికి నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. అయితే మునిసిపల్ కౌన్సిల్ భవన నిర్మాణానికి ఎన్‌వోసి ఇవ్వనందున నిర్మాణం చేపట్టలేకపోయామన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, బ్యాంకింగ్ సెక్రటరీ నాగరాజు, యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులతో చర్చించగా భవన నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. తొలి విడతగా రూ.6.5 కోట్లతో భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రెండో విడతలో ఆడిటోరియంతో పాటు యూనియన్ బ్యాంకు రీజనల్ ఆఫీస్ నిర్మాణాలు జరుగుతాయన్నారు. పట్టాభి సీతారామయ్య బంధువులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. భవన నిర్మాణానికి ఎన్‌వోసి నిమిత్తం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. పట్టాభిస్మారక భవనం పక్కన ఉన్న అంబేడ్కర్ భవనం శిథిలమైందని, నూతనంగా నిర్మించడానికి రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు.

దత్తత ఇప్పిస్తామని రూ.4లక్షలు వసూలు

- సీపీకి బాధిత మహిళ ఫిర్యాదు

విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో మరో కొత్తరకం మోసం వెలుగుచూసింది. తెలంగాణకు చెందిన ఓ మహిళకు బిడ్డను దత్తత ఇప్పిస్తానంటూ రూ.4 లక్షలకు పైగా కాజేశారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. హైదరాబాద్‌కు చెందిన దాసరి శివ అనే వ్యక్తికి లక్ష్మణ్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. శివ అక్క మౌనికకు పిల్లలు లేరని తెలుసుకుని విజయవాడలో కలెక్టర్ ద్వారా దత్తత ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించాడు. ఇందుకు సుమారు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని వెంటనే రూ.2 లక్షలు కట్టాలని రెండు నెలల కిందట డబ్బు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా బిడ్డను ఇప్పించకపోవడంతో లక్ష్మణ్‌రెడ్డిని శివ గట్టిగా అడిగే సరికి మిగతా రూ.2 లక్షలు తీసుకుని ఈనెల 18న విజయవాడ రమ్మని ఫోన్‌లో చెప్పాడు. అదే రోజు విజయవాడ వచ్చిన శివ, అతని అక్క మౌనికను పున్నమిఘాట్ దగ్గర కలుస్తానని చెప్పాడు. ఎంతకీ రాకపోవడంతో ఫోన్ చేయగా కొత్త గవర్నమెంట్ ఆసుపత్రికి వద్దకు వస్తే డాక్టర్ షేక్ ఫాతిమా, డ్రైవర్ షేక్ మౌలాలి బాబును ఇస్తారని చెప్పారు. వారు అక్కడికి వెళ్లగా మిగిలిన రూ.2 లక్షలు ఇస్తే బాబుని వెంటనే ఇస్తానని షేక్ ఫాతిమా అనే మహిళ చెప్పింది. దీంతో ఆమె చేతుల్లో డబ్బు పెట్టారు. ఆసుపత్రిలో అందరూ మెలుకువగా ఉన్నారని, కాసేపు ఆగిన తర్వాత రమ్మని చెప్పి డబ్బు తీసుకుని ఫాతిమా వెళ్లిపోయింది. ఎంతకీ ఆమె రాకపోవడంతో లక్ష్మణ్‌రెడ్డిని శివ ప్రశ్నించగా తాను తీసుకువస్తానని వెళ్లిపోయాడు. వారికి ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్ఛాఫ్ అని వచ్చాయి. దీంతో మోసపోయానని గ్రహించిన శివ తన అక్కతో కలిసి పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

రూపాయికే వైద్యం

(5వ పేజీ తరువాయి)

కోసం, తన ఆత్మసంతృప్తి కోసం పేదలకు ఏదో రూపంలో సేవ చేయాలని నిర్ణయించుకున్నారు రామశేషయ్య. ప్రాథమిక విద్య తమిరిశలో, 1961లో ఎస్ఎల్‌సీసీ (10+2) ఈడుపుగల్లులో పూర్తిచేసి, లయోలా ప్రీ యూనివర్సిటీలో ఒక ఏడాది కోర్సు పూర్తిచేశారు. 17 ఏళ్లకే పెళ్లి చేసుకున్నారు. అనంతరం గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేసి 1969లో ఏటీ అగ్రహారంలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ప్రాక్టీస్ సమయంలోనే ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా బయట ఒక డబ్బా ఏర్పాటు చేసి అందులో ఎవరికి తోచినంత డబ్బు వేయాలని చెప్పేవారు. ఆ విధంగా వచ్చిన మొత్తాన్ని పేదల వైద్యానికి ఉపయోగించేవారు.

1973 నుంచే రూ.5కే వైద్యం

గుంటూరు మెడికల్ కాలేజీలో 1969-73లో ఎంఎస్ పూర్తిచేసి పేదలకు ఐదు రూపాయలకే కంటి వైద్యం చేయడం ప్రారంభించారు. అప్పట్లో ఆసుపత్రుల్లో ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోవడం, బయట భవనాలు తీసుకునే స్థోమత లేకపోవడంతో పేద రోగులకు ఇంట్లోనే కంటి ఆపరేషన్ చేసేవారు. కటిక పేదరికంతో తన వద్దకు వచ్చే రోగులకు దుస్తులు, వృద్ధులకు చేతికర్రలు, చెప్పులు సాయం చేసేవారు. డాక్టర్‌గా సేవలందించడమే కాకుండా ఎన్నో దానధర్మాలు చేశారు. ఆయన సేవలను గుర్తించిన రోటరీ క్లబ్ 1974లో సర్వీస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. నాటి నుంచి ప్రతి పల్లెకు సైకిల్‌పై తిరుగుతూ రచ్చబండ వద్ద కంటి ప్రాధాన్యత వివరించడమే కాకుండా అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించేవారు. 1979లో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటివరకు సుమారు 70 వేల మందికి ఉచితంగా సేవలందించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో లంబాడీల బాధలను చూసి ఆయన చలించిపోయారు. ఇద్దరు, ముగ్గురు ఆడపిల్లలు పుట్టిన దంపతుల నుంచి కనీసం ఒకరిని దగ్గరలోని మిరియం అనాథ ఆశ్రమంలో చేర్పించేవారు. వారికయ్యే ఖర్చును భరించేవారు. అనాథాశ్రమానికి తన వంతుగా గదులు, పాఠశాల భవనాలు నిర్మించారు. సుమారు 30 మంది ఆడపిల్లల పేరిట రూ.5 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వారిలో చాలామందికి సొంతఖర్చుతో పెళ్లిళ్ల చేశారు. అనంతరం కానూరులోని ఆటోనగర్ రోడ్డులో శ్రీఅమరావతి కంటి ఆసుపత్రిని ఏర్పాటుచేసి రూపాయి కన్సల్టెన్సీ ఫీజుకే వైద్యం చేయడం ప్రారంభించారు. చిన్నచిన్న ఆపరేషన్లను సైతం ఉచితంగా చేస్తున్నారు.

అమ్మ సంతోషం కోసం.. : డాక్టర్ ఆళ్ల రామశేషయ్య

సర్వేంద్రియానాం నయనం ప్రధానమన్నారు పెద్దలు. అదే విభాగంలో వైద్యవృత్తి చేస్తున్న నేను నా వృత్తిని అమ్ముకోదలచుకోలేదు. చిన్నతనం నుంచి మా అమ్మ ఏ మంచిపని చేసినా ప్రోత్సహించేది. ఎవరికైనా సహాయం చేసిన రోజు మనసుకు చాలా ఆనందంగా ఉండేది. ఎంతోమంది పేదలు చికిత్స చేయించుకోలేక కళ్లు పోగొట్టుకుంటున్నారు. మా పెద్ద బ్బాయి అజయ్ 1987లో చనిపోయాడు. అతని పేరుమీద అజయ్ జ్యోతి రూరల్ ఐ ట్రస్ట్ నడుపుతున్నాను. అనేకమంది పేదలు చికిత్సకు వచ్చిన సమయంలో బట్టలు లేకుండా రావడం బాధ కలిగించింది. నాటి నుంచి వైద్యంతో పాటు మగవారికి చొక్కాలు, మహిళలకు చీరలు పంచుతున్నాను. మా బంధువుల నుంచి దుస్తులు సేకరిస్తున్నప్పుడు పేదలు తీసుకోరని చెప్పేవారు. నాకు కూడా అలాగే అనిపించింది. మొదట్లో ఇవ్వడానికి భయపడ్డా. ఇవ్వడం మొదలుపెట్టాక ఎవరూ కాదనలేదు. నా మరణం తరువాత నా శరీరం వృథా కాకూడదు. అందుకే ప్రభుత్వాసుపత్రికి దానం చేస్తున్నా.

ఓపీఎస్ అమలుచేసే వరకు ఉద్యమం

- ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రతరం
- మహాధర్నాలో డీఎస్సీ 2003 ఉపాధ్యాయ ఫోరం హెచ్చరిక

గాంధీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తమను సీపీఎస్ పరిధిలో నుంచి ఓపీఎస్ పరిధిలోకి తేవాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలు చేయాలని కోరారు. పాత పెన్షన్ సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో సోమవారం మహాధర్నా జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీచేసిన మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ ఇచ్చి తీరాల్సిందేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రవ్యాప్తంగా ఈస్థాయిలో ఆందోళన చేపట్టడం ఇదే తొలి సారి అన్నారు. పోరాటాలతోనే హక్కులు సాధించడం సాధ్యమవుతుందని, అన్ని సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ 2003 ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి మద్దతు ప్రకటించారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్ర ప్రభుత్వాలు మెమో 57ను అమలు చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఫోరం నేతలు మోపిదేవి శివశంకరరావు, తమ్ము నాగరాజు, కె.లక్ష్మీశ్రీనాథ్ మాట్లాడుతూ 2004, సెప్టెంబరు 1 నాటికి ముందే నోటిఫికేషన్ పొంది, ప్రభుత్వ జాప్యం వల్ల ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరిన 7,361 మంది ఉపాధ్యాయులు, 1,821 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 1,800 మంది ఇతర శాఖల ఉద్యోగులు మొత్తం 10,982 మందిని సీపీఎస్‌లో బంధించడం చట్ట విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం తెలంగాణ ప్రభుత్వం పాత పెన్షన్ అమలు చేస్తున్నా ఏపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఐదేళ్లు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదిగా తమ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత కె.శ్రీనివాసరావు, ఏపీపీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు దాసు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఏఎస్ రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటెరు శ్రీనివాసరెడ్డి తదితరులు ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక సంఖ్యలో డీఎస్సీ 2003 ఉపాధ్యాయ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్, జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

విజయవాడ(స్పోర్ట్స్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో ఈనెల 30, 31 తేదీల్లో జరగనున్న 12వ అంతరాష్ట్ర సీనియర్ ఉమెన్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు, సెప్టెంబర్ 21, 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సబ్‌జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలు నున్నలోని విజయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌లో సోమవారం నిర్వహించినట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గమిడి సాంబశివరావు, గరికిపాటి మారుతీలు తెలిపారు. ఈ ఎంపికల్లో 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారుల ఎంపిక కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు రాయన సురేష్, గాజుల ప్రసాదులు, కళాశాల కరస్పాండెంట్ యన్.సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డాల సుబ్బరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆలూరి రామారావు, వీవీ నరసింహారావు, డైరెక్టర్లు, లోటస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దాసరి జగదీష్‌బాబు (కింద)

అడ్డాల సుబ్బరాజు మృతి సొసైటీకి తీరని లోటు

- చైర్మన్ ఆలూరి రామారావు



ఏలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అడ్డాల సుబ్బరాజు మృతి సొసైటీకి తీరని లోటు అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడు ఆలూరి రామారావు అన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఎ.ఎస్.ఆర్.నగర్‌లో అడ్డాల సుబ్బరాజు దశదిన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సొసైటీ నూతన అధ్యక్షుడు ఆలూరి రామారావు, కార్యదర్శి వీవీ నరసింహారావు, డైరెక్టర్లు, లోటస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దాసరి జగదీష్‌బాబు పలువురు ప్రముఖులు పాల్గొని సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సొసైటీ అభివృద్ధికి అడ్డాల సుబ్బరాజు ఎంతో కృషిచేసారని, నిత్యం సభ్యులతో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవారన్నారు.

క్రీడాకారులకు డ్రగ్స్ ఇస్తున్నారు

- సీపీకి కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఫిర్యాదు

విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌లో కొంతమంది క్రీడాకారులకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని, అసోసియేషన్‌లో ఉన్న వారు మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడుతూ, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారని కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కేపీ రావు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన కాపీలను పత్రికలకు సోమవారం విడుదల చేశారు. కబడ్డీ అసోసియేషన్‌లో ఉన్న శ్రీకాంత్‌పై ఆరోపణలు చేశారు. ఆయనే క్రీడాకారులకు డ్రగ్స్ అలవాటు చేసి, మ్యాచ్‌ఫిక్సింగ్‌లు చేయిస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం క్రీడాకారులకు డ్రగ్ ఇంజక్షన్లను సరఫరా చేస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని మాచవరం పోలీసులకు అప్పగించారన్నారు. డ్రగ్స్‌ను ఉపయోగిస్తున్న 13 మంది క్రీడాకారుల జాబితాను సీపీకి అందజేశారు. వారిపై సమగ్ర విచారణ చేయించి క్రీడాకారుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

విజయం ఎవరిది?

(5వ పేజీ తరువాయి)

సాయంత్రం 5 గంటల తరువాత ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. సెప్టెంబరు 2న ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లాకు చెందిన 375 సొసైటీ అధ్యక్షులు ఓటుహక్కు వినియోగించుకుని డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఏదిఏమైనా మంగళవారం సాయంత్రానికి ఏకగ్రీవమా, ఎన్నికా అనేది తేలిపోతుంది. నామినేషన్ల కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకటరమణ, చలసాని చక్రపాణి, ఎన్.నాగేశ్వరరావు, శనగల శివజ్యోతి, ఎం.వెంకటలక్ష్మి, పాలడుగు వెంకటరామ వరప్రసాద్, పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం సాయంత్రం వరకు గడువు ఉందని, ఆ తరువాత జనరల్ కేటగిరీకి ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే సెప్టెంబరు 2న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (రిటైర్డ్) ఎల్.గురునాథం చెప్పారు.

వేరే దారి లేదా?

(5వ పేజీ తరువాయి)

రాకపోకలు సాగుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఏర్పడుతోంది. రోడ్లపై పార్కింగ్ తీసుకున్నవారు రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. కార్పొరేషన్ నిర్దేశించే ఫీజు కంటే మూడు నాలుగు రెట్లు పెంచి అడ్డగోలుగా దండుకుంటున్నారు. దీంతో పార్కింగ్ కాంట్రాక్టుల కోసం మాఫియాలు ఏర్పడుతున్నాయి. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే వారి పంచన చేరి పార్కింగ్ కాంట్రాక్టులను రక్షించుకోవటం అలవాటుగా మారింది.

ఎమ్మెల్యే చెప్పినా లెక్కలేదా?

రోడ్లపై పార్కింగ్ వ్యవహారాలపై చాలాకాలంగా స్థానికులు, వాహనదారుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి దగ్గర స్థానికులు మొరపెట్టుకున్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన రోడ్లను పార్కింగ్‌కు ఇవ్వటమేమిటని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, తక్షణం వాటిని నిలిపివేసి వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఉన్నతస్థాయి అధికారులకు ఆయన సూచించినా లెక్క చేయలేదు.

రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో మాట్లాడరేం..

రోడ్లపై పార్కింగ్ కాంట్రాక్టులు ఇస్తుండటం ఇబ్బందిగా పరిణమిస్తున్నా.. రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో పోలీసులు కానీ, కార్పొరేషన్ అధికారులు కానీ చర్చకు తీసుకురావట్లేదు. అవినీతి రుచిమరిగిన కార్పొరేషన్ ఎస్టేట్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు తమకు అందే మామూళ్లు పోతాయేమోనని నోరు మెదపట్లేదు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



పటమట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 12వ డివిజన్ అయ్యప్పనగర్, సంజీవ్‌గాంధీ కాలనీల్లో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు సాయన సత్యనారాయన, కరీం, వీఆర్వో సునీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ పనులకు ప్రాధాన్యత

● నగర కమిషనర్ ధ్యానచంద్ర

గవర్నర్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం 23వ డివిజన్‌లోని మ్యూజియం రోడ్డు, లయోలా కళాశాల మెయిన్‌రోడ్డు, దళితవాడ మెయిన్ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, ఏఎస్ రామారావు రోడ్డు, గోపాలరెడ్డి రోడ్డు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేజర్ ఔట్‌ఫాల్ డ్రెయిన్ల వద్ద వేసిన రైలింగ్స్‌ను పరిశీలించి, పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ పనులు జరిగేప్పుడు ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాలు సమన్వయంతో పనిచేసి నగరంలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడున్నా వెంటనే తొలగించేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజా వేదికలో 31 ఫిర్యాదులు

కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్ ధ్యానచంద్రకు అందజేశారు. మొత్తం 31 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ యువ ఆంధ్ర చాంపియన్ అమరావతి క్రషర్స్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న కబడ్డీ యువ ఆంధ్ర చాంపియన్‌షిప్‌ను అమరావతి క్రషర్స్ కైవసం చేసుకుంది. 11రోజుల పాటు ఎంతో ఉత్కంఠగా జరిగిన ఈ టోర్నమెంట్ నగర వాసులకు కబడ్డీ మజాను రుచి చూపించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అమరావతి క్రషర్స్ క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభతో కర్నూలు నైట్స్ పై 50-37 తేడాతో విజయం సాధించి యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకోగా, కర్నూలు జట్టు రన్నర్‌గా నిలిచింది. అనంతరం జరిగిన ట్రోఫీ ప్రదానోత్సవ కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఈవెంట్ నగరంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఇటువంటి టోర్నమెంట్‌లు మరిన్ని నిర్వహించి నగర కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు ఈ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలందిస్తుందన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, మాజీ ఇంటర్నేషనల్ కబడ్డీ క్రీడాకారుడు ఎన్.అర్జునరావు, అసోసియేషన్ ట్రెజరర్ ఎం.సుబ్బరాజు, జాయింట్ సెక్రటరీ కె.వి.నాంచారయ్య, యువ కబడ్డీ సిరీస్ సీఈవో వికాస్ పాల్గొన్నారు.



విజయం సాధించిన అమరావతి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న గద్దె క్రాంతి, యలమంచిలి శ్రీకాంత్ తదితరులు

నగరంలో అల్లర్లు సృష్టిస్తే సహించం

● ఏసీపీ దామోదర్



నిందితులు కోర్టుకు హాజరుకాకపోవడంతో హెచ్చరిస్తున్న ఏసీపీ దామోదర్

గుణదల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో అల్లర్లు సృష్టించాలని చూస్తే సహించేది లేదని సెంట్రల్‌జోన్ ఏసీపీ దామోదర్ హెచ్చరించారు. గ్యాంగ్‌వార్ కేసులో నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంపై వారికి కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమం ఆటోనగర్లో సోమవారం నిర్వహించారు. గ్యాంగ్‌వార్ కేసు నిందితులు సక్రమంగా కోర్టుకు హాజరు కాకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఆదివారం పటమట పోలీస్ స్టేషన్లో తప్పకుండా హాజరుకావాలన్నారు. వాయిదాలకు హాజరుకాకున్నా, పోలీస్ స్టేషన్లో ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు రాకున్నా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో జరిగే వినాయక చవితి పందిళ్ల వద్ద చేరి అల్లర్లు సృష్టించాలని చూస్తే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. నిఘానేత్రాలు మీ మీద ఉంటాయని ప్రవర్తన మారకపోతే నగర బహిష్కరణ చేయాల్సి ఉంటుందన్నారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, పటమట, పెనమలూరు సీఐలు పవన్ కిషోర్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

స్థాయీసంఘంలో 13 అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చిట్టినగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 13 అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 21 అంశాలపై చర్చించి 13అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. ఆరు అంశాలను వాయిదా చేశారు. ముఖ్యంగా ఎస్టేట్ విభాగానికి చెందిన అంశాలను కమిటీ వాయిదా వేసింది.

ఎన్నికల హామీల అమలు కోరుతూ రజకుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రజక సంఘం నాయకులు

చిట్టినగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదురుగా రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ వృత్తిదారులు బీసీలకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని చెప్పిన మాట మంత్రుల సబ్ కమిటీతో సరిపెట్టారన్నారు. దోబీ పోస్టులు భర్తీ చేసి యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని, జీవో నంబరు 26 ప్రకారం రజక సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్ల అధ్యక్షతన ప్రతి మూడు నెలలకు ఒకసారి రజకుల సమస్యలు చర్చించాలన్నారు. ఈ ప్రభుత్వం వెంటనే కమిటీలు ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లా సంఘం కన్వీనర్ చిక్కవరపు వెంకట రెడ్డయ్య, నగర కమిటీ అధ్యక్షురాలు లింగాల నిర్మలమ్మ, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఎరువులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

● ఏపీ కౌలు రైతు సంఘం

గవర్నర్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తోందని, అవసరమైనంత యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో పాటు యూరియా, ఎరువులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై. రాధాకృష్ణ, ఎం. హరిబాబులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అవసరమైన యూరియాను కేంద్రం నుంచి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా దిగుమతి, పంపిణీ తదితర అంశాలపై సమగ్ర సమాచారం రైతులకు అందించాలని కోరారు. అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచి, నిర్ణయించిన ధరకే అమ్మేటట్లు బ్లాక్ మార్కెట్‌కి పోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఐసీఏఐ సభ్యులు, కాన్వొకేషన్ కో ఆర్డినేటర్ ముప్పాళ్ల శ్రీధర్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మొగల్రాజపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చార్టెడ్ అకౌంటెట్ పూర్తి చేసి సీఏలుగా కెరీర్ స్టార్ట్ చేసిన వారు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంతో విజయాలు వరిస్తాయని ఐసీఏఐ సభ్యులు, కాన్వకేషన్ కో ఆర్డినేటర్ ముప్పాళ్ల శ్రీధర్ తెలిపారు. మొగల్రాజపురంలో ఒక ఫంక్షన్ హాలులో సోమవారం సీఏ పూర్తి చేసిన విద్యార్థులకు కాన్వకేషన్-2025ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీఏలకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్‌సి వైస్ చైర్మన్ ఎం.సుబ్బారావు, ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ చైర్మన్ కంచమరెడ్డి నారాయణ, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జయంత్, కార్యదర్శి మనీష్‌కుమార్ జైన్, కోశాధికారి వి.వీర పవన్‌కుమార్, సికాసా చైర్మన్ వినీల, ఎంసీ సభ్యులు దామ వేణు, అజయ్ చౌదరి పాల్గొన్నారు.



ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

దోమలకు ఆవాసంగా మారిన వైనం

రామలింగేశ్వరనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 15వ డివిజన్ శ్మశానవాటిక ఎదురు ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు దోమలకు ఆవాసకేంద్రంగా మారుతున్నాయని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు ఎక్కువ రోజులు ఖాళీ స్థలంలో నిలిచి ఉండటంతో పచ్చరంగులోకి మారుతున్నాయంటున్నారు. ఖాళీ స్థలంలోనే చెత్తా, చెదారం, వ్యర్థాలు పడవేస్తున్నారనిచ ఈగలు, దోమలు వ్యాప్తి చెంది కలరా, డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ఆ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తపరుస్తున్నారు. నిల్వ ఉన్న నీటిలోనే గేదెలు సేద తీర్చుకోవడం వలన గేదెలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందంటున్నారు. వర్షపు నీటిని తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదాయ దుస్తుల్లో దుర్గమ్మను దర్శించుకోవాలి

చర్యలు తీసుకోవాలని ఈవోకు వైదిక కమిటీ సూచన

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని, ఆలయ ప్రధాన ప్రాంగణంలో సెల్‌ఫోన్‌లు నిషేధించాలని దుర్గగుడి వైదిక కమిటీ సభ్యులు ఆలయ ఈవో శీనానాయక్‌కు సూచించారు. దుర్గగుడి ప్రధాన ఆలయంలో, క్యూలలో కొందరు భక్తులు బహిరంగంగా సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు దిగుతున్నారని, మరికొందరు గుట్టుచప్పుడు కాకుండా అమ్మవారి మూల స్వరూపాన్ని, సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించి వివిధ సామాజిక మాధ్యమాలలో పెడుతున్నారని, దీని వల్ల పలు సమస్యలు వస్తున్నాయని వైదిక కమిటీ సభ్యులు ఈవోకు లిఖితపూర్వకంగా తెలియపరిచారు. ఆలయంలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకుండా నియంత్రించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీనిపై స్పందించిన ఈవో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ వస్త్రధారణ పాటించాలని, సెల్‌ఫోన్లు అనుమతించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

దుర్గగుడిలో అభివృద్ధి పనులకు విరాళం



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కరెన్సీనగర్‌కు చెందిన ఎస్.కృష్ణ, అనంతలక్ష్మీ దంపతులు రూ.1,00,000లు అధికారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందచేశారు. అధికారులు దాతకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన
55 మందికి రూ.5.50లక్షల జరిమానా

విజయవాడ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందికి రూ.5.50 లక్షల జరిమానా విధిస్తూ ఏడో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.ఎస్.శర్మ సోమవారం తీర్పు చెప్పారు. ఒకటో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.



బహుమతి అందుకుంటున్న ప్రహ్లాద్

ఫిడే ఇంటర్నేషనల్ చెస్ విజేత ప్రహ్లాద్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కాలేజీలో జరిగిన ఫిడే ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ అండర్-11 కేటగిరిలో మూల ప్రహ్లాద్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సోమవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా పలువురు ప్రహ్లాద్‌ను అభినందించి రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు


ఆటోనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ పరిధిలో 11కేవీ ఆటోనగర్-3 ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ పి. హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానాడు రోడ్డు, విజయలక్ష్మి కాలనీ, ఎస్ఆర్ఎంటీ రోడ్డు, ఫేజ్-3, కోటిరెడ్డి రోడ్డు, టవర్‌లైన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



కౌండిన్య నగర్‌లో ఏర్పాటు చేసిన చవితి పందిరి

చవితి వేడుకలకు సర్వంసిద్ధం

పటమట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు పటమట ప్రాంతంలో పలు చవితి పందిళ్లను భక్తులు సిద్ధం చేస్తున్నారు. పండుగలలో తొలి పండుగ హిందువులకు అతిముఖ్యమైన పండుగ వినాయకచవితి. వినాయక నవరాత్రులను పురస్కరించుకొని పటమట ఎస్ఎస్ఎం స్కూల్, మోహన్‌దాస్ థియేటర్, దర్శిపేట పార్కు సెంటర్, యాదవుల బజారులో చవితి పందిళ్లను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులు పటమట పరిసర ప్రాంతాల్లో వేడుకలను నిర్వహిస్తారు. నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చవితి వేడుకలు నిర్వహించాలని పోలీసులు కోరుతున్నారు.



చేనేత ప్రదర్శనకు అనూహ్య స్పందన

లబ్బీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ఆదరించి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని నిర్వాహకులు సురేష్ కోరారు. బందర్ రోడ్డులోని బాపు మ్యూజియంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనకు సందర్శకుల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని ఆయన తెలిపారు, దేశంలోని 12 రాష్ట్రాల నుంచి విచ్చేసిన చేనేత కార్మికుల, హస్తకళా కార్మికులు స్వయంగా అమ్మకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కళంకారీ, ఫ్యాన్సీఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, డోర్ కర్టన్స్, వరంగల్ టవల్స్, బెడ్‌షీట్స్, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్ అండ్ బెడ్‌షీట్స్ ప్రింటెడ్ టాప్స్, ఖాదీ షర్ట్స్ తదితర వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబరు 14వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్కుల సుందరీకరణతో ఆహ్లాద వాతావరణం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన ప్రమాణాలను పెంచేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా నియోజకవర్గ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నియోజకవర్గ పరిధి 4వ డివిజన్‌లోని ఫిలింనగర్ కాలనీలో సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో కాలనీలో పర్యటించారు. ఈ పర్యటనలో సుమారు రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన పార్కుల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గద్దె ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లోని నిరుపేద కార్యకర్త తాడేపల్లి రాధమ్మకు టిఫిన్ బండిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 20 పార్కుల పైగానే అభివృద్ధి చేశామని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేయడంతో పాటుగా అధునాతనమైన జిమ్ పరికరాలను అమరుస్తున్నామని తెలిపారు. పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఈమని సాయిరామ్, నర్రా శ్రీనివాసరావు, అంకినీడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

జిల్లా వైద్యాధికారిణి సుహాసిని పిలుపు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని

పటమట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లో కల్లా నేత్రదానం మహోన్నతమైనదని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని పిలుపునిచ్చారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న నాస్తిక కేంద్రంలో స్వేచ్ఛ గోరా ఐబ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన ప్రచార పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగుడ్డు అంధత్వ నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఇ.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ 895 మందికి చూపును ప్రసాదించిన ఐబ్యాంక్ సేవలు అమోఘమన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు జరిగే పక్షోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కె.విజయశేఖర్, మనోహర్‌లను సన్మానించారు. వాసవ్య మహిళామండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి, సంస్థ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గానగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించటంతో కనకదుర్గానగర్‌లోకి వాహనాలను అనుమతించటం లేదని దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గగుడికి వాహనాలలో వచ్చే భక్తులు తమ వాహనాలను ఘాట్ రోడ్డు మార్గంలో కొండపై పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కనకదుర్గానగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టిన పనులకు భక్తులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఈ-కార్డులు

● స్మార్ట్‌కార్డులను అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్

భారతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో ఈ-కార్డులు తయారు చేశారని, నేడు పండుగ వాతావరణంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4.42కోట్ల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం విజయవాడ వరలక్ష్మీనగర్‌లో మంత్రి స్వయంగా ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సెప్టెంబరు 15లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 5లక్షల 90వేలమంది లబ్ధిదారులకు, కృష్ణాజిల్లాలో 5లక్షల 17వేలమంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నామన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేస్తే లబ్ధిదారుడు ఎప్పుడు సరుకులు తీసుకున్న సమాచారం వెంటనే ప్రభుత్వానికి చేరుతుందన్నారు.

కొండప్రాంతాలు, దూరప్రాంతాల వారికి సబ్ రేషన్ డిపోలు ఏర్పాటుచేయడంపై సీఎంతో చర్చ జరుగుతోందని మంత్రి మనోహర్ అన్నారు. కార్డుల్లో మార్పుల, చేర్పులకు స్థానిక సచివాలయాల్లో అప్లై చేసుకోవచ్చునన్నారు. ఏదైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967 ద్వారా సంప్రదించవచ్చునన్నారు. ఈ-స్మార్ట్ రైస్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా రేషన్ సరుకులు పొందవచ్చునని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, సివిల్ సప్లై కమిషనర్ సౌరబ్ గౌర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.


వరలక్ష్మీ నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు.

దేశవ్యాప్తంగా హమ్ బద్లెంగే క్యాంపెయిన్

కృష్ణలంక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో సోమవారం 'హమ్ బద్లెంగే' పోస్టరును ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి ఎం రాజీవ్ గాంధీ, హమ్ బద్లెంగే ఏపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి మనీష్ గోవింద రాజ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ ఆవిష్కరించారు. సోమవారం ఆంధ్రరత్న భవన్‌లో ఎన్ఎస్‌యూఐ ఏపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో హమ్ బద్లెంగే క్యాంపెయినింగ్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనూ పై తెలిపిన అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో విస్తృతంగా 'హమ్ బద్లెంగే' చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు చందు నాయక్, పట్టాభిరామయ్య, మల్లిఖార్జున్, సుబ్బారెడ్డి, ఎస్కే కరీం, ఓబులేష్, గణేష్, వీరేష్ యాదవ్, నాగూర్ వలి పాల్గొన్నారు.

భక్తులకే మహామండపం..!

● ప్రస్తుతం అందుబాటులో రెండంతస్తులే ● దసరా నాటికి అన్నదానం, ప్రసాదంపోటు భవనాలు ● ప్రతిపాదనలో కంపార్టుమెంట్లు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: మహామండపాన్ని ఇక నుంచి పూర్తిగా భక్తులకే కేటాయించాలని అధికారులు భావిస్తున్నారా? ఇందులోని అంతస్తులను కంపార్టుమెంట్లుగా మార్చు చేయాలని ప్రణాళికలు రూపొందించబోతున్నారా? మహామండపాన్ని ఉపయోగించాల్సిన విధంగా ఉపయోగించడం లేదన్న భావన అధికారుల్లో ఉందా? అంటే అవుననే సమాధానం ఆలయ వర్గాల నుంచి వస్తోంది. అమ్మవారి ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న తూర్పు రాజగోపురాన్ని అనుసంధానం చేస్తూ నిర్మించిన మహామండపం రూపురేఖలు మార్చు చేయాలన్న యోచనలో అధికారులున్నారు. ప్రస్తుత అవసరాల నిమిత్తం వేర్వేరుగా ఉపయోగిస్తున్న ఈ భవనాన్ని రాబోయే రోజుల్లో పూర్తిగా భక్తులకు కేటాయిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలు చేస్తున్నారు. దానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించడానికి సిద్ధమవుతున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వేచి ఉండే సమయాల్లో కూర్చోవడానికి వీలుగా కంపార్టుమెంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.


పక్కనే నిర్మిస్తున్న ప్రసాదాల పోటు



శ్రీ మల్లేశ్వర మహామండపం

ఇదీ 'మహా' స్వరూపం

కనకదుర్గానగర్‌లో ఏడంతస్తులతో మహామండపాన్ని నిర్మించారు. మొదటి అంతస్తును రాత్రిపూట నిద్రచేసే భక్తులకు కేటాయించారు. రెండు, మూడు అంతస్తుల్లో అన్నదానం జరుగుతోంది. 4వ అంతస్తులో దేవస్థాన కార్యాలయ కార్యకలాపాలు నడుస్తున్నాయి. ఐదో అంతస్తులో అమ్మవారి నివేదనశాల, పూజాసామగ్రి, చిత్రపటాల దుకాణాలున్నాయి. ఆరో అంతస్తులో కుంకుమ పూజులు, హుండీల లెక్కింపులు జరుగుతున్నాయి. ఏడో అంతస్తు నుంచి తూర్పు రాజగోపురం వద్దకు భక్తులను తీసుకెళ్తారు. మహామండపానికి కుడివైపున మెట్ల నుంచి భక్తులు దర్శనానికి వెళ్తారు. ఎడమవైపున లిఫ్టుల ద్వారా రూ.500 దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులను తీసుకెళ్తారు. మహామండపం మొత్తాన్ని పరిశీలిస్తే భక్తులకు తక్కువగానే ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది. ఎక్కువ మంది భక్తులు ఘాట్ రోడ్డు మీదుగా దర్శనానికి వెళ్తున్నారు. మామూలు రోజుల్లో భక్తులు అటు ఘాట్ రోడ్డు, ఇటు కనకదుర్గానగర్ వైపు నుంచి దర్శనానికి వెళ్తారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో మాత్రం కనకదుర్గా నగర్ నుంచి భక్తులను దర్శనానికి అనుమతించరు. దర్శనం పూర్తయ్యాక బయటకు పంపుతారు.

ఏం చేయాలనుకుంటున్నారంటే..!

తిరుమలలో సర్వదర్శనం, సుపథం (రూ.300), వీఐపీ బ్రేక్ ఇలా ఏ దర్శనానికి వెళ్లినా భక్తులు కూర్చోవడానికి కంపార్టుమెంట్లు ఉన్నాయి. వాటిలో కుర్చీలుంటాయి. కానీ ఇంద్రకీలాద్రి పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఘాట్ రోడ్డుపై నుంచి వెళ్లినా, మహామండపం మెట్ల నుంచి ఎక్కినా, లిఫ్టుల దగ్గరకు వచ్చినా భక్తులు వేచి ఉండడానికి సదుపాయాలు మాత్రం లేవు. నిత్యం అమ్మవారికి నివేదనలుంటాయి. ఆ సమయంలో ప్రధాన ఆలయంతోపాటు చుట్టుపక్కలున్న పరిసరాలను శుభ్రం చేస్తారు. నివేదన పూర్తయ్యాకే భక్తులను అనుమతిస్తారు. దీంతో అరగంటపాటు దర్శనాలను నిలుపుదల చేస్తారు. అప్పటి వరకు భక్తులంతా క్యూలో నిలబడాల్సి వస్తోంది. దసరాలోని శరన్నవరాత్రుల సమయాల్లోనూ ఇదే పరిస్థితి. మామూలు రోజుల్లో ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పండుగ పర్వదినాల్లోను భారీసంఖ్యలో భక్తులు వస్తారు. మహామండపానికి పక్కనే ప్రసాదాల పోటు, ఎదురుగా అన్నదాన భవనం నిర్మిస్తున్నారు. దసరాలో శరన్నవరాత్రులకు వాటిని ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయ్యాక రెండు, మూడు అంతస్తుల్లోని అన్నదానం కొత్త కాంప్లెక్స్‌లోకి వెళ్తుంది. ఐదో అంతస్తులోని నివేదనశాల, ప్రసాదాల తయారీ మొత్తం పోటు భవనంలో వస్తాయి. 4వ అంతస్తులోని దేవస్థాన కార్యాలయాన్ని జమ్మిదొడ్డిలోని భవనాల్లోకి మార్చాలనే ఆలోచనలో అధికారులున్నారు. దీంతో మూడంతస్తులు ఖాళీ అవుతాయి. వీటిని భక్తులకు కంపార్టుమెంట్లను నిర్మించాలని ప్రణాళికలు తయారు చేయాలని భావిస్తున్నారు.


ఎదురుగా అన్నదాన భవనం

అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలి

● కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, అర్జీలు పునరావృతమైతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో జేసీ ఎస్ ఇలక్కియా, డీఆర్వో ఎం లక్ష్మీనరసింహంతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ ప్రజల నుంచి సోమవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకానికి మరింత బలం చేకూర్చాలన్నారు. నిర్దేశించిన గడువు లోపు అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు.

జి.కొండూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో 30 ఏళ్ల నుంచి కంటింజెంట్‌గా పని చేస్తున్న మందా చిరంజీవి అదే ఆసుపత్రిలోని యూడీసీ శ్రీనివాసరావు వేధింపులు భరించలేక కనిపించకుండా పోయిందని, ఆచూకీ కనిపెట్టాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి మెట్రోపాలిటన్ ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ ఓటర్ల జాబితాలో అనర్హులను తొలగించాలని కోరుతూ సొసైటీ త్రిమాన్ కమిటీ సభ్యులు కే నాగరాజు, సురేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

తన వ్యవసాయ భూమిని ఆక్రమించి తనపై, తన భార్యపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామానికి చెందిన కొల్లూరు జమలయ్య కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. అలాగే రెవెన్యూ శాఖకు 53, పోలీస్ 30, ఎంఏయుడీకి 22, తల్లికి వందనం నగదు రాలేదని 10, గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని 10, ఆరోగ్య శాఖపై 9, డీఆర్‌డీఏకి 7, విద్యుత్ శాఖకు 5, పౌరసరఫరాల శాఖకు 5, విభిన్నప్రతిభావంతులు 4, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖకు 4, సర్వేపై 4, సాంఘిక సంక్షేమ శాఖకు 4, నీటిపారుదల శాఖకు రెండు, గిరిజన సంక్షేమ శాఖకు రెండు, వ్యవసాయ శాఖకు రెండు, సాంకేతిక విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, బ్యాంకు, ఐసీడీఎస్, దేవదాయ, సోషల్ వెల్ఫేర్ శాఖలకు ఒక్కొటి చొప్పున అర్జీలు ఇచ్చారు. ఆర్డీవో కావూరి చైతన్య, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కే పోసిబాబు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న డీసీపీ ఉదయరాణి

పింఛన్ పునరుద్ధరించండి

రాష్ట్రంలో దివ్యాంగులకు తొలగించిన లక్ష సామాజిక పింఛన్లను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని వైసీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు సోమవారం ఆందోళన చేపట్టారు. దుర్గారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం క్యాంపులను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పథకాలు దూరం చేయకుండా క్రమపద్ధతిలో సహకారం అందించాలని డిమాండ్ చేశారు.

పోలీస్ ప్రజావాణిలో 75 ఫిర్యాదులు

పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 75 మంది బాధితుల నుంచి డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఏబీటీఎస్ ఉదయరాణి అర్జీలను స్వీకరించారు. నగదు లావాదేవీలపై 46 మంది, కుటుంబ కలహాలపై ఐదుగురు, కొట్లాటలపై ఇద్దరు, మోసాలపై ఒక్కరు, మహిళా సంబంధిత నేరాలపై ఆరుగురు, చోరీపై ఒక్కరు, చిన్నచిన్న వివాదాలపై 14 మంది ఫిర్యాదులిచ్చారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.


పెన్షన్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న పెన్షనర్లు

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి

ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కుమార్

విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రూ.వెయ్యి ఉన్న కనీస పెన్షన్‌ను రూ.9వేలకు పెంచి కరువుభత్యంతో కలిపి ఇవ్వాలని రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ, ఏపీఆర్‌పీఏ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విజయవాడ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం జరిగిన ధర్నాలో అధికసంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు. డిమాండ్ల సాధనకు కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి అజయ్ కుమార్ మాట్లాడుతూ పదేళ్లుగా పెన్షనర్లు తమ డిమాండ్ల సాధనకు అనేక విధాలుగా పోరాడుతున్నా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు, పెన్షనర్లకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వ ఆర్థిక విధానాలతో కార్పొరేట్లకు ప్రజల సొమ్మును దోచిపెడుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ అమరయ్య శాస్త్రి మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌కు విరుద్ధంగా అధిక పెన్షన్ అమలు విధానాన్ని విస్మరించి దామాషా పద్ధతి పేరుతో 30శాతం తక్కువగా ఇస్తూ కేంద్రం మోసం చేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా ఇటీవల చేసిన పెన్షన్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కృష్ణా జిల్లా కార్యదర్శి పీ శ్రీనివాసరావు, బీడీఆర్ రెడ్డి, మెడికల్ రిప్స్ నేత రెడ్డి పాల్గొన్నారు.

29న అమరావతి జాబ్‌మేళా

● 300కి పైగా ఉద్యోగాల భర్తీ

కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ సౌజన్యంతో ఆగస్టు 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని నాక్ - సీఆర్‌డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుంది. ఈ జాబ్ మేళాలో సెన్స్ సెమీకండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు కో లిమిటెడ్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఎంఎల్‌టీ, బీఎస్సీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. ఎంపికైన అభ్యర్థులకు రూ.17వేల నుంచి రూ.40వేల వరకు వేతనం లభిస్తుంది. కొన్ని ఉద్యోగాలకు అదనంగా ఇన్సెంటివ్‌లు, అలవెన్సులు సైతం లభిస్తాయి. అర్హత కలిగిన అభ్యర్థులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ - 9848424207, శ్రీకర్ - 9963425999 నెంబర్లలో కాల్ చేయవచ్చు. జాబ్‌మేళాలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/లో నమోదు చేసుకోవాలి.



మట్టి వినాయకుల ప్రపంచ రికార్డుకు సిద్ధం

కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితంగా పండుగలను జరుపుకొనేలా ప్రజలను జాగృతం చేసే లక్ష్యంతో ఈనెల 26న మంగళవారం మట్టి, ఇతర ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమల తయారీతో ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐజీఎం స్టేడియంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు జరుగుతుందని, దాదాపు 5 వేల పర్యావరణహిత వినాయక ప్రతిమలను తయారు చేయడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకొన్నట్టు తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగను జరుపుకొనేలా ప్రోత్సహించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, వీఎంసీ, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ రికార్డుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ అసోసియేషన్లు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇగ్నైట్ యాప్‌లోనూ అప్‌లోడ్ చేయొచ్చు

ప్రజలు కూడా తమ ఇళ్ల వద్దే మట్టి లేదా ప్రకృతిలో సహజసిద్ధంగా లభ్యమయ్యే వాటితో వినాయక ప్రతిమలను తయారుచేసి వాటి ఫొటోలను ఎన్టీఆర్ ఇగ్నైట్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని అప్‌లోడ్ చేయొచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

మధురానుభూతులకు సజీవ సాక్ష్యం ఫొటో

● పాత్రికేయ రంగంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకం ● కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి

కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ ఒక్క క్లిక్‌తో కెమెరాలో బంధించే ఛాయాచిత్రం వేయి భావాల లాజిక్ అని, ఫొటోలు ఎన్నో మధురానుభూతులకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని, ఫొటో లేని వార్తా పత్రిక వెలుగు లేని దివిటీ లాంటిదని, ఛాయాచిత్రం చూడటంతోనే సగం వార్తా సారాంశం పాఠకులకు అర్థమయిపోతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డీ చక్రపాణి అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డీ చక్రపాణి, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ పీ ప్రసాద్ సేకరించిన పురాతన అరుదైన కెమెరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా ఆర్థిక రంగానికి దాదాపు 67శాతం సేవా రంగం ద్వారా లభిస్తోందని, పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తే సేవా రంగం మరింత పురోగతి సాధించేందుకు వీలుంటుందన్నారు. ఛాయాచిత్రాల విజ్ఞాన సారథులైన ఫొటోగ్రాఫర్లు భాగస్వాములు కావాలన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డీ చక్రపాణి మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు, ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించేందుకు వివిధ రకాల ఇతివృత్తాలతో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా వుందన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర, తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం-2, న్యూస్ ఫొటోలకు సంబంధించి మూడు విభాగాల్లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రతి విభాగంలో ప్రథమ, (రూ.10 వేలు), ద్వితీయ (రూ.7 వేలు), తృతీయ (రూ.4 వేలు) బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అసోసియేటెడ్ ప్రొఫెసర్ జీ అనిత, ఎఫ్ఆర్‌పీఎస్ అవార్డు అవార్డు గ్రహీత, సీనియర్ ఫొటో జర్నలిస్టు టీ శ్రీనివాసరెడ్డి, విజయవాడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే రవికుమార్, హిందూ రిటైర్డ్ ఫొటోగ్రాఫర్ సీహెచ్ విజయభాస్కర్, ఆంధ్రజ్యోతి మాజీ సీనియర్ ఫొటో జర్నలిస్టు డీ సీతారాం, ఐ అండ్ పీఆర్ అధికారి కే రవి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు రూబెన్ బెసాలియల్, వైడీ ఆనంద్, డీఐపీఆర్వో కేవీ రమణారావు, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, వివిధ పత్రికలకు చెందిన ఫొటో జర్నలిస్టులు, ఏపీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణితో బహుమతులు పొందిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు డీ లక్ష్మణ్, బీ సతీష్, చీఫ్ ఫొటోగ్రాఫర్ జీవీ నారాయణ, పీ రాజేష్

మధుమేహులకు ఇన్‌హేలర్‌తో ఇన్సులిన్

డాక్టర్ యలమంచిలి సదాశివరావు

లబ్బీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ల నుంచి త్వరలో విముక్తి లభిస్తుందని, ఇన్సులిన్ సులువుగా తీసుకోగలిగేలా ఇన్హేలర్లు అందుబాటులోకి రానున్నాయని ప్రముఖ డయాబెటాలజిస్ట్, యలమంచిలి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచిలి సదాశివరావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హోటల్ జీఆర్టీ గ్రాండ్ నందు డాయాబ్ ఎండోకాన్ 2025 సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మధుమేహ వైద్యం ఆధునికతను సంతరించుకుందని, భయపడాల్సిన అవసరం లేదని, అధునాతన చికిత్సలతో కొత్త వెలుగులు విరబూయిస్తామన్నారు. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించుకోవడంతో పాటు గుండె జబ్బుల ముప్పు నుంచి కూడా తప్పించుకోవచ్చున్నారు. ఆధునిక వైద్యా విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ప్రతి ఏటా ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈసదస్సులో జాతీయ వైద్య నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ అమర్ పాల్ సింగ్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. వైడీఆర్ఎఫ్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచిలి, సెక్రటరీ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ అమూల్య యలమంచి పాల్గొన్నారు.


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న డాక్టర్ అమర్‌పాల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన

విజయవాడ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోని ఫీజు రియంబర్స్‌మెంట్ నిధుల వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాని కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు నగరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జీవో 77ను వెంటనే రద్దు చేసి పెండింగ్‌లోని ఫీజు రియంబర్స్ నిధుల విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వర్యం చేస్తున్న 35, 42 జీవోలను వెంటనే రద్దు చేయాలని, అర్హులైన వారికి తల్లికి వందనం నగదు మంజూరు చేయాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వారు వినతిపత్రం అందజేశారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

అవగాహన

దుప్పట్లు శుభ్రమేనా?

వారానికోసారి దుప్పట్లు శుభ్రం చేసుకోకపోతే, వాటి మీద పేరుకపోయే మృత చర్మ కణాలు, బ్యాక్టీరియా, ఫంగస్, డస్ట్ మైట్స్‌తో కలిసి నిద్రిస్తున్నట్టు లెక్క. వినడానికి విచిత్రంగా ఉన్నా, ఇదే నిజం. మనం నిద్రకు ముందు స్నానం చేస్తూ ఉంటాం. అయినా ప్రతి రాత్రీ మన శరీరం వందలు, వేల మృత కణాలను, నూనెలనూ, స్వేదాన్నీ విసర్జిస్తూనే ఉంటుంది. ఇవన్నీ వాటిలో వృద్ధి చెందే డస్ట్ మైట్స్‌కు అనుకూలమైన పర్యావరణాలు. అయితే డస్ట్ మైట్స్‌తో మనకెలాంటి ఉండకపోవచ్చు కానీ వాటి విసర్జకాలు అలర్జీలు, ఉబ్బసం, ఎగ్జీమాలకు దారి తీస్తాయి. దుప్పట్ల మీద ఫంగస్ కూడా పెరగవచ్చు. మరీ ముఖ్యంగా దిండ్ల మీద పెరిగే కొన్ని ఫంగస్ జాతులు, రోగనిరోధకశక్తి బలహీనంగా ఉన్న వారిలో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ల పెరుగుదలకు దోహదపడవచ్చు. అదే మంచాన్ని పెంపుడు జంతువులతో పంచుకునే అలవాటున్నవాళ్లు, అదనపు ఆరోగ్య సమస్యలకు సిద్ధపడాలి. వాటితో పడక మీదకు చేరే అదనపు ధూళి, రోమాలు, చుండ్రు,



విసర్జకాల అవశేషాలు మరికొన్ని ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడతాయి. కాబట్టి దుప్పట్లు, దిండు కవర్లను వారానికోసారి తప్పనిసరిగా శుభ్రం చేస్తూ ఉండాలి. సుస్తీ చేసినా, ఎక్కువ స్వేదం వెలువరిచే గుణం కలిగి ఉన్నా, ఇంట్లో పెంపుడు జంతువులున్నా ప్రతి నాలుగు రోజులకోసారి దుప్పట్లు, దిండ్ల కవర్లను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. అలాగే మందపాటి బ్లాంకెట్లను ప్రతి రెండు వారాలకూ, డ్యువెట్ కవర్లను ప్రతి 3 నుంచి 4 నెలలకూ శుభ్రపరుస్తూ ఉండాలి. దిండ్లను ప్రతి నాలుగు నెలలకు శుభ్రపరుస్తూ, పరుపులను వారానికోసారి వ్యాక్యూమ్ క్లీన్ చేయాలి. తరచూ ఆరుబయట ఎండకు ఆరబెడుతూ ఉండాలి.

ఆహారం- ఆరోగ్యం

మఖ్‌నా మతలబు

మఖ్‌నా కచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారమే! పొట్ట కదలికలను క్రమబద్ధీకరించి, జీర్ణశక్తిని పెంచే మఖ్‌నా, పేగుల ఆరోగ్యంతో పాటు శక్తి ఖర్చయ్యే వేగాన్ని కూడా పెంచుతాయి. అయితే ఈ ఆరోగ్యకరమైన పదార్థాన్ని తినకూడని వాళ్లూ ఉన్నారు. వాళ్లెవరంటే....


మూత్రపిండాల్లో రాళ్లు: వీటిలోకి ఆక్సలేట్స్, క్యాల్షియం, మెగ్నీషియం శోషణను కుంటుపరచడంతో పాటు మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడడానికి తోడ్పడతాయి. కాబట్టి మూత్రపిండాల్లో రాళ్ల ముప్పు ఉన్నవాళ్లు మఖ్‌నాలను తినకపోవడమే మేలు.



జీర్ణ సమస్యలు: ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ లేదా ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ సమస్యలున్నవారు, మఖ్‌నా లాంటి అత్యధిక పీచు పదార్థాలను జీర్ణం చేసుకోలేరు. దాంతో కడుపుబ్బరం, పొత్తికడుపులో అసౌకర్యం తలెత్తుతాయి

యూరిక్ యాసిడ్: మఖ్‌నాల్లో ప్యూరిన్స్ అనే సమ్మేళనాలుంటాయి. ఇవి శరీరంలో యూరిక్ యాసిడ్‌ను పెంచుతాయి. కాబట్టి గౌట్ సమస్య ఉన్నవారు, అత్యధిక యూరిక్ యాసిడ్ మోతాదులున్నవారు మఖ్‌నాకు దూరంగా ఉండాలి

రక్తం పలుచనయ్యే మందులు: మఖ్‌నాలో విటమిన్ కె ఉంటుంది. రక్తం గడ్డకట్టడానికి తోడ్పడే కె విటమిన్ అధికంగా ఉండడం వల్ల వీటిని తిన్నప్పుడు, వార్ఫారిన్ లాంటి రక్తం పలుచనయ్యే మందుల ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఇలాంటి మందులు వాడుకుంటున్నవారు మఖ్‌నా తినడం మానుకోవాలి.



మెదడులో కణుతులకు వయసుతో సంబంధం లేదు. అవి క్యాన్సర్ కణుతులు కావచ్చు, కాకపోవచ్చు. అవి ఏ కోవకు చెందినవైనా వాటిని తొలగించే అత్యాధునిక సర్జరీలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. మెదడులో క్యాన్సర్ కణుతులు, వాటి చికిత్సల గురించి వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!

బ్రెయిన్ ట్యూమర్

మెదడు కణుతులకు సమర్థ సర్జరీలు

40 ఏళ్ల లోపు వారిలో తలెత్తే మెదడు క్యాన్సర్లు, శరీరంలో వేరొక చోటు నుంచి అక్కడకు వ్యాపిస్తాయి. 40 ఏళ్లు పైబడిన వారిలో నేరుగా మెదడుకే సోకుతాయి. అయితే ఈ క్యాన్సర్ ఫలానా వయసు వారికే వస్తుందని కచ్చితంగా చెప్పడానికి కూడా వీల్లేదు. ఇది ఎవరికైనా రావచ్చు. న్యూరోఫైబర్ మెటోసిస్ టైప్2 కోవకు చెందిన వారికి క్యాన్సర్ రహిత గడ్డలు మెదడుతో సహా శరీరంలో ఎక్కడైనా రావచ్చు. వీటిలో క్యాన్సర్ గడ్డలు కూడా ఉండొచ్చు. మెదడులో క్యాన్సర్ ప్రధానంగా, పలు రకాల లక్షణాలతో బయల్పడుతూ ఉంటుంది. అవేంటంటే...

- తలనొప్పి, వాంతులు
- కంటిచూపు సమస్యలు
- మాటలు తడబడడం, మాట్లాడడంతో ఇబ్బందులు
- శరీరం తూలడం
- కాళ్లు, చేతుల్లో బలహీనత
- ప్రవర్తనా సమస్యలు (దురుసుగా ఉన్నవారు మందకొడిగా మారడం, మందకొడిగా ఉన్నవారు దురుసుగా ప్రవర్తించడం). సాధారణంగా మెదడు కణుతులతో తలెత్తే ప్రవర్తనా మార్పులను మానసిక సమస్యలుగా పొరబడుతూ ఉంటారు. కానీ తలనొప్పి, వాంతులతో పాటు ప్రవర్తనలో స్పష్టమైన మార్పులు కనిపించినప్పుడు, తప్పనిసరిగా న్యూరాలజిస్టులను సంప్రతించాలి.

నిర్థారణ పరీక్షలు ఇవే!


మెదడులోని కణుతుల గురించి స్పష్టమైన అవగాహన కోసం మెదడు ఎమ్మారై విత్ కాంట్రాస్ట్ పరీక్ష చేయవలసి ఉంటుంది. అలాగే ఈ పరీక్షతో కణితి ఉన్న ప్రదేశం నిర్థారించుకున్న తర్వాత, జనరల్ అనస్థీషియా ఇచ్చి సర్జరీ చేయాలా? లేదంటే అవేక్ సర్జరీ చేయొచ్చా? అన్నది వైద్యులు నిర్థారిస్తారు. కణితి ఇంద్రియాలను నియంత్రించే మెదడులోని ప్రదేశాలకు దూరంగా ఉన్నప్పుడు జనరల్ ఎనస్థీషియాతో సర్జరీ చేయవచ్చు. బదులుగా కణితి ఇంద్రియాలతో అనుసంధానమై ఉన్న ప్రదేశాలకు దగ్గరగా ఉన్నప్పుడు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉండడం కోసం రోగిని మెలకువగా ఉంచి చేసే సర్జరీని వైద్యులు ఎంచుకోవలసి వస్తుంది.

అవేక్ సర్జరీ అంటే?

మెదడులో 'ఎలోక్వెంట్ కార్టెక్స్' అనే ప్రదేశం ఉంటుంది. ఈ ప్రదేశం శరీర కదలికలు, ఇంద్రియాలు, చూపు, వినికిడి, భాష, జ్ఞాపకశక్తులకు సంబంధించినది. ఈ ప్రదేశంలో ఏర్పడే కణుతులతో సంబంధిత అవయవాలు, ఇంద్రియాల్లో సమస్యలు తలెత్తినప్పుడు, ఆ ప్రాంతం దెబ్బతినకుండా కణితిని సమూలంగా తొలగించడం కోసం వైద్యులు అవేక్ సర్జరీని ఎంచుకుంటారు. మెదడు కణితి వల్ల మాట్లాడడంలో సమస్య ఉన్నప్పుడు, సర్జరీ చేసే సమయంలో సదరు రోగికి కొన్ని చిత్రాలు చూపిస్తూ, మాట్లాడిస్తూ, మెదడులోని సంబంధిత ప్రదేశం దెబ్బతినకుండా సురక్షితంగా కణితిని తొలగిస్తారు. బదులుగా జనరల్ అనస్థీషియాలో ఇదే సర్జరీ చేసినప్పుడు, కణితిని సమూలంగా తొలగించే వీలుండకపోవచ్చు. అలాగే స్పీచ్‌తో అనుసంధానమై ఉన్న మెదడు ప్రదేశం దెబ్బతినే ప్రమాదం కూడా ఉండొచ్చు. కాబట్టి అవేక్ సర్జరీని ఎంచుకోవడం ద్వారా సదరు ప్రదేశానికి బదులుగా దాని పక్క నుంచి నేరుగా కణితిని చేరుకుని, పూర్తిగా తొలగించగలిగే వీలుంటుంది. కంటిచూపు, అవయవాలు, వినికిడికి సంబంధించిన మెదడులోని క్యాన్సర్ కణుతులన్నిటికీ వైద్యులు అవేక్ సర్జరీనే ఎంచుకుంటారు. ఇంద్రియాలతో అనుసంధానమై ఉన్న మెదడు ప్రదేశాలకు బదులుగా ఇతర ప్రదేశాల్లో కణుతులు ఉన్నప్పుడు పూర్తిగా మత్తిచ్చి చేసే సర్జరీని వైద్యులు ఎంచుకుంటారు.

అత్యాధునిక సాంకేతికతలతో...

మెదడు సర్జరీ అనగానే విపరీతంగా భయపడిపోయే వాళ్లే ఎక్కువ. కానీ నేడు మెదడు సర్జరీలపరంగా అత్యంత సురక్షితమైన, ప్రభావవంతమైన సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి.



ఎమ్మారై: సర్జరీకి ముందు చేసే ఎమ్మారైలోనే కణితి కచ్చితమైన ప్రదేశం తెలుస్తుంది

న్యూరో నావిగేషన్: ఇది వైద్యులకు జిపిఎస్‌లా సహాయపడుతుంది. దీని సహాయంతో సర్జరీ సమయంలో వైద్యులు క్యాన్సర్ కణితిని సూటిగా చేరుకోగలుగుతారు. సర్జరీ తదనంతరం కణితిని పూర్తిగా తొలగించినట్టు నిర్థారించుకోవడం కూడా వైద్యులు న్యూరో నావిగేషన్ మీదే ఆధారపడతారు.

ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్: సర్జరీ సమయంలో మెదడుతో పాటు దాన్లోని క్రియలన్నీ సక్రమంగా పని చేస్తున్నట్టు నిర్థారించుకోడానికి ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్ తోడ్పడుతుంది

హై ఎండ్ మైక్రోస్కోప్: సూక్ష్మ రక్తనాళాలను కనిపెట్టి, రక్తస్రావాన్ని నివారించడం కోసం ఇది సహాయపడుతుంది

అల్ట్రాసోనిక్ ఆస్పిరేటర్: మెదడులోని క్యాన్సర్ గడ్డను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి, బయటకు లాగే పరికరం ఇది

కీమో థెరపీ, రేడియేషన్

సర్జరీతో మెదడులోని క్యాన్సర్ గడ్డను తొలగించిన తర్వాత, ఆ క్యాన్సర్ దశ ఆధారంగా వైద్యులు కీమోథెరపీ, రేడియేషన్ కాలాన్ని నిర్ణయిస్తారు. మెదడు క్యాన్సర్ చికిత్సలో వైద్యులు రేడియేషన్ థెరపీతో పాటు మాత్రలు కూడా ఇస్తారు. మాత్ర ఇచ్చిన 40 నిమిషాల తర్వాత అందించే రేడియేషన్‌తో ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

రోబోట్ అసిస్టెడ్ సర్జరీ

మెదడులోని అన్ని కణుతులనూ సర్జరీతో తొలగించే వీలుండకపోవచ్చు. దగ్గరకు చేరుకోలేనంత లోతుగా కణితి ఏర్పడినప్పుడు వైద్యులు రోబోట్ అసిస్టెడ్ సర్జరీ సహాయంతో కణితిలోని చిన్న ముక్కను బయటకు తీసి, దాని దశను తెలుసుకుని రేడియేషన్, కీమోథెరపీ సూచిస్తూ ఉంటారు. అలాగే మెదడులో లోతుగా ఉన్న కణితిని సమూలంగా తొలగించానికి కూడా ఇదే సర్జరీ తోడ్పడుతుంది.

అది అపోహ మాత్రమే!

మెదడు సర్జరీతో చేతులు, కాళ్ల చచ్చుబడితాయన్నది అపోహ మాత్రమే! నేడు అందుబాటులో ఉన్న సాంకేతికతలను సమర్థంగా వినియోగించుకోగలిగితే, 98% మంది రోగులు ఎటువంటి దుష్ప్రభావాలూ లేకుండా పూర్తిగా కోలుకుంటారు. అలాగే మెదడు సర్జరీతో తలెత్తే దుష్ప్రభావాలు కూడా క్రమేపీ తొలగిపోతాయి. మెదడు ఎడమ వైపు ఉన్న కణితికి సర్జరీ చేసినప్పుడు, శరీరంలో కుడి వైపు అవయవాల్లో కొంత బలహీనత కనిపించవచ్చు. కుడివైపు సర్జరీ తర్వాత ఎడమ వైపు అవయవాలు బలహీన పడవచ్చు. అయితే ఈ బలహీనత కూడా తాత్కాలికమే! సర్జరీ తదనంతర ఫిజియోథెరపీతో ఈ సమస్యలన్నీ సర్దుకుంటాయి. కేవలం 2 నుంచి 3% రోగులకు మాత్రమే శాశ్వత లోపాలు తలెత్తుతాయి.

డాక్టర్ ఆర్. అయ్యాదురై,
సీనియర్ రోబోటిక్ న్యూరోసర్జన్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.




పారాహుషార్

చాట్ జిపిటితో ఆరోగ్య ముప్పు

కృత్రిమ మేధస్సు ఎఐ చాట్ జిపిటి అందుబాటులోకొచ్చిన తర్వాత ఆరోగ్య సమస్యల పరిష్కారాలకూ, సూచనలకూ దాని మీద ఆధారపడే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అయితే ఒక 60 ఏళ్ల వ్యక్తి చాట్ జిపిటి సూచించిన సలహాతో ఆస్పత్రి పాలైన ఉదంతమొకటి యానల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్‌లో తాజాగా ప్రచురితమైంది. ముగ్గురు వైద్యులు రాసిన ఆ నివేదికలో...

ఒక 60 ఏళ్ల వ్యక్తి చిత్తభ్రమలతో ఆస్పత్రికి చేరుకుని, పొరుగింటి వ్యక్తి తన మీద విష ప్రయోగం చేస్తున్నట్టు అనుమానం వ్యక్తం చేశాడు. అయితే అతనికి పరీక్షలు చేపట్టినప్పుడు విస్తుపోయే విషయం బయల్పడింది. అతను గత కొంతకాలంగా చాట్ జిపిటి సలహా మేరకు టేబుల్ సాల్ట్‌కు బదులుగా బ్రోమైడ్‌ను తీసుకుంటున్నట్టు వైద్యులు



కనిపెట్టారు. ఉప్పుతో పొంచి ఉండే ఆరోగ్య ముప్పుల నుంచి తప్పించుకోవడం కోసం ప్రత్యామ్నాయాన్ని సూచించమని చాట్ జిపిటిని అడిగినప్పుడు, అది బ్రోమైడ్‌ను సూచించిందనీ, ఆ సలహా మేరకు మూడు నెలలుగా తాను బ్రోమైడ్ తీసుకుంటున్నాననీ సదరు వ్యక్తి చెప్పడం జరిగింది. బ్రోమైడ్ టాక్సిసిటీ ఫలితంగా అతను చిత్తభ్రమలకు లోనైనట్టు కనిపెట్టిన వైద్యులు ఆ తర్వాత చికిత్సతో పరిస్థితిని సరిదిద్దారు. వాస్తవానికి బ్రోమైడ్‌ను పశువైద్యంలో భాగంగా, కుక్కలు, పిల్లుల మూర్ఛల చికిత్సలో పశువైద్యులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇదే బ్రోమైడ్ ఉప్పు రూపంలో విస్తృతంగా దొరుకుతూ ఉండడంతో విదేశాల్లో వీటి వాడకం పెరుగుతోంది. అయితే అసలు విషయాన్ని నిర్థారించుకునేందుకు వైద్యులు చాట్ జిపిటిని సంప్రతించి... 'క్లోరైడ్'కు ప్రత్యామ్నాయం ఏంటని అడిగినప్పుడు, ఆ ఎఐ... 'బ్రోమైడ్'ను సూచించింది. అంతేతప్ప, దాంతో ముడిపడి ఉండే ఆరోగ్య హెచ్చరికలను ప్రస్తావించలేదు. అలాగే ఆ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారని కూడా ఎదురు ప్రశ్నించలేదు. ఇదే ప్రశ్న ఒక వైద్యుడిని అడిగినప్పుడు, కచ్చితంగా భిన్నమైన సమాధానం వచ్చి ఉండేదనీ, చాట్ జిపిటిలా వైద్యులు పొరపాట్లు చేసే ఆస్కారం ఉండదనీ, కాబట్టి వైద్య సలహాల కోసం ఎఐ మీద ఆధారపడడం మానుకోవాలనీ వైద్యులు సూచిస్తున్నారు.

కుక్క కాటుకు యాంటీ రేబీస్ దెబ్బ

కుక్క కరిచిన ప్రదేశాన్ని సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకుని సరిపెట్టుకునే వాళ్లుంటారు. కానీ పెంపుడు కుక్క, వీధి కుక్క... ఏది కరిచినా రేబీస్ రాకుండా ఇంజెక్షన్లు తీసుకోవడం తప్పనిసరి.



కుక్కలకు సోకే రేబీస్ వైరస్ వాటి శరీరంలో దీర్ఘకాలం పాటు ఉండిపోతుంది. వ్యాధి తీవ్రమై, కుక్క ప్రాణాలు కోల్పోయే లోపు అది ఎంత మందిని కరిస్తే, అంతమందికీ రేబీస్ వైరస్ సోకుతుంది. అయితే కుక్కకు రేబీస్ సోకిందో లేదో తెలుసుకోవడం కోసం కుక్కలో కొన్ని లక్షణాలను మనం గమనించవచ్చు. అవేంటంటే...

- చలాకీగా కదిలే కుక్క అకస్మాత్తుగా నీరసించడం
- ఒంటరిగా ఉండిపోవడం
- నోటి నుంచి సొంగ కారడం
- నీటికి దూరంగా ఉండడం
- గుండ్రంగా తిరుగుతూ ఉండడం

ఇలాంటి లక్షణాలు కనిపించిన కుక్కకు దూరంగా ఉండాలి. వాటికి ఆహారం తినిపించడం, వాటితో ఆడడం లాంటివి చేయకూడదు.

ఏ కుక్క కరిచినా..

కుక్క కరిచినప్పుడు, ఎంత లోతుగా కరిచింది అనే దాని మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. కుక్క గోళ్లతో గోకడాన్ని గ్రేడ్ ఎగా, కొరికినప్పుడు పంటిగాటు ఏర్పడితే ఆ గాయాన్ని గ్రేడ్ బిగా, పంటిగాటుతో పాటు రక్తస్రావమైతే గ్రేడ్ సిగా పరిగణించాలి. ఈ గాయాలకు రేబిక్యూర్ వ్యాక్సిన్‌తో పాటు, రేబీస్ ఇమ్యునోగ్లోబ్యులిన్ కూడా ఇవ్వవలసి ఉంటుంది. కుక్కకు ఎలాంటి టీకాలు ఇప్పించకపోయినా, అది వీధి కుక్క అయినా, పెంపుడు కుక్క అయినా రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా చాలా మంది వీధిలో రోజూ కనిపించే కుక్క, దానికేం కాలేదు కాబట్టి మాక్కూడా ఏం జరగదు అని చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ అది ఎలాంటి కుక్క అయినా, ఎలాంటి లక్షణాలు లేకున్నా తప్పనిసరిగి వైద్యులను కలిసి ఇంజెక్షన్లు తీసుకోవాలి.

గాయాన్ని నాకడం, గీకడం, కొరకడం

గీకడం: కుక్క గోళ్ల గీసుకున్నప్పుడు వెంటనే సబ్బునీళ్లతో శుభ్రం చేసుకోవాలి

కొరికినప్పుడు: పన్ను లోపలకు దిగి రక్తం కారినప్పుడు, ఆ ప్రదేశంలో ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి, రేబీస్ వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి

గాయాన్ని నాకితే: సబ్బుతో గాయాన్ని కడిగి, ఆ ప్రదేశంలో ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి, రేబీస్ వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి

పెంపుడు కుక్కల నుంచి కుటుంబసభ్యులకు వ్యాధులు సోకుతాయి. కాబట్టి పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబీస్‌తో పాటు లెప్టోస్పైరోసిస్ లాంటి ఇతరత్రా వ్యాధులు రాకుండా సదరు టీకాలు కూడా ఇప్పించాలి.

డోసులు ఇలా...

పెంపుడు కుక్క: యాంటీ రేబీస్ టీకాలు ఇప్పించిన పెంపుడు కుక్క కరిచినప్పుడు మూడు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, ఏడవ రోజు 21 రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి.

వీధి కుక్క: ఈ కుక్క కరిచినప్పుడు ఐదు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 27వ రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి.

డాక్టర్ శ్రీకృష్ణ ఆర్ బొడ్డు,
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
కామినేని హాస్పిటల్స్,
ఎల్‌బి నగర్, హైదరాబాద్.





రేబీస్ మెదడుకు సోకితే...

సాధారణంగా కుక్క కరిచిన కొన్ని రోజుల తర్వాత బాధితులు వైద్యులను కలుస్తూ ఉంటారు. కానీ ఆ కుక్కకు రేబీస్ ఉందో లేదో మనకు తెలియదు కాబట్టి వెంటనే వైద్యులను కలవాలి. కుక్క కరిచిన గాయం ద్వారా మన శరీరంలోకి చేరుకునే రేబీస్ వైరస్ అన్ని అవయవాలతో పాటు అంతిమంగా మెదడుకు కూడా చేరుకుంటుంది. వైరస్ మెదడుకు చేరుకోవడం ప్రాణాంతకం. ఈ దశకు చేరుకున్న తర్వాత చికిత్సతో సాధారణ స్థితికి తీసుకురావడం అసాధ్యం. కాబట్టి ఆలోగానే వైద్యులను కలిసి ఇంజెక్షన్లు మొదలుపెట్టాలి. రేబీస్ వైరస్ మన వ్యాధినిరోధక వ్యవస్థ మీద పూర్తిగా ఆధిపత్యం సాధించి, తన సంఖ్యను విస్తృతం చేసుకుంటుంది. ఈ వైరస్ ఉధృతమై మెదడుకు సోకినప్పుడు ఆయాసం, జ్వరం, దాహం వేస్తున్నా నీళ్లు తాగలేని పరిస్థితి, వెలుతురును తట్టుకోలేకపోవడం, గాలి కోసం తవన పడడం, చికాకు, విపరీత ప్రవర్తన, భౌతిక దాడికి పాల్పడడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ఇలా రేబీస్ మెదడుకు సోకిన రోగులకు చికిత్స లేదు కాబట్టి లక్షణాలను అదుపు చేసే చికిత్సలను అందించే రేబీస్ సెంటర్‌కు తరలించవలసి ఉంటుంది. రేబీస్ మెదడుకు సోకి చివరి దశకు చేరుకున్న రోగులు చికిత్సతో తిరిగి పూర్తి ఆరోగ్యం పొందిన దాఖలాలు ఇప్పటివరకూ లేవు. కాబట్టి కుక్క కరిచిన 24 గంటల్లోపే వైద్యులను కలిసి యాంటీ రేబీస్ చికిత్స మొదలుపెట్టుకోవాలి.

కిడ్నీ కేర్

మూత్రపిండాల సమస్యలు కొన్ని ప్రధాన లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటాయి. కానీ సాధారణంగా మనం వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. అయితే కొన్ని కీలకమైన సంకేతాలను పసిగట్టగలిగితే, ముంచుకొచ్చే ముప్పును ముందస్తుగానే గుర్తించవచ్చని అంటున్నారు సికె బిర్లా హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్, డాక్టర్ మోహిత్ ఖీర్బత్.

ఈ లక్షణాలు ప్రమాదకరం

మూత్రవిసర్జన: మూత్రవిసర్జనలో మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. మూత్రం పెరిగినా, తగ్గినా, మూత్రం రాకపోతున్నా, మూత్రంలో నురగ కనిపిస్తున్నా మూత్రపిండాలు ముప్పులో పడ్డాయని అర్థం

నీరసం: మూత్రపిండాలు, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడే హార్మోన్‌ను సమకూరుస్తాయి. మూత్రపిండాల సామర్థ్యం దెబ్బతిన్నప్పుడు, హార్మోన్ క్షీణించి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తి సన్నగిల్లి, రక్తహీనతతో నీరసం ఆవరిస్తుంది

పాదాలు, చేతుల వాపులు: మూత్రపిండాలు ఒత్తిడికి లోనైనప్పుడు శరీరంలో నీరు నిలిచి పోతుంది. దాంతో కాళ్లు, చేతుల వాపులు కనిపిస్తాయి



కళ్ల వాపు: ప్రొటీన్ నష్టం దెబ్బ తిన్న మూత్రపిండాలకు సూచన. దకళ్ల చుట్టూరా తలెత్తే వాపు ప్రొటీన్ నష్టాన్ని సూచిస్తుంది. కాబట్టి ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేయకూడదు

శ్వాస సమస్య: మూత్రపిండాలు ఒత్తిడికి లోనవడం వల్ల, ఊపిరితిత్తుల్లో నీళ్లు చేరి లేదా రక్తహీనత వల్ల విశ్రాంత స్థితిలో సైతం ఊపిరి తీసుకోవడం కష్టంగా మారుతుంది

దురదలు: ఆరోగ్యకరమైన మూత్రపిండాలు వ్యర్థాలను వడగట్టి విసర్జనకు తోడ్పడతాయి. అవి దెబ్బతిన్నప్పుడు, వడపోతకు ఆటంకం ఏర్పడి, చర్మం పొడిబారుతుంది. దురదలు వేధిస్తాయి

వెన్ను నొప్పి: వెన్ను లేదా పక్కటెముకల నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదు. ఈ లక్షణాలు కిడ్నీల్లో రాళ్లు, ఇన్‌ఫెక్షన్లకు సూచనలు

ప్రజ్ఞానందకు వరుసగా ఐదో డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్): సింక్యుఫీల్డ్ కప్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా ఐదో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. ఆరో రౌండ్‌లో పోలెండ్ జీఎం జాన్ క్రెజిస్ టోఫ్‌తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 32 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. అలీరెజా ఫిరోజా (ఫ్రాన్స్)తో గేమ్‌ను వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు డ్రాగా ముగించాడు. మొత్తం ఆరు రౌండ్ల నుంచి ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో, గుకేష్ 3 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్నారు.

క్వితోవా బై..బై



వరల్డ్ మాజీ నెం.1, 2011, 2014 వింబుల్డన్ విజేత పెట్రా క్వితోవా టెన్నిస్‌కు వీడ్కోలు పలికింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 35 ఏళ్ల క్విటోవా యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో 1-6, 0-6తో డ్యానీ ప్యారీ చేతిలో ఓటమిపాలైంది. కాగా, యూఎస్ ఓపెన్ తనకు కెరీర్‌లో చివరిదని క్విటోవా ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. బిడ్డకు జన్మనివ్వడంతో 2024 సీజన్ మొత్తం ఆటకు దూరంగా ఉన్న క్విటోవా..గత ఫిబ్రవరిలో పునరాగమనం చేసినా ఆశించిన మేర రాణించలేకపోయింది.



చాను రికార్డు స్వర్ణం

- తెలుగమ్మాయి భవానికి రజతం
- కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్

అహ్మదాబాద్: గాయం నుంచి కోలుకొని ఏడాది తర్వాత రీఎంట్రీ ఇచ్చిన టోక్యో ఒలింపిక్స్ రజత పతక వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సోమవారం జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్ మహిళల 48 కిలోల విభాగంలో చాను.. స్నాచ్‌లో 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలతో మొత్తం 193 కిలోల బరువు ఎత్తి స్వర్ణం సొంతం చేసుకొంది. ఎత్తిన చాను కామన్వెల్త్ రికార్డులను బద్దలుకొట్టింది. ఓవరాల్‌గా గతంలో కంటే అధికంగా 14 కిలోల బరువు ఎత్తింది. మలేసియా లిఫ్టర్ ఐరెనీ హెన్రీ 161 (73+88) కిలోలు ఎత్తి రజతం, వేల్స్ లిఫ్టర్ నికోల్ రాబర్ట్స్ 150 (70+80) కిలోలు లిఫ్ట్ చేసి కాంస్యం దక్కించుకొన్నారు. పురుషుల 60 కిలోల కేటగిరీలో జాతీయ క్రీడల చాంపియన్ రిషికాంత్ సింగ్ 271 (120+151) కిలోలు ఎత్తి బంగారు పతకం నెగ్గాడు. గతంలో మీరాబాయి 49 కిలోల కేటగిరీలో పోటీపడేది. అయితే, విశ్వక్రీడల నుంచి ఆ విభాగాన్ని తొలగించడంతో 48 కిలోల విభాగానికి మారింది. ఇక, ఇదే టోర్నీ సబ్ జూనియర్ విభాగంలో తెలుగమ్మాయి రెడ్డి భవాని పతకంతో సత్తా చాటింది. ఏపీలోని విజయనగరానికి చెందిన భవాని మహిళల 48 కిలోల కేటగిరిలో రజత పతకం గెలుచుకుంది. స్నాచ్‌లో 66 కిలోలు ఎత్తిన భవాని.. క్లీన్ అండ్ జెర్క్‌లో 92 కిలోలు లిఫ్ట్ చేసింది. దీంతో ఓవరాల్‌గా 158 కిలోల బరువుతో భవాని రెండోస్థానంలో నిలిచింది.

మెద్వెదెవ్ అవుట్

యూఎస్ ఓపెన్

తొలి రౌండ్‌లోనే ఇంటిదారి

జొకో, సబలెంక బోణీ



ఓటమి అనంతరం అసహనంతో రాకెట్ విరగ్గొట్టిన మెద్వెదెవ్

న్యూయార్క్: రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్‌లోనూ మొదటి రౌండ్‌లో చుక్కెదురైంది. 2021 యూఎస్ ఓపెన్ చాంపియన్ మెద్వెదెవ్‌కు ఫ్రాన్స్ ఆటగాడు బెంజమిన్ బోన్జీ మళ్లీ షాకిచ్చాడు. ఇక ఏడో సీడ్ నొవాక్ జొకోవిచ్, టాప్ సీడ్ సబలెంక, నాలుగో సీడ్ పెగుల, ఏడో సీడ్ పోలిని, 10వ సీడ్ నవారో శుభారంభం చేశారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో అన్‌సీడెడ్ బోన్జీ 6-3, 7-5, 6-7 (7), 0-6, 6-4తో 13వ సీడ్ మెద్వెదెక్‌కు ఝలకిచ్చాడు. వింబుల్డన్ మొదటి రౌండ్‌లో కూడా డానిల్‌ను బోన్జీ తిరుగుముఖం పట్టించడం గమనార్హం. ఇక..25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జొకోవిచ్ 6-1, 7-6 (3), 6-2తో టీన్‌పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరాడు. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-5, 6-2, 6-4తో ఎమీలో నవాపై, 21వ సీడ్ మక్‌హాక్ 6-3, 6-1, 6-1తో నార్డీపై, నకాషిమా 6-2, 6-7 (7), 2-6, 6-2, 7-6 (10)తో జోంగ్‌పై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. డిఫెండింగ్ చాంపియన్ సబలెంక 7-5, 6-1తో రెబెకా మసరోవాని, పెగుల 6-0, 6-4తో మయార్ షరీఫ్‌ను, పోలిని 6-2, 7-6 (4)తో ఐవాని, 10వ సీడ్ నవారో 7-6 (9), 6-3తో వాంగ్‌ని, 16వ సీడ్ బెన్సిక్ 6-3, 6-3తో జాంగ్‌ని, అజరెంకా 7-6 (0), 6-4తో ఇనోనిని ఓడించారు.



అలెగ్జాండ్రా సంచలనం

ఫిలిప్పీన్స్‌కు చెందిన 20 ఏళ్ల అలెగ్జాండ్రా యాలా సంచలనం సృష్టించింది. తొలి రౌండ్‌లో 6-3, 2-6, 7-6 (13--11)తో 14వ సీడ్ క్లారా టాసన్‌ను చిత్తు చేసింది. తద్వారా ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రా మ్యాచ్ గెలిచిన తొలి ఫిలిప్పీన్స్ ప్లేయర్‌గా అలెగ్జాండ్రా రికార్డుకెక్కింది. భారీ సంఖ్యలో విచ్చేసిన ఫిలిప్పీన్స్ దేశస్థులు ప్రోత్సహిస్తుండగా ఐదడుగుల తొమ్మిది అంగుళాల పొడగరి అయిన యాలా విజృంభించి ఆడింది. మూడో సెట్‌లో 1-5 వెనుకంజలో నిలిచినా అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

ఇషా బృందానికి కాంస్యం

నీరూ డబుల్ గోల్డ్

ఆసియా షూటింగ్



షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ ఇషా సింగ్ పతకం సాధించింది. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో ఇషా సింగ్, మనూ భాకర్, సిమ్రన్‌ప్రీత్ కౌర్ త్రయం మూడోస్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా స్వర్ణం, కొరియా రజత పతకం అందుకున్నాయి.

నీరూకు రెండు స్వర్ణాలు: జాతీయ క్రీడల చాంపియన్ నీరూ ధండ రెండు స్వర్ణాలతో దుమ్మురేపింది. తొలుత మహిళల ట్రాప్‌లో నీరూ పసిడి పతకం కొల్లగొట్టింది. భారత్‌కే చెందిన ఆషిమా అహ్లావత్ కాంస్య పతకం నెగ్గింది. అనంతరం నీరూ, ఆషిమా, ప్రీతీ రజాక్ బృందం మహిళల ట్రాప్ టీమ్ పసిడి పతకం సొంతం చేసుకుంది. పురుషుల ట్రాప్ విభాగంలో భౌనీష్ రజతం నెగ్గాడు. జూనియర్ మహిళల 25 మీ. పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్లు పాయల్ ఖత్రి, నామ్యా కపూర్, తేజస్విని వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గి క్లీన్‌స్వీప్ చేశారు. అలాగే టీమ్ విభాగంలో పాయల్, కపూర్, తేజస్విని త్రయం రజత పతకం కూడా అందుకోవడం విశేషం.

స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్ 11 అవుట్

- రూ.358 కోట్ల ఒప్పందం రద్దు
- మరో కంపెనీ వేటలో బీసీసీఐ



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ల జెర్సీలపై ఇక నుంచి డ్రీమ్-11 లోగో కనిపించదు. టీమిండియా ప్రధాన స్పాన్సరర్‌గా కొనసాగుతున్న ఈ ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ తమ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్-నియంత్రణ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారింది. దీంతో డ్రీమ్ స్పోర్ట్స్ కంపెనీ తమ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ విషయాన్ని అటు బీసీసీఐ కూడా ధ్రువీకరించింది. 2023లో మూడేళ్ల కాలానికి డ్రీమ్-11తో బోర్డు రూ.358 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే డ్రీమ్-11 ఇలా మధ్యలోనే తమ స్పాన్సర్‌షిప్‌ను రద్దు చేసుకున్నా బీసీసీఐ జరిమానా విధించే అవకాశం లేదు. ఎందుకంటే నిబంధన ప్రకారం.. కంపెనీ ప్రధాన వ్యాపారాన్ని ఏదైనా ప్రభుత్వ చట్టం ప్రభావితం చేస్తే స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలిగినా నష్టపరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మరోవైపు వచ్చేనెల 9 నుంచి ఆసియా కప్ జరగనున్న తరుణంలో ఈ పరిణామం బీసీసీఐని ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే డ్రీమ్ 11 లోగోలతో కూడిన ఆటగాళ్ల జెర్సీలు కూడా సిద్ధమయ్యాయి. కానీ వాటిని ఉపయోగించడానికి లేదు. ఈ టోర్నీకి స్పాన్సర్‌లు లేకుండానే జట్టు వెళ్తుందా? లేక మరో 15 రోజుల్లోనే బోర్డు కొత్త స్పాన్సర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటుందా? అనేది తేలాలి. మరోవైపు టొయోటా కంపెనీ స్పాన్సర్‌షిప్‌పై ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం.

రోహిత్‌ను సాగనంపేందుకే..

బ్రాంకో టెస్టుపై మనోజ్ తివారీ



న్యూఢిల్లీ: భారత క్రికెటర్లను మరింత ఫిట్‌గా ఉంచే ప్రక్రియలో బీసీసీఐ ఇటీవల కొత్తగా బ్రాంకో టెస్టును ప్రవేశపెట్టింది. అయితే వెటరన్ స్టార్ రోహిత్ శర్మను జట్టులోంచి తప్పించేందుకు ఈ టెస్టును తీసుకువచ్చారని మాజీ ఆటగాడు మనోజ్ తివారీ సంచలన ఆరోపణ చేశాడు. '2027 వన్డే వరల్డ్‌కప్ జట్టులో విరాట్‌ను తీసుకోకుండా ఉండలేరు. అతడి ఫిట్‌నెస్ స్థాయి అలాంటిది. కానీ రోహిత్‌ను పక్కనబెట్టాలని బోర్డు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. అందుకే కొన్ని రోజుల క్రితం కఠినమైన బ్రాంకో టెస్టును ప్రవేశపెట్టారు. రోహిత్ శరీరతత్వం ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. కచ్చితంగా తను ఈ టెస్టులో పాస్ అవలేడు. కోచ్ గంభీర్ ఇప్పుడే దీన్ని ఎందుకు అమలు చేయాలనుకుంటున్నాడో అర్థమవుతుంది' అని తివారీ వివరించాడు. అలాగే తాను శ్రీలంక పర్యటనలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించినా జట్టులో చోటు దక్కలేదని, బహుశా అప్పటి కెప్టెన్ ధోనీకి నచ్చలేదేమోనని తెలిపాడు.

గంభీర్ స్థానంలో గంగూలీ?


జోరుగా ఊహాగానాలు



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్లకు డైరెక్టర్, మెంటార్‌గా వ్యవహరించిన మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. తాజాగా సౌతాఫ్రికాకు చెందిన ఎస్‌ఏ20 లీగ్ జట్టు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ వార్త సోషల్ మీడియాలో ఊహాగానాలకు తెరలేపింది. ఫ్రాంచైజీ కోచ్‌గా బాధ్యతలు తీసుకొన్నాడంటే.. అతడు త్వరలో భారత కోచ్‌గా వస్తాడంటూ చర్చ మొదలైంది. ఇవన్నీ ఊహాగానాలుగా భావిస్తున్నా.. వాటిల్లో నిజం లేకపోలేదంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుత కోచ్ గంభీర్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తాచాటినా టెస్టులకు వచ్చేసరికి కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లాంటి ప్లేయర్ల రిటైర్మెంట్‌తో ఆయా స్థానాలు భర్తీచేసే వారి కోసం వెతకాల్సి ఉంది. ఈ క్రమంలో గంగూలీ అయితే జట్టును మెరుగ్గా తీర్చిదిద్దుతాడని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కానీ, సీజన్ మధ్యలో కోచ్‌లను తప్పించే సంప్రదాయం బీసీసీఐకు లేదు. అన్నింటికంటే ముందు కోచ్‌గా దాదా తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

లక్ష్య సేన్‌కు నిరాశ

- తొలిరౌండ్లోనే వెనుదిరిగిన భారత స్టార్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పారిస్: వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో సేన్ 17-21, 19-21తో వరల్డ్ నెం.1 షి యు కి (చైనా) చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్‌లో ఆరంభంలో ఇద్దరూ 6-6తో సమవుజ్జీలుగా కనిపించినా.. వరుసగా 4 పాయింట్లు సాధించిన షి యు 11-9తో బ్రేక్‌కు వెళ్లాడు. తర్వాత 11-11తో సేన్ సమం చేసినా.. వరుసగా ఐదు పాయింట్లు స్కోరు చేసిన చైనా షట్లర్ 16-11తో మెరుగైన ఆధిక్యం సాధించాడు. అదే జోరులో తొలి గేమ్‌ను నెగ్గాడు. రెండో గేమ్‌లో 9-11తో వెనుకంజలో ఉన్న సమయంలో పుంజుకొన్న సేన్ 16-16తో సమం చేశాడు. ఆ తర్వాత షి యు ఆధిక్యంలోకి దూసుకెళ్లినా.. సేన్ 19-19తో మరోసారి సమం చేశాడు. అయితే, కీలక సమయంలో సేన్ అనవసర తప్పిదాలతో మ్యాచ్ చైనా షట్లర్ సొంతమైంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతుపర్ణ-శ్వేతపర్ణ జంట 12-21, 11-21తో బల్గేరియా జోడీ గాబ్రియెలా-స్టెఫానీ చేతిలో, ప్రియ-శ్రుతి మిశ్రా ద్వయం 17-21, 16-21తో ఫ్రాన్స్ జంట మార్గాట్ లాంబర్ట్-కమెల్లీ చేతిలో పరాజయం పాలయ్యారు.

బిజినెస్

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ మెగా డీల్

- 2.65 లక్షల చ.అ ఆఫీస్ స్పేస్ లీజుకు తీసుకున్న టెక్ దిగ్గజం
- నెలకు రూ.5.4 కోట్ల అద్దె



హైదరాబాద్: అమెరికా టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. హైదరాబాద్‌లో వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ సెంటారస్ బిల్డింగ్‌లో 2.65 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని (ఆఫీస్ స్పేస్) లీజుకు తీసుకుంది. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్ మార్కెట్లో ఇప్పటివరకు కుదిరిన అతిపెద్ద లీజు ఒప్పందాల్లో ఇదొకటి. రియల్ ఎస్టేట్ డేటా ప్లాట్‌ఫామ్ ప్రాప్‌స్టాక్ ప్రకారం.. వర్క్‌స్పేస్ నిర్వహణదారు టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ నుంచి ఫీనిక్స్ సెంటారస్‌లోని 3,4 అంతస్థులను మైక్రోసాఫ్ట్ ఇండియా ఐదేళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. ఈ జూలై 1 నుంచి ఒప్పందం అమలులోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.67 చొప్పున మొత్తం స్థలానికి మైక్రోసాఫ్ట్ నెలకు రూ.1.77 కోట్ల కనీస అద్దె, నిర్వహణ వ్యయాలు, ఇతర చార్జీలు కలిపి మొత్తం రూ.5.4 కోట్లు చెల్లించనుంది. ఏటా అద్దె 4.8 శాతం పెరగనుంది. అంతేకాదు, సెక్యూరిటీ డిపాజిట్ కింద మైక్రోసాఫ్ట్ రూ.42.15 కోట్లు జమ చేసినట్లు ప్రాప్‌స్టాక్ తెలిపింది. వాస్తవానికి టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ ఈ స్థలాన్ని బిల్డింగ్ యజమాన్య సంస్థ ఫీనిక్స్ టెక్ జోన్ నుంచి లీజుకు తీసుకుంది.

1998 నుంచి నగరంలో సంస్థ కార్యకలాపాలు: మైక్రోసాఫ్ట్ ఇండియాలో తన తొలి ఆర్ అండ్ డీ సెంటర్‌ను హైదరాబాద్‌లో 1998లో ఏర్పాటు చేసింది. అమెరికా వెలుపల కంపెనీ నిర్వహిస్తోన్న అతి పెద్ద ఆర్ అండ్ డీ సెంటర్ ఇదే. గచ్చిబౌలిలోని కంపెనీ క్యాంపస్ ప్రస్తుతం ఇంజనీరింగ్, కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ సేవలపై దృష్టి సారిస్తోంది. ఫీనిక్స్ సెంటారస్‌లోని క్యాంపస్ మరిన్ని ఆర్ అండ్ డీ బృందాలు, టెక్నాలజీ విభాగాలకు నెలవు కానుంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణె, నోయిడాల్లోనూ మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు సాగిస్తోంది.

ఆఫీస్ స్పేస్‌కు హైదరాబాద్ అడ్డా: భారత్‌లో ప్రీమియం, ఏ గ్రేడ్ ఆఫీస్ స్పేస్ అడ్డాల్లో హైదరాబాద్ ఒకటి. పలు అంతర్జాతీయ టెక్నాలజీ, ఆర్థిక సేవల కంపెనీల కార్యాలయాలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు నెలవుగా మారింది నగరం. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ సేవల కంపెనీ నైట్‌ఫ్రాంక్ డేటా ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో కోటి చదరపు అడుగుల కార్యాలయ స్థలం లీజు ఒప్పందాలు కుదిరాయి. అందులో టెక్నాలజీ దిగ్గజ కంపెనీలదే అధిక వాటా అని నైట్‌ఫ్రాంక్ పేర్కొంది.

భారత్ రేటింగ్ యథాతథం

ట్రంప్ సుంకాల ప్రభావం అంతంతే ● ఫిచ్ రేటింగ్

న్యూఢిల్లీ: భారత సార్వభౌమ పరపతి రేటింగ్‌ను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఫిచ్ రేటింగ్ సోమవారం ప్రకటించింది. బలమైన వృద్ధితో పాటు విదేశీ నిధులు భారీగా తరలి వస్తుండటం రేటింగ్‌ను యథాతథంగా కొనసాగించేందుకు దోహదపడ్డాయని తెలిపింది. ఈ అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఇండియాకు గతంలో స్థిరమైన వైఖరితో కూడిన 'బీబీబీ మైనస్' రేటింగ్‌ను కేటాయించింది. పెట్టుబడులకు అనుకూలమైన కనిష్ఠ రేటింగ్ ఇది. కాగా, మరో అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ ఈ మధ్యనే భారత పరపతి రేటింగ్‌ను బీబీబీ స్థాయికి పెంచింది. కాగా దేశ ఆర్థిక వృద్ధిపై ట్రంప్ ప్రతిపాదిత 50 శాతం సుంకాల ప్రభావం అంతంత మాత్రమేనని ఫిచ్ అభిప్రాయపడింది.

ఫ్లిప్‌కార్ట్‌లో 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలు

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సరఫరా, లాజిస్టిక్స్, డెలివరీ విభాగాల్లో 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలను సృష్టించింది. ఇది కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కేవలం పండగల కోసం ఏర్పాటు చేసిన డెలివరీ కేంద్రాల్లో మరో 650 ఉద్యోగాశాలు అందుబాటులోకి రానున్నట్టు కంపెనీ తెలిపింది. కంపెనీలో మహిళా నియామకాలు 10 శాతం పెరగనున్నట్టు వెల్లడించింది. అలాగే దివ్యాంగులకు కూడా ఈ పండగ సీజన్‌లో మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది.

ఫర్నీచర్‌పైనా ట్రంప్ సుంకాలు!

అక్టోబరులో ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ: అమెరికాలోకి దిగుమతయ్యే ఫర్నీచర్‌పైనా సుంకాలు విధిస్తానని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత వారాంతంలో సంకేతాలిచ్చారు. ప్రస్తుతం తమ దేశంలోకి ఫర్నీచర్ దిగుమతులపై దర్యాప్తును ప్రారంభించడం జరిగిందని, 50 రోజుల్లో పూర్తవనున్న దర్యాప్తు అనంతరం ఎంత మేర సుంకాలు విధించాలనేది నిర్ణయిస్తామన్నారు. ఇది భారత ఫర్నీచర్ ఎగుమతులపైనా గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే, ప్రపంచంలో అమెరికానే అతిపెద్ద ఫర్నీచర్ దిగుమతిదారు. ప్రపంచ దిగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే. గత ఏడాది యూఎస్ 2,896 కోట్ల డాలర్ల విలువైన ఫర్నీచర్‌ను దిగుమతి చేసుకుంది. అందులో 60 శాతం చైనా, వియత్నాం నుంచే తరలిపోయింది. కాగా, అమెరికాకు భారత్ ఎనిమిదో అతిపెద్ద ఫర్నీచర్ ఎగుమతిదారు. జీటీఆర్ఐ డేటా ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మన దేశం నుంచి 110 కోట్ల డాలర్ల విలువైన ఫర్నీచర్, బెడ్లు, పరుపులు అమెరికాకు ఎగుమతయ్యాయి. మన ఫర్నీచర్ సంబంధిత మొత్తం ఎగుమతుల్లో అమెరికాదే 45 శాతం వాటా.

- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. అంతర్జాతీయ ఇన్వెస్టర్ల కోసం ఈ సెంటర్ ప్రత్యేకంగా సేవలందించనుంది. ఐఎఫ్ఎస్‌సీఏ నుంచి ఈ కార్యాలయం రిజిస్టర్డ్ ఫండ్ మేనేజ్‌మెంట్ ఎంటిటీ రిజిస్ట్రేషన్‌ను అందుకుందని తెలిపింది. ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నవీన్ అగర్వాల్ ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ మార్కెట్లలోని అవకాశాలు దక్కించుకోవాలని చూస్తున్న దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు అవసరమైన సేవలను ఈ సెంటర్ అందించనుందన్నారు.

దేశం ముందు కీలక సవాళ్లు

- బ్యాంకులు, కంపెనీలు చేతులు కలపాలి
- పెట్టుబడులు పెంచాలి



ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

విలీనాలు, కొనుగోళ్ల ఫండింగ్‌ను అనుమతించాలి

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

ముంబై: అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ కీలక సవాళ్లు ఎదుర్కోనుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. పెట్టుబడులు పెంచడం ద్వారా వీటిని ఎదుర్కోవచ్చని అన్నారు. ఇందుకోసం బ్యాంకులు, కంపెనీలు చేతులు కలపాలని కోరారు. అమెరికా సుంకాలతో దెబ్బతినే రంగాలను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ముంబైలో ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ద్రవ్య విధానం ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తూనే వృద్ధికి దోహదం చేసేలా ఉంటుందన్నారు.

చర్యలు తీసుకుంటాం: గత ఆర్థిక సంవత్సరం (2024-25) బ్యాంకుల పరపతి వృద్ధి రేటు మూడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంపైనా మల్హోత్రా మాట్లాడారు. దీన్ని సరిదిద్దేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా కంపెనీలు తమ నిధుల కోసం ప్రైవేటు రుణాలు, క్యాపిటల్ మార్కెట్లపై మొగ్గు చూపడం ఇందుకు ప్రధాన కారణమని ఇదే సదస్సులో పాల్గొన్న ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు కంపెనీల దీర్ఘకాలిక రుణ అవసరాలపై దృష్టి పెట్టడం మంచిదన్నారు. నీరసించిన పరపతి వృద్ధి రేటు పెంచుకునేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా లిస్టెడ్ కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు అవసరమైన నిధులు సమకూర్చేందుకూ ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి ఫండింగ్‌పై ఉన్న నిషేధాన్ని తొలగించాలని త్వరలో ఆర్‌బీఐని కోరబోతున్నాయి. ఫిక్కీ, ఐబీఏ నిర్వహించిన సదస్సులో ఎస్‌బీఐ, ఐబీఏ (ఐబీఏ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈ విషయం వెల్లడించారు. పూర్తి పారదర్శక పద్ధతిలో కొనుగోళ్లు, విలీనాలకు రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారులు అనుమతించినప్పుడు, అలాంటి కొనుగోళ్లు, విలీనాలకు నిధులు సమకూర్చడంలో పెద్ద రిస్క్ ఉండదన్నారు. ప్రస్తుతం కంపెనీలు తమ నిధుల అవసరాల్లో ఎక్కువ భాగాన్ని ఈక్విటీ, రుణ పత్రాలు, అంతర్గత వనరుల ద్వారానే సమకూర్చుకుంటున్న విషయాన్ని శెట్టి గుర్తు చేశారు.

మార్కెట్‌కు కొనుగోళ్ల మద్దతు

సెన్సెక్స్ 329 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో సోమవారం ఐటీ, ఆటోమొబైల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీతో పాటు అమెరికన్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న ఆశలతో ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడింది. సర్వత్రా సానుకూల సంకేతాల నడుమ సెన్సెక్స్ 329.06 పాయింట్ల లాభంతో 81,635.91 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 491.21 పాయింట్ల లాభంతో 81,799.06 వరకు వెళ్లింది. మరోవైపు నిఫ్టీ 97.65 పాయింట్ల లాభంతో 24,967.75 వద్ద ముగిసింది.

అంకాలజీ విభాగంలోకి జీఎస్‌కే

న్యూఢిల్లీ: గైనకాలజీ క్యాన్సర్లకు ప్రెసిషన్ థెరపీ అందుబాటులోకి తేవడం ద్వారా అంకాలజీ విభాగంలోకి ప్రవేశించినట్టు గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాస్యూటికల్స్ (జీఎస్‌కే) ప్రకటించింది. దేశీయ మార్కెట్లోకి కంపెనీ జెంపెర్లి (దోస్టార్‌లిమాబ్), జెజులా (నిరాపరిబ్) ఔషధాలను విడుదల చేసింది. ఇవి మహిళల క్యాన్సర్ చికిత్సలో అర్థవంతమైన పురోగతిని తెస్తాయని జీఎస్‌కే ఇండియా ఎండీ భూషణ్ అక్షికర్ అన్నారు.

ఫార్మాపై ఒకే జీఎస్‌టీ ఉండాలి: ఫార్మెక్సిల్

న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ సవరణలో ఔషధాలు, వాటి ముడి పదార్థాలపై ఒకే పన్ను రేటు ఉండాలని ఫార్మా పరిశ్రమ కోరుతోంది. ప్రస్తుతం తుది ఔషధాల (ఫార్ములేషన్లు)పై 12 శాతం, వాటి తయారీకి ఉపయోగించే ప్రధాన ముడి పదార్థం ఏపీఐలపై 18 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. ప్రతిపాదిత సవరణలో ఈ వ్యత్యాసాన్ని సవరించి రెంటిపైనా ఒకే జీఎస్‌టీ రేటు విధించాలని భారత ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెక్సిల్) వైస్ చైర్మన్ భవిన్ మెహతా కోరారు. ఔషధాలపై ప్రస్తుతం ఉన్న జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి, ఏపీఐలపై అదే స్థాయిలో 18 శాతం సుంకాలు విధించినా పరిశ్రమకు మంచిది కాదన్నారు.

డిసెంబరు కల్లా కొత్త ఐటీ నిబంధనలు

న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను చట్టం (ఐటీ) నిబంధనలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఈ ఏడాది డిసెంబరు చివరికల్లా నోటిఫై చేయబోతోంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సభ్యుడు ఆర్ఎన్ పర్బత్ ఈ విషయం వెల్లడించారు. నిబంధనలతో పాటు సరళీకరించిన ఐటీ ఫారాలను కూడా విడుదల చేస్తామన్నారు. పార్లమెంట్ ఆమోదించిన కొత్త ఐటీ చట్టానికి రాష్ట్రపతి ముర్ము ఈ నెల 21న ఆమోద ముద్ర వేశారు. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమల్లోకి రానుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	540
వరంగల్	497	గోదావరి	535
చిత్తూరు	558	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	112
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	88
కర్నూలు	98	నెల్లూరు	93
విశాఖపట్నం	116	అనంతపురం	93
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,510 ▼	93,050 ▼	1,31,000 ▲
విజయవాడ	1,03,200 ▲	96,500 ▲	1,19,900 ▲
విశాఖపట్నం	1,03,450 ▲	93,050 ▲	1,21,000 ▼
రాజమండ్రి	1,01,520 ▼	93,050 ▼	1,18,500 ▲
ప్రొద్దుటూరు	1,02,050 ▲	93,890 ▲	1,18,500 ▲
ముంబై	1,00,488 ▲	92,047 ▲	1,16,133 ▲

ఉపాధి నిధులతో మ్యాజిక్ డ్రైన్లు



- గ్రామాల్లో తక్కువ ఖర్చుతో మురుగుకాల్వల నిర్మాణం
- ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- అక్టోబరు 2 నాటికి వంద గ్రామాల్లో పూర్తి
- ఒక్కో జిల్లాలో నాలుగు గ్రామాలకు నిర్మాణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో తక్కువ వ్యయంతో మురుగు కాల్వల నిర్మాణానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది. సిమెంట్‌రోడ్లు, డ్రైన్లు భారీ ఎత్తున నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో 4 వేల కి.మీ. సిమెంట్‌రోడ్లు నిర్మించారు. ఆ రోడ్ల పక్కన కాల్వలు నిర్మించలేదు. కొన్ని గ్రామాల్లో కాల్వలు నిర్మించినప్పటికీ నిర్వహణ లోపం సమస్యగా మారింది. చెత్త, చెదారం పడి కాల్వలు పూడిపోవడంతో వీధులు దుర్గంధంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామ పంచాయతీలు డ్రైన్లు నిర్మించాలా? వద్దా? అనే మీమాంసలో కూడా పడ్డాయి. కొన్ని గ్రామాల్లో వరద నీటి తాకిడి ఉండటం వల్ల డ్రైన్లు కావాలని కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ డ్రైన్లనూ నిర్వహించలేక పగులగొట్టేశారు. దీంతో గ్రామాల్లో అంత వ్యయం చేసి డ్రైన్లు నిర్మించినా...అవి ఉపయోగించకపోతే నిధులు వృథా అవుతాయని భావించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తక్కువ వ్యయంతో ఉపయోగపడే డ్రైన్లు నిర్మించాలని యోచించారు. ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ కృష్ణా జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో ఈ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో కూడా మేజిక్ డ్రైన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం పరిశీలించారు.

ప్రత్యేక టెక్నాలజీతో నిర్మాణం..

మేజిక్ డ్రైన్లను ప్రత్యేక టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. రూ.4 లక్షల వ్యయం అయ్యే సిమెంట్ డ్రైన్‌కు బదులుగా రూ.90 వేలతో మేజిక్ డ్రైన్‌ను నిర్మించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు తీసుకుంది. పైగా ఈ డ్రైన్లతో ఎక్కడికక్కడ భూగర్భజల వనరులు పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. తక్కువ మురుగునీరు, తక్కువ నీటి తాకిడి ఉన్న గ్రామాల్లో వీటి నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నారు. రోడ్లు వెడల్పు తక్కువగా ఉన్న గ్రామాల్లో వీటి నిర్మాణం చేపడతారు. సైడ్ కాల్వలను మూడు లేయర్లుగా తవ్వి ఒక్కో లేయర్‌ను ఒక్కో సైజ్ మెటల్‌తో భర్తీ చేస్తారు. ప్రతి 50 మీటర్లకు ఒక సోక్ పిట్‌ను సైడ్ డ్రైన్లలో నిర్మిస్తారు. ఇళ్ల నుంచి వచ్చిన మురుగునీరు ఎక్కడికక్కడ ఇంకిపోయేలా చర్యలు తీసుకున్నారు.

వంద గ్రామాల్లో నిర్మించాలని లక్ష్యం..

అక్టోబరు 2 లోపు వంద గ్రామాల్లో మేజిక్ డ్రైన్లు నిర్మించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ లక్ష్యాలను నిర్దేశించింది. ఒక్కో జిల్లాలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసి మేజిక్ డ్రైన్లు నిర్మించనున్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు విజయవంతమవడంతో అంచలంచెలుగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా మొదట వంద గ్రామాల్లో నిర్మించాలని భావిస్తున్నారు. తక్కువ వ్యయంతో నిర్మాణం పూర్తి కావడంతో పాటు గ్రామాల్లో డ్రైన్లు నిరుపయోగం కాకుండా ఉంటాయని చెప్తున్నారు. అంతే గాక గ్రామాల్లో తక్కువ వెడల్పు రోడ్లు ఉన్న చోట సైడ్ డ్రైన్ల నిర్మాణం కష్టతరం అవుతోందని, అదే మేజిక్ డ్రైన్లు నిర్మించడం సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో నకిలీలు!

- ఇంతవరకు 890 నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపు
- నిశితంగా పరిశీలిస్తున్న శాప్ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో కొలువు కొట్టేసేందుకు పలువురు అభ్యర్థులు అందజేసిన ధ్రువీకరణ పత్రాల్లో నకిలీవి పుట్టుకొస్తున్నాయి. ఇప్పటి వరకు చేసిన తనిఖీల్లో ఇలాంటి 890 నకిలీ ధ్రువపత్రాలను అధికారులు గుర్తించినట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు క్రీడా కోటాలో మూడు శాతం రిజర్వేషన్ కల్పించింది. గతంలో రెండు శాతం ఉన్న రిజర్వేషన్లను మూడు శాతానికి పెంచింది. ఈమేరకు క్రీడా కోటా కింద 421 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను ప్రకటించింది. మెగా డీఎస్సీకి అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను విద్యాశాఖ ఇటీవల విడుదల చేయగా.. క్రీడా కోటా కింద అర్హుల జాబితాను మాత్రం ప్రకటించ లేదు. దీనికి ప్రధాన కారణం నకిలీ క్రీడా సర్టిఫికెట్లేనని తెలుస్తోంది. స్పోర్ట్స్ కోటా కింద డీఎస్సీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను శాప్ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలనలో ఇప్పటివరకు 890 నకిలీ సర్టిఫికెట్లను గుర్తించినట్టు తెలిసింది. పరిశీలన చేసే కొద్దీ నకిలీ సర్టిఫికెట్లు బయటపడుతున్నాయి. ప్రతి క్రీడాంశానికి జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి ఫెడరేషన్ ఒక క్యాలెండర్‌ను విడుదల చేస్తుంది. దీనికి ముందు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఆ తేదీలతో సంబంధం లేకుండా సర్టిఫికెట్లను సమర్పించినట్టు తెలిసింది. అంతేగాకుండా రాష్ట్ర, జాతీయ అసోసియేషన్ల గుర్తింపు లేకుండా ఎవరికివారు క్రీడా అసోసియేషన్లు ఏర్పాటు చేసుకుని, రిజిస్టర్ చేయించేసి, సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారని, అందువల్లే నకిలీలు వస్తున్నాయని అంటున్నారు. గుర్తింపు లేని కొన్ని క్రీడా సంఘాలు ముడుపులు తీసుకుని అనర్హులకు సర్టిఫికెట్లు జారీ చేసినట్టు పరిశీలనలో తేలింది. ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం శాప్ ఛైర్మన్ రవినాయుడు దృష్టికి రావడంతో క్రీడా కోటాలో డీఎస్సీ అభ్యర్థులు సమర్పించిన సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు.

అంతర్‌జిల్లాల బదిలీల్లో మార్పు

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల్లో కనీస సర్వీసు నిబంధనను సవరిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు సోమవారం ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుత కేడర్‌లో కనీసం రెండేళ్లు పనిచేసి ఉండాలనే నిబంధనను తొలగించారు. అలాగే, 2027, జూలై 31లోపు రిటైర్ అయ్యేవారు పరస్పర బదిలీకి అర్హులు కారని పేర్కొన్నారు. నిబంధనలు సవరించిన నేపథ్యంలో షెడ్యూల్‌లోనూ మార్పులు చేశారు. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. కాగా, సర్వీసు మినహాయింపుపై ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్. చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో నో డిగ్రీ!

బీబీఏ, బీసీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి పొందిన పలు కాలేజీలు

- ఆ జాబితాను ఉన్నత విద్యామండలికి పంపని సాంకేతిక విద్యాశాఖ
- ఫలితంగా ఈసారి నిలిచిన అడ్మిషన్లు
- డిగ్రీ అడ్మిషన్లపై సమన్వయ లోపం
- కాలేజీల ద్వారా రిజిస్ట్రేషన్లకు ఒక్కరోజే గడువు

అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ నిర్వాకం కారణంగా ఈ ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో బీబీఏ, బీసీఏ కోర్సుల అడ్మిషన్లకు అనుమతి లభించలేదు. గత రెండేళ్లుగా ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ డిగ్రీ కోర్సులకు అనుమతులు వచ్చాయి. ఏఐసీటీఈ నుంచి అనుమతులు పొందిన ఇంజనీరింగ్ కాలేజీలు బీబీఏ, బీసీఏ కోర్సులను ప్రవేశపెట్టాయి. ఆ రెండు కోర్సులకు ఏఐసీటీఈ నుంచి అనుమతులు వచ్చాక సాంకేతిక విద్యాశాఖ ఆ కాలేజీలు, కోర్సుల జాబితాను ఉన్నత విద్యామండలికి ఇవ్వాలి. కానీ ఆ వివరాలను మండలికి ఇవ్వలేదు. దీంతో ఆ కాలేజీల్లో బీబీఏ, బీసీఏ కోర్సులను ఆప్షన్లలో పెట్టకపోవడంతో అడ్మిషన్లు నిలిచిపోయాయి. సాంకేతిక విద్యాశాఖ స్పందించని కారణంగా ఇప్పుడు ఆ ఇంజనీరింగ్ కాలేజీలు అడ్మిషన్ల జాబితాలో లేకుం డా పోయాయి. దీంతో ఆ రెండు కోర్సులు కోరుకునే విద్యార్థులకు నిరాశ ఎదురవుతోంది. బీబీఏ, బీసీఏ కోర్సులకు ఇప్పుడు డిమాండ్ భారీగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ సీటు రానివారు బీసీఏ కోర్సుకు మొగ్గు చూపుతుండగా.. బీబీఏ కోర్సులకూ డిమాండ్ పెరిగింది.

ఉన్నత విద్యాశాఖ, విద్యామండలి మధ్య సమన్వయ లోపం



మరోవైపు డిగ్రీ అడ్మిషన్ల వ్యవహారంలో ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఒకే శాఖలోని రెండు విభాగాలు ఎవరి దారి వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తుండడంతో అడ్మిషన్లపై ప్రతికూల ప్రభావం పడుతోంది. డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత రెండు రోజులకు కాలేజీ లాగిన్ ద్వారా కూడా అడ్మిషన్లు చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. ఈ నెల 20న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. సోమవారం నుంచి మాత్రమే కాలేజీల ద్వారా అడ్మిషన్ అవకాశం కల్పించారు. కానీ సోమవారం సాయంత్రం వరకు కూడా తమకు లాగిన్ అయ్యే అవకాశం రాలేదని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి. మంగళవారంతో రిజిస్ట్రేషన్ల గడువు ముగిసిపోతోంది. ఒకవేళ విద్యార్థి ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉంటే కాలేజీల వద్దకు వెళ్లి ఈ నెల 28 వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. కానీ, ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకున్న విద్యార్థి అక్కడే ఆప్షన్లు ఎంపిక చేసుకుంటారు తప్ప కాలేజీలకు వెళ్లే అవకాశం పెద్దగా ఉండదు. దీంతో కాలేజీల లాగిన్ ద్వారా అడ్మిషన్ విధానం ఉన్నా విద్యార్థులు దానిని ఉపయోగించుకునే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు కాలేజీలకు వెళ్లి పెట్టుకున్న ఆప్షన్లను తర్వాత మార్చుకునే అవకాశమూ లేకుండా చేశారు. దీంతో కాలేజీలకు వెళ్లి దరఖాస్తు సమర్పించడం ఎందుకనే సందేహాలు వస్తున్నాయి. కాలేజీలకు వెళ్లి దరఖాస్తు చేసుకునే విధానంపై సందేహాలు ఉన్నాయంటూ ఉన్నత విద్యామండలి ఇటీవల ఉన్నత విద్యాశాఖకు లేఖ రాసింది. ఉన్నత విద్యాశాఖ వారం రోజులైనా స్పందించలేదు. రోజులు గడుస్తున్నా సమాధానం రాకపోవడంతో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీచేస్తామంటూ మండలి అధికారులు మరో లేఖ రాశారు. అప్పుడు హడావిడిగా ఉన్నత విద్యాశాఖ క్లారిఫికేషన్ జారీచేసింది. అది కూడా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కాకుండా, మధ్య స్థాయి అధికారే ఈ స్పష్టత ఇచ్చారు. అప్పుడు ఉన్నత విద్యామండలి హడావిడిగా ఆఫ్‌లైన్ అడ్మిషన్లపై మార్గదర్శకాలు జారీచేసింది.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు

- 28న సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం
- ఈలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటన
- రెండు జిల్లాల్లో సాంకేతిక సమస్యలతో ఆలస్యం

అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో మెరిట్ అభ్యర్థులకు మంగళవారం కాల్ లెటర్లు విడుదల చేస్తామని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం నుంచి ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా వ్యక్తిగతంగా కూడా సమాచారం పంపనున్నారు. ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి అన్ని జిల్లాల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమవుతుందని కృష్ణారెడ్డి తెలిపారు. ఈలోగా అభ్యర్థులు ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), అంగ వైకల్య ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), కాల్‌లెటర్‌లో పేర్కొన్న ఇతర సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పరిశీలనకు హాజరు కావాలన్నారు. కేటాయించిన తేదీ, సమయంలో తప్పనిసరిగా సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలన్నారు. హాజరు కాని, అర్హత లేని వారి అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తారని, మెరిట్ జాబితాలోని తర్వాత అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారని వివరించారు. కాగా, సోమవారం కాల్ లెటర్లు అందుతాయని అభ్యర్థులు ఎదురుచూశారు. ప్రక్రియ దాదాపుగా కొలిక్కి వచ్చినా రెండు జిల్లాల జాబితాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విడుదల ఆగిపోయింది.

చెప్పుడు మాటలు విని నష్టపోవద్దు

- డీఎస్సీ అభ్యర్థులకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సూచన

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందుతున్నవారు చెప్పుడు మాటలు విని నష్టపోవద్దని, న్యాయపరమైన చిక్కుల్లో ఇరుక్కోవద్దని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ ఉత్తీర్ణులకు నష్టం కలిగేలా జగన్, ఆయన అనుచరగణం ప్రయత్నిస్తోందని, అభ్యర్థులను తప్పుదారి పట్టిస్తోందని చెప్పారు. దరఖాస్తు చేసేటప్పుడే ఆలోచించి ఆప్షన్లు పెట్టుకోవాలని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. నియామకపత్రాలు అందుకునే సమయంలో వైసీపీ ఇలాంటి వాటికి తెరలేపడం సరికాదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం జగన్, ఆయన మీడియాకు కంటగింపుగా మారిందన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

భారీ యాక్షన్ షెడ్యూల్



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్'. ఈ సినిమాను ప్రపంచస్థాయి యాక్షన్ సినిమాలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు మేకర్స్. తాజాగా ముంబైలో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు మేకర్స్. 45 రోజుల పాటు ఇది సాగనుంది. యాక్షన్ ప్రియులను ఎంతగానో అలరించిన 'జాన్ విక్', 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' చిత్రాలకు యాక్షన్ కొరియోగ్రఫీ అందించిన జేజే పెర్రీ ఈ పోరాట ఘట్టాల్ని కంపోజ్ చేయనున్నారు. ఈ యాక్షన్ షెడ్యూల్ కోసం ఆయన ఇండియన్ స్టంట్ టీమ్‌ను తీసుకోవడం విశేషం. భారతీయ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని యాక్షన్ సీక్వెన్స్‌లు ఇందులో ఉండబోతున్నాయని జేజే పెర్రీ తెలిపారు. ఇండియన్ స్టంట్ టీమ్ పనితనం వరల్డ్ క్లాస్‌గా ఉందని చెప్పారు. కె.వెంకట్‌నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న చిత్రం విడుదలవుతోంది. టొవినో థామస్, నయనతార, కియారా అడ్వానీ, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

శ్రీదేవి ఆస్తుల కోసం..



దివంగత నటి శ్రీదేవి ఆస్తులు పొందేందుకు కొందరు యత్నిస్తున్నారని ఆమె భర్త బోనీ కపూర్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శ్రీదేవి 1988వ సంవత్సరంలో చెన్నై ఈస్ట్ కోస్టు రోడ్డు (ఈసీఆర్) సమీపంలో స్థలం కొనుగోలు చేసారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు నకిలీ వారసత్వ సర్టిఫికెట్లతో ఆ స్థలం పొందేందుకు యత్నిస్తున్నారని, వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్... ఈ వ్యవహారంపై నాలుగు వారాల్లో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని తాంబరం తహసీల్దార్ కు ఉత్తర్వులు జారీ చేశారు.. చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి చిత్రాలను ప్రోత్సహిస్తా



"కన్యాకుమారి' అందమైన స్ర్కీన్‌ప్లే ఉన్న మంచి వినోదాత్మక చిత్రం. ఇంత మంచి సినిమాకి సపోర్ట్ చేయాలనిపించింది. ఇదొక్కటే కాదు ఇలాంటి మంచి చిత్రాలు ఎన్ని వచ్చినా వాటికి నా ప్రోత్సాహం కచ్చితంగా ఉంటుంది. ఇలాంటి చిన్న చిత్రాలు ఎక్కువగా వస్తేనే ఇండస్ట్రీ బాగుంటుంది' అని అన్నారు ప్రముఖ నిర్మాత బన్నీవాస్. నటి మధుశాలిని సమర్పణలో సృజన్ అట్టాడ దర్శకత్వం వహించి, నిర్మించిన చిత్రం 'కన్యాకుమారి'. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఇందులో బన్నీవాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను. చాలా నిజాయితీగా తీశారు. మంచి స్ర్కీన్‌ప్లేతో అద్భుతంగా ప్రజెంట్ చేశారు' అని అన్నారు.

'పరదా'తో గర్వపడుతున్నా



అనుపమ పరమేశ్వరన్


'తెలుగు సినీ చరిత్రలోనే 'పరదా' సాహసోపేతమైన అడుగు. ఇటువంటి కథని నమ్మి ముందుకు వచ్చిన నిర్మాత విజయ్‌కి మనసారా కృతజ్ఞతలు. ఈ సినిమాలో నటించినందుకు నేను గర్వపడుతున్నా. నా కెరీర్‌లోనే అత్యుత్తమ నటన అంటూ రివ్యూస్ రావడం ఆనందంగా ఉంది. జాతీయ మీడియా మా సినిమా గురించి అద్భుతం అంటూ ప్రశంసించింది. ఇలాంటి ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి' అని అన్నారు హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రధారుగా ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన సినిమా 'పరదా' ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా హైరాబాద్‌లో ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో అనుపమ మాట్లాడుతూ 'ఈ సినిమా విషయంలో నేనెప్పటికీ గర్వపడుతూనే ఉంటాను. కొన్ని సంవత్సరాల పాటు గుర్తుండిపోతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ 'సినిమాని సపోర్ట్ చేసిన రివ్యూ రైటర్స్‌కి కృతజ్ఞతలు. కొన్ని తప్పుల గురించి కూడా రాశారు. వాటిని నేను అంగీకరిస్తున్నా. అయితే ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. సినిమా చూసిన చాలా మంది దాన్ని మెచ్చుకున్నారు' అని అన్నారు. చిత్ర నిర్మాత విజయ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చాలా మంది అమ్మాయిలకు వారి జీవితాల్ని గుర్తు చేసిందని ఒక పెద్దావిడ చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు. కార్యక్రమంలో నటుడు రాగ్ మయూర్, ఎడిటర్ ధర్మేంద్ర తదితరులు మాట్లాడారు.

ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు

నారా రోహిత్



'ఈ జనరేషన్‌కి ఇది చాలా కొత్త కథ. క్యారెక్టర్‌లో కొత్తదనం ఉంటుంది. అందరికీ కనెక్ట్ అవుతుంది. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు' అని అన్నారు హీరో నారా రోహిత్. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'సుందరకాండ'. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్లు. సినిమా ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నారా రోహిత్ విలేకరులతో మాట్లాడుతూ 'డైరెక్టర్ వెంకటేశ్ ఈ కథ చెప్పినప్పుడు కంగారుపడ్డాను. ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో అని అనిపించింది. అయితే అదే సమయంలో వచ్చిన 'బ్రో డాడీ' సినిమా 'సుందరకాండ'కు మార్గం చూపింది. ఆ స్టయిల్‌లో చేస్తే వర్కవుట్ అవుతుందనిపించి స్టార్ట్ చేశాం. ఇందులో నాది కాంప్లికేటెడ్ క్యారెక్టర్. ఆ కాంప్లికేషన్ నుంచే ఫన్ క్రియేట్ అవుతుంది. దర్శకుడు తాను అనుకున్న కథను చక్కగా తెరకెక్కించాడు. ఈ చిత్రంలో నరేశ్ క్యారెక్టర్ కూడా చాలా బావుంటుంది. ఆయన చాలా అనుభవం ఉన్న నటుడు. ఏ పాత్రనైనా చాలా అద్భుతంగా చేయగలరు' అని అన్నారు.



ఇది పక్కా కమర్షియల్

- రాజీవ్‌రెడ్డి



అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన సినిమా 'ఘాటి'. సెప్టెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత రాజీవ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'ఒక సూపర్‌స్టార్ నటితో కమర్షియల్ యాక్షన్ మూవీ చేయాలనేది మెయిన్ ఐడియా. 'కర్తవ్యం'తర్వాత మళ్లీ ఆ స్థాయిలో సినిమా రాలేదు. ఇప్పుడున్న స్టార్స్‌లో అనుష్కకు అలాంటి సామర్థ్యాలున్నాయి. అలా 'ఘాటి' ప్రయాణం మొదలైంది. ఇది పూర్తిగా కమర్షియల్ యాక్షన్ సినిమా. ఇందులో క్రిష్ మార్క్ డ్రామా కూడా ఉంటుంది. అనుష్క అద్భుతంగా నటించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో ఎక్కువగా షూటింగ్ జరిపాం. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా అద్భుతంగా వచ్చింది. వరుణ్ తేజ్‌తో చేస్తున్న సినిమా దాదాపు 80 శాతం పూర్తయింది. 'అరేబియన్ కడలి సీజన్-2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది' అని వివరించారు.

కేజీఎఫ్ నటుడు దినేష్ కన్నుమూత



శాండల్‌వుడ్ విలక్షణ నటుడు దినేష్ మంగళూరు(55) సోమవారం కన్నుమూశారు. నటుడిగా, ఆర్ట్ డైరెక్టర్‌గా దినేష్ పేరు సంపాదించారు. కేజీఎఫ్ సినిమాలో ముంబై శెట్టి పాత్రను పోషించారు. హృదయ సంబంధిత జబ్బుతో బాధపడుతున్న ఆయన, ఉడుపి జిల్లా కుందాపుర కోటేశ్వర సర్జన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలం కిందట ఆయనకు గుండెపోటు రాగా, బెంగళూరులో చికిత్స చేయించుకున్నారు. సోమవారం మరోసారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు సర్జన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

చాలా సంతృప్తినిచ్చింది

- విజయ్‌పాల్ రెడ్డి అడిదల



'ఈ కథను మైథలాజికల్ జానర్‌ను జోడించి చెప్పడమే కొత్తగా ఉంటుంది. వరంగల్, విజయవాడలో ప్రీమియర్లు వేశాం. మూవీ అద్భుతంగా ఉందని అందరూ పొగిడారు. మాకు చాలా సంతృప్తినిచ్చింది' అని అన్నారు నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి అడిదల. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యరాజ్, ఉదయభాను, వశిష్ట ఎన్ సింహా తదితరులు నటించారు. సినిమా ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విజయ్‌పాల్ రెడ్డి చిత్ర విశేషాల్ని విలేకరులతో పంచుకున్నారు. 'మొదట చిన్న బడ్జెట్‌తో సినిమా తీయాలనుకున్నాం. సినిమా తీస్తే బాగా తీయండి లేదంటే లేదు అని డైరెక్టర్ మారుతి ఖరాఖండిగా చెప్పారు. దాంతో భారీ స్థాయిలోనే సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. ఇది కొత్తరకం కథ. చాలా ఉత్కంఠభరితంగా ఉంటుంది. మలయాళంలోలా చాలా సహజంగా తీశాం. తెలుగు ప్రేక్షకులకు కావాల్సిన కమర్షియల్ అంశాలన్నీ జోడించాం. ఇన్ ఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన పాటలు అద్భుతంగా ఉన్నాయి. ఆర్ఆర్ అదిరిపోయింది. మా ప్రొడక్షన్స్‌లో వరుసగా చిత్రాలు తీయాలనే ఉద్దేశంతో ఇండస్ట్రీకి వచ్చాను. 'త్రిబాణధారి బార్బరిక్'తో పాటు 'బ్యూటీ' మూవీని ప్రారంభించాం' అని అన్నారు.



సోమవారం సచివాలయంలో చంద్రబాబుతో ఐఐటీ, నిట్, నీట్‌లలో సీట్లు సాధించిన 'గురుకుల' విద్యార్థులు

మీ విజయం ఎందరికో స్ఫూర్తినివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన చంద్రబాబు... ఉన్నత చదువుల్లోనూ మరింత ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మెమొంటోలతోపాటు ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష చొప్పున చెక్ అందించారు. సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే ఈ సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలని అన్నారు. మన విద్యార్థుల్లో ప్రతిభకు కొదవ లేదని, వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీపడే సత్తా వారిలో ఉందని చెప్పారు. అందుకు ఈ 55 మంది విద్యార్థులే నిదర్శనమన్నారు. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాది నాలుగు రెట్లు పెరగాలన్నారు. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న విద్యాసంస్థలకు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని సూచించారు.

356 మందికి శిక్షణ...55 మంది ఎంపిక...

కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-నీట్ సెంటర్లలో ఈ 55 మంది కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది అర్హత సాధించారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. బీడీఎస్‌లో మరో 14 మందికి, జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది.

ఉపాధి మార్గంలో మహిళలు
రయ్.. రయ్

- మెప్మా సహకారం, ర్యాపిడో చొరవ
- సబ్సిడీపై పట్టణ మహిళలకు టూ, త్రీ వీలర్లు
- 9 నగరాల్లో వెయ్యికిపైగా లబ్ధిదారులు వాహనాలతో రైడ్లు వేస్తూ ఆదాయార్జన
- మూడు నెలల్లో రూ. 35 లక్షల ఆదాయం
- మహిళా సాధికారతకు కృషి: లోకేశ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సమస్యలతో ఇల్లు గడవడం లేదు.. నేనూ కుటుంబానికి ఆసరాగా ఉంటే బావుండును అని ఆలోచిస్తున్న పట్టణ ప్రాంత మహిళలకు మెప్మా(మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్) చేదోడుగా నిలుస్తోంది. డ్వాక్రాతో దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర మహిళలు, ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలతో ప్రయాణికుల గమ్య స్థానాలకు చేరుస్తూ ఆర్జిస్తున్నారు. మెప్మా, ర్యాపిడో సహకారంతో స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ ఉపాధి కార్యక్రమానికి మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తొలి అడుగు పడింది. అదే రోజున సీఎం చంద్రబాబు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త కింద మెప్మా సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది. అందులో తొలి దశలో తొమ్మిది పట్టణాల్లో వెయ్యి మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400 వాహనాలు, విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50 చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25 వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వాటిలో 760 ఎలక్ట్రిక్ టూ-వీలర్లు కాగా, 240 ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు ఉన్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు వెయ్యికి పైగా కుటుంబాలు లబ్ధి పొందగా, వారిలో 688 మంది ర్యాపిడోలో నమోదయ్యారు.

డ్వాక్రా, మెప్మా సహకారంతో.. వాహనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు డ్వాక్రా సంఘాల మహిళల పేర్లతో మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వారి కుటుంబ సభ్యులు వాహనం నడిపేందుకు అవకాశం కల్పించారు. అవసరమైన ప్రాజెక్టు రిపోర్టులను మెప్మా సిద్ధం చేసి, జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సహకారం అందించింది. ఈ క్రమంలో ర్యాపిడో సైతం మహిళలకు సాధికారత అందించడంలో భాగస్వామ్యమైంది. కొత్తగా చేరిన వారికి ప్లాట్‌ఫామ్ ఫీజులో మూడు నుంచి నాలుగు నెలల మినహాయింపు ఇచ్చింది. అలాగే తొలి సంవత్సరం టూ-వీలర్, త్రీవీలర్ యజమానులకు నెలకు రూ. వెయ్యి చొప్పున ఈఎంఐ మొత్తాన్ని సాయంగా అందించారు. దీంతో ర్యాపిడో నడపటం ప్రారంభించిన గృహిణులకు తొలిరోజు నుంచే ఆదాయం ప్రారంభమైంది. అలాగే ఈఎంఐ, ఇంధన భారం కూడా తగ్గింది.

రూ. 16 వేల వరకు ఆదాయం

మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎలక్ట్రిక్ స్కూటర్, ఆటోలకు రూ. 12,300 నుంచి రూ. 36 వేల వరకు సబ్సిడీ అందిస్తోంది. ర్యాపిడోలో వాహనం నడుపుతున్న మహిళలు నెలకు సుమారు రూ. 13 నుంచి రూ. 16 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. మే, జూన్, జూలై నెలల్లో రికార్డు స్థాయిలో మహిళలు 45 వేల రైడ్లు పూర్తి చేశారు. మొత్తంగా రూ.35 లక్షల ఆదాయం సంపాదించారు. మహిళల విజయగాథల స్ఫూర్తితో రాబోయే ఏడాదిలో మరో 4,800 మందికి ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ర్యాపిడోలో ఎలక్ట్రిక్ టూ వీలర్ నడుపుతూ ఉపాధి పొందుతున్న విజయవాడ మహిళ బాడిస భవాని



మహిళల విజయగాథలు ఇవీ..

విజయవాడకు చెందిన వడ్లపడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొని ర్యాపిడో నడపడం ప్రారంభించారు. ప్రస్తుతం నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారు. ఈఎంఐ చెల్లిస్తూ, కొంత సొమ్మును పొదుపు చేస్తున్నానని మంజు చెబుతున్నారు. విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షవాతం రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భర్తకు వచ్చే రూ.6 వేల దివ్యాంగ పింఛన్ మందులకే సరిపోతుండటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఈ సమయంలో మెప్మా ద్వారా రుణం పొంది టూ-వీలర్ కొన్నానన్నారు. నెలకు రూ.12 వేల వరకూ సంపాదిస్తున్నా అని చెప్పారు. విజయవాడకు చెందిన భవానీ భర్త అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమయ్యారు. ఇంటి బాధ్యతను తలకెత్తుకున్న భవానీ.. మెప్మా అధికారుల సహకారంతో రూ.1.20 లక్షల విలువైన ఈ-స్కూటర్ కొనుగోలు చేసి ర్యాపిడోలో చేరారు. ప్రస్తుతం రోజుకు రూ. 500-700 వరకు సంపాదిస్తున్నారు.

ఇది ఆరంభం మాత్రమే: లోకేశ్

మహిళల సాధికారతే ప్రభుత్వ ఆలోచన అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. ర్యాపిడో కలిసి రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా మహిళలు స్వయం ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మహిళా సాధికారతకు మరింత కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- దసరా ఉత్సవాలకూ అందిస్తాం: మంత్రి లోకేశ్

అమరావతి, ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి లోకేశ్ సోమవారం 'ఎక్స్'లో ప్రకటించారు. దసరా ఉత్సవాలకు కూడా ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చించాను. వారు అంగీకరించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనుంది. దసరా పందిళ్లకూ ఉచిత విద్యుత్ ఇస్తాం' అని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా వినాయక ఉత్సవ మండపాలకు ఉచిత కరెంట్ అందిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒంగోలులో విలేకరులకు చెప్పారు. వినాయక చవితి, దసరా ఉత్సవాలకు ఉచిత విద్యుత్ కోసం రూ.25 కోట్లు కేటాయించామని తెలిపారు. కాగా, వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు.

2004లోపు చేరినవారికి ఓపీఎస్ అమలు చేయాలి

- లేదా 15 నుంచి ఆందోళన.. విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 1999 ఫిబ్రవరి ఒకటి నుంచి 2004 ఆగస్టు 31 మధ్య విధుల్లో చేరిన విద్యుత్తు సంస్థల ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను అమలు చేయాలని రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. లేదంటే వచ్చేనెల వచ్చేనెల 15 నుంచి 22 దాకా దశలవారీ ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించింది. ఈమేరకు జేఏసీ చైర్మన్ బి.కృష్ణయ్య, కన్వీనర్ రాఘవరెడ్డి తదితరులు ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చేకూరిని కలసి వినతి పత్రాలు అందించారు.

19 నుంచి అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్: నరెడ్కో

విజయవాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నాలా చట్టం రద్దు, లే అవుట్ డెవలప్‌మెంట్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ నిబంధనల్లో సడలింపు వంటి ప్రభుత్వ సానుకూల నిర్ణయాలతో పరిశ్రమలకు మేలు జరిగిందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 19 నుంచి 21 వరకు నరెడ్కో సెంట్రల్ జోన్ 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌ను విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నిర్వహించనున్నామన్నారు. ఎస్ఎల్‌వీ డెవలపర్స్ చైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు నరెడ్కో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, సెంట్రల్‌జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

మించేరి ఐరన్‌ఓర్ బ్లాక్‌కు క్లియరెన్స్

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఓబుళాపురంలోని మించేరి ఐరన్‌ఓర్ బ్లాక్‌ను ఎట్టకేలకు కీలక అనుమతులు లభించాయి. మించేరి ఐరన్‌ఓర్ బ్లాక్‌లో విజయవంతమైన బిడ్డర్‌గా సౌత్‌వెస్ట్ మైన్ లిమిటెడ్‌ను ప్రకటిస్తూ, ఆ కంపెనీకే మించేరి మైనింగ్ కోసం కాంపోజిట్ లైసెన్సు మంజూరు చేస్తున్నట్లుగా గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు (జీఓ-150) జారీ చేశారు.

అరుణ అరాచకం!

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ మరణంగా భావించిన ఈ వ్యవహారం ఇప్పుడు హత్యగా తేలింది. సుపారీ ఇచ్చిన వ్యక్తి సూళ్లూరుపేటలో కూటమిలోని ఒక పార్టీ నాయకుడు. తండ్రిని చంపించిన సంగతి పోలీసులకు తెలిసిందని ఉప్పందడంతో ఆయన గుండెనొప్పి సాకుతో నెల్లూరులోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం. అలాగే సూళ్లూరుపేట పాలవల్లివారి వీధిలో గతంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి అరుణ గ్యాంగ్ వేధింపులే కారణమన్న సంగతీ వెలుగు చూసినట్లు తెలిసింది.

కిలివేటితో అరుణ బంధం

నిడిగుంట అరుణ వైసీపీ నేతలతో ఎంత అంటకాగారో వెలుగులోకి వస్తోంది. సూళ్లూరుపేట అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో, మండలాధ్యక్షుడు, వైసీపీ మండల కన్వీనర్ అనిల్‌కుమార్ రెడ్డితో ఆమె సన్నిహితంగా మెలిగేది. సంజీవయ్య వెంటే ఉంటూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేది. దీనికి సంబంధించిన ఫొటోలు బయటపడ్డాయి. గత ఎన్నికల సమయంలో తనకు వైసీపీ టికెట్ దక్కదేమోనని సంజీవయ్య సందేహించారు. అదే జరిగితే అరుణను ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి వైసీపీ ఓట్లు చీల్చాలని భావించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది. అయితే సంజీవయ్యకే టికెట్ ఖరారైంది. అయినప్పటికీ అరుణను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. ఆమెకు అనిల్‌కుమార్ రెడ్డి జనరల్ ఏజెంటుగా వ్యవహరించారు. ఎన్నికల్లో ఆమెకు డైమండ్ గుర్తు కేటాయించగా.. 494 ఓట్లు వచ్చాయి. సంజీవయ్య నివాసం, వ్యాపారాలూ రెండూ నెల్లూరులోనే. అనిల్ కుమార్‌రెడ్డి సంజీవయ్యకు అత్యంత సన్నిహితుడు. వారిద్దరికీ అరుణ నెల్లూరులోనే పరిచయమైంది. వారి వ్యాపార అవసరాలకు అరుణను, ఆమె గ్యాంగ్‌ను వాడుకున్నట్లు పోలీసుల అనుమానం.

సూళ్లూరుపేటలో చోటా గ్యాంగ్..

2024 ఎన్నికలకు ఏడాదిన్నర ముందు నుంచీ అరుణ సూళ్లూరుపేటకు రాకపోకలు పెంచింది. అక్కడ ఎంపీపీ అనిల్‌కుమార్ రెడ్డి కార్యాలయంలో మకాం వేసేది. అక్కడ పది మంది రౌడీలతో గ్యాంగ్‌ను నడిపినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో అరుణ తరఫున పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

చెప్పింది వినలేదని కేసు పెట్టించింది!

నెల్లూరు క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 'గంజాయి వ్యాపారం చేయండి.. వ్యభిచార కేంద్రం నిర్వహించండి.. అన్నీ నేను చూసుకుంటా" అంటూ అరుణ జారీ చేసిన ఆదేశాలు పాటించనందుకు తనను కేసులో ఇరికించారని ఒక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడి పేరు రాయపు శ్రీనివాసులు. నాయుడుపేట మండలం విన్నమాల గ్రామవాసి. అతడి కథనం మేరకు... వెంకటగిరి ప్రాంతానికి చెందిన భాగ్యరాజు... శ్రీనివాసులకు బంధువు. భాగ్యరాజు అరుణను వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో అరుణతో శ్రీనివాసులుకు పరిచయం ఏర్పడింది. గంజాయి సరఫరా చేస్తానని, వ్యభిచార కేంద్రం నిర్వహించాలని.. ఏదైనా తేడా వస్తే తాను చూసుకుంటానని శ్రీనివాసులుకు ఆమె ఆఫర్ ఇచ్చింది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఇలాంటి వాటిలోకి రాలేనని చెప్పడంతో అతడిపై కక్ష పెంచుకుంది. వడుగుపాడులో రాజ్యలక్ష్మి అనే మహిళతో వివాదం తలెత్తడంతో అరుణ ఆమె ఇంటిని పూర్తిగా ధ్వంసం చేసి తిరిగి ఆమెపైనే కేసులు పెట్టింది. రాజ్యలక్ష్మి, ఆమె భర్తతోపాటు శ్రీనివాసులుపైనా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ జరపకుండానే ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఇన్నాళ్లూ భయంతో నోరుమెదపని శ్రీనివాసులు... సోమవారం పోలీసులకు అరుణపై ఫిర్యాదు చేశాడు.

రౌడీషీటర్ శ్రీకాంత్‌కు నోటీసు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న జీవిత ఖైదీ, రౌడీషీటర్ అవిలేల శ్రీకాంత్‌కు నెల్లూరు జైలు సూపరింటెండెంట్ నోటీసు జారీ చేశారు. నెల్లూరు జైలులో ఉన్నప్పుడు శ్రీకాంత్‌ను వైద్యం నిమిత్తం తిరుపతి ఆస్పత్రిగా పంపగా కి'లేడీ' అరుణతో సన్నిహితంగా మెలిగిన వీడియోలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. దీంతో శ్రీకాంత్‌కు నోటీసు పంపారని విశాఖ జైలు సూపరింటెండెంట్ సాయిపవన్ తెలిపారు.

11,702 మందికి ఆర్టీఈ సీట్లు

31 లోపు పాఠశాలల్లో చేరండి: ఎస్పీడీ

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) కింద జారీ చేసిన అదనపు నోటిఫికేషన్‌లో 11,702 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందారని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఎస్పీడీ) బి. శ్రీనివాసరావు తెలిపారు. అదనపు నోటిఫికేషన్‌లో కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి, గతంలో దరఖాస్తు చేసుకున్నా అడ్మిషన్ లభించని వారికి తాజాగా సీట్లు కేటాయించినట్టు తెలిపారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఈ నెల 31లోపు తమ సర్టిఫికెట్లతో పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. విద్యార్థుల జాబితా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని వివరించారు.

జపాన్-ఆసియా సైన్స్ ప్రోగ్రాంలో మనోళ్లు

జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ నిర్వహించిన 'జపాన్- ఆసియా యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం' అనే కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రానికి తిరిగొచ్చిన విద్యార్థులను సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు అభినందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి, అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు ఈ నెల 17 నుంచి 23 వరకు జపాన్‌లో జరిగిన సైన్స్ ప్రోగ్రాంకు హాజరయ్యారు. మన దేశం నుంచి 34 మంది విద్యార్థులు సదస్సులో పాల్గొనగా రాష్ట్రానికి చెందిన విద్యార్థులు నలుగురు ఉన్నారు. ఆ విద్యార్థులు సోమవారం ఎస్పీడీ కలిసి అనుభవాలను పంచుకున్నారు. జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాన్ని సందర్శించడం ఒక సువర్ణావకాశమని, ఇంకా బాగా చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. టి. పుష్పాంజలి(కాకినాడ), కె. హరీశ్(విజయనగరం), ఎం. ఐశ్వర్య(ప్రకాశం), పి. వరుణ్‌సాయి(గుంటూరు) విద్యార్థులు జపాన్‌లో పర్యటించారు.

సందడిగా స్మార్ట్ కార్డుల పంపిణీ



కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలో లబ్ధిదారుకు స్మార్ట్ రైస్ కార్డు అందిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, చిత్రంలో జేసీ

- లాంఛనంగా ప్రారంభించిన నాదెండ్ల
- పోరంకిలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే బోడె, ఇతర అధికారులు
- తొలివిడత 9 జిల్లాల్లో పంపిణీకి శ్రీకారం

అమరావతి, పెనమలూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల తొలివిడత పంపిణీ ప్రక్రియ సోమవారం 9 జిల్లాల్లో ప్రారంభమైంది. క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు సైజులో రూపొందించిన ఈ కార్డులను రాష్ట్రంలో ఉన్న దాదాపు 1.45 కోట్ల రేషన్ లబ్ధిదారులకు సెప్టెంబరు 15లోపు 4 విడతలుగా పంపిణీ చేస్తారు. తొలివిడత స్మార్ట్ కార్డుల పంపిణీని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో, మధ్యాహ్నం కృష్ణా జిల్లా పెనమలూరులో ప్రారంభించారు. విజయనగరం, ఎన్టీఆర్, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 29 వరకు సివిల్ సప్లయిస్ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 53 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 30 నుంచి రెండో విడత చిత్తూరు, కాకినాడ, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో, మూడో విడత సెప్టెంబరు 6 నుంచి అనంతపురం, అల్లూరి, పార్వతీపురం మన్యం, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ చేపడతారు. చివరి విడత పంపిణీ సెప్టెంబరు 7నుంచి 15 వరకు జరుగుతుంది.

గుర్తింపు కార్డుగా స్మార్ట్ రేషన్ కార్డు

స్మార్ట్ రైస్ కార్డులు లబ్ధిదారులకు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి మనోహర్ చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఆయన కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకి బీజేఆర్ నగర్‌లో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, జేసీ గీతాంజలి శర్మలతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ కార్డులను పంపిణీ చేశారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ఈ కార్డులకు రూపకల్పన చేశామని తెలిపారు. ఈకార్డు ఒక గుర్తింపు కార్డులా పని చేస్తుందన్నారు. ఉద్యోగరీత్యా గానీ, చదువురీత్యా గానీ ఎక్కడికి వెళ్లినా చౌక ధరల దుకాణాల నుంచి నిత్యావసర సరుకులు పొందే సౌలభ్యం కల్పించామని మంత్రి తెలిపారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేస్తే లబ్ధిదారు తీసుకొన్న సరుకుల సమాచారం ఫోన్‌లోకి వస్తుందన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు వీలైన సమయంలో రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. కార్డుపై ఉన్న ఇంటి చిరునామా, కుటుంబ వివరాల మార్పులు, చేర్పుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అదే రోజు వారు అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కృష్ణా జిల్లాలో 5,17,825, పెనమలూరు నియోజకవర్గంలో దాదాపు 92 వేల కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు.

కార్డులకు రూ.8 కోట్లు మంజూరు

గత వైసీపీ ప్రభుత్వం ప్రచార పిచ్చితో రేషన్ కార్డులకు కూడా తమ పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై జగన్, వైఎస్ బొమ్మ ముద్రించి పంపిణీ చేసింది. వాటి స్థానంలో తెచ్చిన కొత్త స్మార్ట్ కార్డులను ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో రూపకల్పన చేశారు. ఈ కార్డుపై ప్రభుత్వ చిహ్నం, మరోవైపు కార్డుదారు ఫొటో, రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలను ముద్రించారు. ఒక్కో కార్డుకు రూ.4.66 చొప్పున 1,46,21,223 స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రించి, సరఫరా చేసేందుకు చెన్నైకి చెందిన వెర్సటైల్ కార్డ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను జారీ చేశారు. నెలావారీగా కొత్త కార్డులను ముద్రించడంతోపాటు ఇతర ఖర్చులను కూడా కలుపుకొని మొత్తం రూ. 8 కోట్ల మంజూరుకు సివిల్ సప్లయిస్ కమిషనర్ కోరగా, ప్రభుత్వం ఆ మొత్తాన్ని సోమవారం మంజూరు చేసింది.

విశాఖ ఉపాధ్యాయినికి 'జాతీయ అవార్డు'

- చదువుకునేందుకు రండి-దేశ సేవకు వెళ్లండి
- థీమ్‌తో తీర్చిదిద్దుతున్న తిరుమల శ్రీదేవి


విశాఖపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పాఠాలు ప్రతి టీచరూ చెబుతారు. కానీ, విద్యార్థుల మనసుకు హత్తుకునేలా, వారిలో జిజ్ఞాసను మరింత పెంచేలా వినూత్న విధానాలు అవలంబించి బోధించే ఉపాధ్యాయులు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో విశాఖపట్నానికి చెందిన మాదాబత్తుల తిరుమల శ్రీదేవి ఒకరు. ఒత్తిడి రహిత విధానాలు, వినూత్న ఆలోచనలను కలగలిపి సరికొత్త పంథాను ఎంచుకుని విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. 'చదువుకునేందుకు రండి-దేశ సేవకు వెళ్లండి' అనే థీమ్‌తో విద్యార్థి దశ నుంచే దేశానికి సేవ చేయాలన్న స్ఫూర్తిని నింపుతున్న నిబద్ధతే.. ఆమెను 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డుకు ఎంపిక చేసింది. టీచర్లు కలలుగనే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈ ఏడాది మొత్తం 45 మంది గురువులను ఈ అవార్డులకు ఎంపిక చేయగా, ఆ జాబితాలో ఏపీ నుంచి ఒకే ఒక్కరు చోటు దక్కించుకున్నారు. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలోని పండిట్ నెహ్రూ జీవీఎంసీ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా(బయాలజీ టీచర్) పని చేస్తున్న మాదాబత్తుల తిరుమల శ్రీదేవి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, లెర్నింగ్ విధానంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఆమె సెప్టెంబరు 5న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకోనున్నారు. అవార్డు కింద ప్రశంసాపత్రం, రూ.50 వేల నగదును అందిస్తారు.

స్కూల్ అసిస్టెంట్‌గా మొదలై..

విశాఖపట్నం జిల్లాలోని తగరపువలస ప్రాంతానికి చెందిన తిరుమల శ్రీదేవి 2001లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, లెర్నింగ్ విధానంలో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, చదువు పట్ల ఆసక్తి పెంచుతారు. విద్యార్థులను క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకువెళ్లి ప్రాజెక్టులు చేయిస్తారు.

సరి కొత్త థీమ్

'కమ్ టు లెర్న్-గో టు సర్వ్ ద నేషన్'(చదువుకునేందుకు రండి-దేశ సేవకు వెళ్లండి) థీమ్‌తో సరికొత్త విధానాన్ని శ్రీదేవి రూపొందించారు. ఈ విధానంలో ఐ డు(టీచర్ చేస్తారు), ఉయ్ డు(టీచర్, స్టూడెంట్స్ కలిసి చేస్తారు), యూ డు(పిల్లలు చేస్తారు) అన్న కాన్సెప్ట్‌తో యాక్టివిటీస్‌ను డిజైన్ చేశారు. శ్రీదేవి బోధనా విధానాలపై ఆలిండియా రేడియో.. 'గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్' ప్రమోషన్, 'గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్' అనే డాక్యుమెంటరీని రూపొందించారు. 2018లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారు.



బోధన విధానానికి గుర్తింపు

విద్యార్థులకు భిన్నమైన పద్ధతిలో బోధన సాగించాలన్న ఉద్దేశంతో తీసుకువచ్చిన నూతన విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. ఈ కాన్సెప్ట్ వల్ల విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగడంతోపాటు చదువు పట్ల ఆసక్తి పెంచగలుగుతున్నా. ప్రాక్టికల్ నాలెడ్జ్, నాలెడ్జ్ బేస్డ్ లెర్నింగ్‌కు ఈ విధానం వారధిగా నిలుస్తుంది. ప్రస్తుతం తరగతిలో టాకింగ్ రోబో ఉంది. ఇది విద్యార్థుల మాదిరిగా మాట్లాడుతూ వారిలో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. నేర్చుకున్న ప్రతి అంశాన్నీ దేశానికి సేవ చేసేందుకు ఉపయోగించాలన్నది నా ఉద్దేశం. నా మోటో కూడా అదే.

\- తిరుమల శ్రీదేవి



కర్నూలు జిల్లా పత్తికొండలో మహిళల భారీ ర్యాలీ

'సూపర్‌సిక్స్' సూపర్ హిట్

» కర్నూలు జిల్లా పత్తికొండలో భారీ ర్యాలీ.. వేలాదిగా తరలివచ్చిన మహిళలు

పత్తికొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలమేరకు రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాలు విజయవంతంగా అమలుచేయడంపై పత్తికొండలో 'సూపర్ సిక్స్. సూపర్ హిట్' అంటూ సోమవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మహిళలు వేలాదిగా హాజరయ్యారు. పత్తికొండలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి అంబేడ్కర్ కూడలివరకు సాగిన ఈ ర్యాలీలో వేలాదిమంది మహిళలు పాల్గొని చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

వైసీపీ ఫేక్.. జగన్ చెప్పేవన్నీ ఫేక్

» కూటమి 30 ఏళ్లుంటుంది

» కాకినాడ పార్లమెంటరీ స్థాయి సమావేశంలో అచ్చెన్న



కాకినాడ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒక ఫేక్ పార్టీ అని, ఆ పార్టీ నుంచి సీఎంగా పనిచేసిన జగన్ చెప్పేవన్నీ ఫేక్ అని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అబద్ధాల నుంచి పుట్టుకొచ్చిన ఆ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన కాకినాడ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం బాబాయ్‌ని చంపించి గుండెపోటు అని చిత్రీకరించిన జగన్, వైజాగ్‌లో కోడి కత్తి డ్రామా, విజయవాడలో గులకరాయి డ్రామా ఆడిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. దీంతో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, దాన్ని ఓర్వలేక దుష్ప్రచారాలకు ఒడిగట్టారని అన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ తీసేస్తోందని వైసీపీ ఫేక్ ప్రచారం సాగిస్తోందన్నారు. వికలాంగుల పెన్షన్ అర్హులెవరికీ తొలగించడంలేదని స్పష్టం చేశారు. దీనిపై జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని, ఆయన రోత పత్రికలో ఇష్టానుసారం పెడరాతలు రాస్తున్నారని అన్నారు. కాగా, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలయిక ఇంకో 30 ఏళ్లు ఉంటుందని అచ్చెన్న అన్నారు. అందుకు టీడీపీ కొన్ని త్యాగాలు చేయాల్సి ఉంటుందని, ఆ దిశగా పార్టీ శ్రేణులు సిద్ధపడి ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీలోను, అనుబంధ కమిటీల్లోను అనేక పదవులు ఉన్నాయని తెలిపారు. త్వరలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని, కష్టపడిన వారికి తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందని భరోసా ఇచ్చారు.

చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు తగ్గిన ప్రాధాన్యం

» అఖిల భారత స్పీకర్ల సదస్సులో అయ్యన్నపాత్రుడు ఆవేదన



న్యూఢిల్లీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ప్రస్తుతం అర్థవంతమైన చర్చలకు తక్కువ ప్రాధాన్యం దక్కుతోందని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అరవడం, నినాదాలివ్వడం ఎక్కువ లాభదాయకమని సభ్యులు భావిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర శాసనసభ మొదటి స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఢిల్లీ అసెంబ్లీలో అఖిల భారత స్పీకర్ల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సోమవారం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సభలో సభ్యులు ఎక్కువ రోజులు కూర్చోవాలని, నేర్చుకోవాలని సూచించారు. ఇతరులు చెప్పేవి ఓపిగ్గా వినడం అలవాటు చేసుకొని, సరైన ప్రశ్నలు అడగడం నేర్చుకోవాలన్నారు. కేవలం రాజ్యాంగ ముసాయిదాను చర్చించడానికే రాజ్యాంగ సభ మూడేళ్ల లోపు వ్యవధిలో 106 రోజులు సమావేశమైందని తెలిపారు. రాజ్యాంగ ముసాయిదా అనే ఒకే ఒక్క అంశాన్ని చర్చించడానికి ఏడాదికి సగటున 50 రోజులు సమావేశమైందన్నారు. నేడు చర్చించడానికి వేలాది అంశాలున్నప్పటికీ కొన్ని రాష్ట్రాల శాసనసభలు సగటున ఏడాదికి 20 రోజుల కన్నా తక్కువ సమయం మాత్రమే సమావేశమవుతున్నాయని, ఇది ఆరోగ్యకరమైన ధోరణి కాదని తెలిపారు. ఏడాదిలో కనీసం 60 రోజులైనా శాసనసభను సమావేశపరిచేలా స్పీకర్లు రాష్ట్రప్రభుత్వాలను ఒప్పించే ప్రయత్నం చేయాలని సూచించారు.

జగన్ హయాంలో అన్నీ కుప్పకూలాయి: యనమల

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో పాలనతోపాటు ఆర్థికం, వ్యవసాయం, తయారీ, పర్యాటకం తదితర అన్ని రంగాలూ కుప్పకూలాయని ఆర్థిక శాఖ మాజీ మంత్రి, టీడీపీ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. జగన్ పాలనలో నిరుద్యోగం పెరిగి, పేదల ఆదాయాలు తగ్గాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే పెట్టుబడులు పెట్టొద్దంటూ లేఖలు రాయడం జగన్ కుట్రపూరిత నైజానికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్ర ఆర్థికవ్యవస్థ వేగంగా కోలుకుంటే ఆదాయం పెరిగి, పేదలకు సంక్షేమం అందుతుందని, ఇది జరగడం జగన్‌కు ఇష్టం లేదని చెప్పారు.

వైసీపీ పాలనలో 'పోలవరం' విధ్వంసం: నిమ్మల

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 2019 నాటికి 72శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు.. వైసీపీ హయాంలో విధ్వంసానికి గురయ్యిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జగన్ మీడియా అసత్య ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని అస్థిర పరచి లబ్ధి పొందాలన్నదే జగన్ వ్యూహం అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని వైసీపీ 20ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మంత్రి విమర్శించారు.

వైసీపీ హయాంలోనే 'ఒబెరాయ్'కు భూములు: బుచ్చిరాంప్రసాద్

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హిందూ మతం, హిందూ దేవుళ్లపై జగన్‌కి, వైసీపీ నేతలకు ఏ మాత్రం గౌరవం లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలపైన, అర్చకులపైనా దాడులు జరిగాయని, కూటమి పాలనలో ఒక్క ఆలయంపై అయినా దాడి జరిగిందా? అని ప్రశ్నించారు. ఒబెరాయ్ హోటల్‌కు వైసీపీ హయాంలోనే భూములు కేటాయిస్తూ జీవో ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఆ కేటాయింపులను రద్దు చేసిందన్నారు.

నా రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలి

» హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్సీ జయమంగళ

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తన రాజీనామా లేఖపై తగిన నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసేలా శాసనమండలి ఛైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా, రాతపూర్వక వివరాలను కోర్టు ముందు ఉంచాలని శాసనమండలి ఛైర్మన్, కార్యదర్శి తరఫు న్యాయవాది గింజుపల్లి సుబ్బారావును హైకోర్టు ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఆగస్టు 30కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన జయ మంగళ వెంకటరమణ గత ఏడాది నవంబర్ 23న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ శాసన మండలి ఛైర్మన్‌కు లేఖ సమర్పించారు. 9నెలలు గడుస్తున్నా దానిని ఆమోదించడం కానీ, తిరస్కరించడంకానీ చేయడం లేదని జయమంగళ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏపీ శాసనసభ కార్యకలాపాల నిర్వహణ విధానంలోని నిబంధన 186, అధికరణ 190(3)బి ప్రకారం రాజీనామా సమర్పించాక దానిని ఆమోదించడంగానీ, తిరస్కరించడంగానీ చేయాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత ఛైర్మన్‌పై ఉందని పేర్కొన్నారు.

నాడు జగన్మాయ.. నేడు నిజమాయె!



జగన్ నీటిని విడుదల చేసిన మరుసటి రోజే రాజుపేట గేటు వద్ద హంద్రీ-నీవా కాలువలో అడుగంటిన నీళ్లు (ఫైల్ ఫొటో)



కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి గ్రామానికి చేరిన హంద్రీనీవా జలాలు

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా జలాలను తరలించేందుకు హంద్రీ నీవా పథకాన్ని చేపట్టారు. 2014-2019 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువ నిర్మాణం ప్రారంభించారు. కుప్పం బ్రాంచి కెనాల్‌ను 123 కిలోమీటర్ల మేర డిజైన్ చేసి, మూడు చోట్ల పంప్ హౌస్‌లు ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల నాటికి ఆ పనులు 80 శాతం పూర్తయ్యాయి. ఆ తర్వాత జగన్ సీఎం అయ్యారు. హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పానికి నీళ్లిస్తానని ఆయన ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ... అధికారంలోకి వచ్చాక దానిని పూర్తిగా విస్మరించారు. ఎన్నికలకు సరిగ్గా నాలుగైదు నెలల ముందు, హంద్రీ-నీవా కాలువకు నీళ్లను విడుదల చేస్తున్నామంటూ పెద్ద డ్రామాకు తెరతీశారు. 2024 ఫిబ్రవరి 26వ తేదీన రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువకు నీటిని 'విడుదల చేస్తున్నట్లు' ఒక సెట్టింగ్ వేశారు. జగన్ గేటు ఎత్తి హడావుడి చేశారు. కానీ... అదంతా ఒట్టి మోసం. ప్రారంభోత్సవం చేసిన చోట.. అదే రోజు సాయంత్రానికే నీళ్లు నిశ్చలంగా, మడుగులా నిలిచిపోయాయి. ఆ మరుసటి రోజున... జేసీబీని తెచ్చి గేటును సైతం అక్కడి నుంచి తరలించారు. వెరసి... కేవలం ఎన్నికల సమయంలో ప్రజలను మోసం చేసేందుకే ఈ డ్రామా ఆడినట్లు స్పష్టమైంది.

కుప్పం చేరిన కృష్ణా జలాలు

హంద్రీ-నీవా పెండింగ్ పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకు వస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధులు విడుదల చేశారు. లైనింగ్‌తోపాటు, ఇతర పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయించారు. ఇందుకోసం మొత్తం రూ.560 కోట్లు వ్యయం చేశారు. నంద్యాల జిల్లా మాల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద గత జూలై 17న ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణా జలాలను హంద్రీ-నీవా కాలువకు విడుదల చేశారు. అక్కడి నుంచి పరుగులు పెడుతూ వచ్చిన కృష్ణమ్మ శనివారం అర్ధరాత్రికి రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశించాయి. అక్కడి నుంచి... శాంతిపురం, గుడుపల్లె మండలాల మీదుగా సోమవారం సాయంత్రానికి జరుగు పంచాయతీ వద్ద కుప్పం మండలంలోకి ప్రవేశించాయి. రాత్రి సుమారు 7.30-8.00 మధ్య అంతిమ స్థానమైన కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు చేరుకున్నాయి. స్థానికులు హంద్రీ-నీవా కాలువ ద్వారా తరలివచ్చిన కృష్ణా జలాలకు సంబరంగా స్వాగతం పలికారు.

గంగమ్మే మమ్మల్ని ఆశీర్వదించింది



సాక్షాత్తు ఆ శివుడి తలలోని గంగమ్మ తల్లే మమ్మల్ని ఆశీర్వదించడానికి ఈ కాలవ రూపంలో భూమ్మీదకు దిగొచ్చింది. ఏడాదంతా ఈ తల్లి మాతోనే ఉంటుంది. మాకు ధాన్యరాశులు ప్రసాదిస్తూ భాగ్యవంతుల్ని చేస్తుంది.

- శ్రీదేవి, గుడ్లనాయనిపల్లె, కుప్పం మండలం

ఇక దిగులు లేదు



ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న గంగమ్మ మా ముంగిట్లోకి వచ్చేసింది. నీళ్లుంటే మాలాంటి రైతులకు దిగులే లేదు. ఎంత కష్టమైనాపడి సేద్యంచేసి పంటలు పండించుకోగలం. పంట పండితే రైతుకు అంతకుమించిన భాగ్యం ఇంకేమీ లేదు.

- కుపేంద్ర, జోగిండ్లు, గుడుపల్లె మండలం

జలాశయాలు కళకళ

» సమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో సత్ఫలితాలు: సీఎం

» హంద్రీ-నీవా విస్తరణతో కుప్పం చేరిన కృష్ణా జలాలు

» శ్రీశైలం నుంచి 738 కి.మీ ప్రయాణం

» సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జలాశయాలకు జలకళ వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో సత్ఫలితాలు సాధించామన్నారు. హంద్రీ-నీవా కాలువ విస్తరణ, సమగ్ర నీటి యాజమాన్య నిర్వహణపై సోమవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు హంద్రీ-నీవా కాలువల గుండా 738 కిమీ ప్రయాణించి కుప్పం చేరాయని అధికారులు చెప్పినప్పుడు.. సంకల్పంతో పనిచేశామని, ఫలితం సాధించామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించింది. 'రాష్ట్రంలోని రిజర్వాయర్లు 90 శాతానికి పైగా నిండాయి. కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల ద్వారా ఇప్పటికే 310 టీఎంసీల వినియోగం జరిగింది. హంద్రీ-నీవా ద్వారా సీమ ప్రాజెక్టులకు సమృద్ధిగా నీళ్లు చేరాయి' అని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 70 టీఎంసీలు, ప్రకాశం బ్యారేజీ నుంచి 52 టీఎంసీలు, వంశధార నుంచి 8 టీఎంసీలను కాలువల ద్వారా సాగుకు అందించామన్నారు. ఇదే సమయంలో 1,969 టీఎంసీల వరద సముద్రం పాలైందన్నారు.

బ్రాహ్మణ, కమ్మ కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామకం

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బుచ్చి రాంప్రసాద్‌ను, కమ్మ కార్పొరేషన్‌కు గురజాల నియోజకవర్గానికి చెందిన బ్రహ్మం చౌదరిని ఛైర్మన్‌గా నియమిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విభాగాల సంక్షేమ శాఖ (ఈడబ్ల్యూఎస్) ముఖ్య కార్యదర్శి కె. సునీత సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఛైర్మన్లు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు.

మంగళాద్రికి మహర్దశ..!

» 155 కోట్లతో లక్ష్మీనృసింహస్వామి దివ్యక్షేత్రం అభివృద్ధి

» కేంద్ర పథకం 'సాస్కీ' కింద నిధులు రాబట్టేలా కృషి

» చాలెంజ్‌గా తీసుకున్న మంత్రి లోకేశ్

» ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రెడీ



మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దివ్యక్షేత్రం

మంగళగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దివ్య క్షేత్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధమైంది. దాదాపు ఎనిమిది నెలలుగా వివిధ కోణాల్లో చర్చించి, పరిశోధించి దీన్ని రూపొందించారు. మంగళాద్రి దివ్యక్షేత్రం అభివృద్ధిని చాలెంజ్‌గా స్వీకరించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్.. దేవదాయ, పర్యాటక, అటవీ, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, రెవెన్యూ శాఖలతో 20 సార్లకుపైగా సమావేశమయ్యారు. ఎట్టకేలకు హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎంజీ డిజైన్ ఇంక్ ఆర్కిటెక్చర్ సంస్థ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. దీనిప్రకారం మొత్తం క్షేత్రాభివృద్ధికి రూ.147.53 కోట్లు అవసరమని అంచనా వేశారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తారు. దీంతోపాటే దిగువ సన్నిధి ఆసాంతాన్ని జీర్ణోద్ధరణ చేసేందుకు మరో రూ.7 కోట్ల దేవదాయశాఖ నిధులను సమాంతరంగా ఖర్చు చేయాలని నిర్ణయించారు. అంటే మొత్తం క్షేత్రాభివృద్ధికి రూ.155 కోట్లు ఖర్చు చేయనున్నారు.

మాస్టర్ ప్లాన్‌లో అభివృద్ధి పనులు..

మాస్టర్‌ప్లాన్ ప్రకారం మంగళగిరి కొండ చుట్టూ 3/4 వంతు భాగంలో పాత, కొత్త హైవేలను కలిపేలా వంద అడుగుల రోడ్డును 3.47 కిలోమీటర్ల మేర కొత్తగా నిర్మిస్తారు. ఈ పనులకు మొత్తం రూ.40.42 కోట్లు అవుతాయని అంచనా వేశారు. దిగువ సన్నిధికి తూర్పు వైపు ప్రాంతం అభివృద్ధికి రూ.60 కోట్లు, దిగువ సన్నిధిలో ప్రధానాలయ విమాన గోపురం, అమ్మవారి విమాన శిఖరం, శ్రీకృష్ణదేవరాయ ముఖ మండపం, వాహన శాల, యాగశాలను పూర్తిగా అభివృద్ధి చేసేందుకు ఆలయ నిధులు రూ.7 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఎగువ సన్నిధిలో అభివృద్ధి పనులను రూ.11.20 కోట్లు, కొండ శిఖర భాగంలో ఉన్న శ్రీ గండాలయస్వామి సన్నిధి అభివృద్ధికి రూ.1.80 కోట్లు, పెదకోనేరు ఆధునీకరణకు రూ.3.80 కోట్లు, దిగువ సన్నిధిలో గోపురాలు, ప్రహరీ మరమ్మతులు, తాగునీటి వసతి, ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం రూ.3.75 కోట్లు వెచ్చిస్తారు. మంగళగిరి ఎయిమ్స్ వెంబడి ఇప్పటికే ఉన్న ఎకో పార్కును రూ.12.03 కోట్లతో మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ అభివృద్ధికి కావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కీ కింద రాబట్టేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. ఈ పథకం కింద సుమారు రూ.100 కోట్ల వరకు మంజూరయ్యే అవకాశాలున్నాయి. మిగతా నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది.

విట్, ఎస్ఆర్ఎంలకు అదనంగా భూముల కేటాయింపు

» ఎకరా రూ.2 కోట్ల ధరకు చెరో వంద ఎకరాలు.. ఉత్తర్వులు జారీ

» గుంటూరు టీడీపీ కార్యాలయ స్థలానికి లీజు కాలపరిమితి 99 ఏళ్లకు పెంపు

» రాజధానిలో మౌలిక వసతులకు రూ.904 కోట్లు మంజూరు

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఉన్న విద్యా సంస్థలు విట్, ఎస్ఆర్ఎంలకు ప్రభుత్వం రెండో దశ కింద అదనపు భూములను కేటాయించింది. ఎకరానికి రూ.2 కోట్ల ధర చొప్పున రెండు సంస్థలకూ చెరో వంద ఎకరాలు కేటాయించేందుకు మంత్రివర్గ ఉపసంఘం తీర్మానంతో భూములు కేటాయించడానికి సీఆర్‌డీఏకు అనుమతి మంజూరు చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఈ రెండింటికీ 200 ఎకరాల చొప్పున రెండు విడతల్లో అందించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించి 2016లో ఉత్తర్వులిచ్చింది. అందులో భాగంగా తొలుత ఎకరా రూ.50 లక్షల చొప్పున ఒక్కో సంస్థకు వంద ఎకరాల వంతున 2017లో ఆయా సంస్థలకు రిజిస్టర్ చేశారు. రెండో విడత కేటాయింపులకు మొదటి దశలో పెట్టిన పెట్టుబడులు, విద్యార్థుల సంఖ్యతో ముడిపెట్టారు. ప్రస్తుతం విట్‌లో 17 వేల మంది విద్యార్థులకు 25 లక్షల చ.అడుగల భవనాలు నిర్మించగా.. మరో 19 లక్షల చ.అడుగుల స్థలంలో భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఎస్ఆర్ఎంలో 11 వేల మంది విద్యార్థుల కోసం 22 లక్షల చదరపు అడుగుల భవనాలు నిర్మించారు. ఇంకో 6.60 లక్షల చ.అడుగుల్లో భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో ఈ రెండు సంస్థలు రెండో విడత భూముల కేటాయింపులకు అర్హత పొందాయని సీఆర్‌డీఏ భావించింది. ఎకరాకు రూ.2 కోట్ల మార్కెట్ ధరతో ఆయా సంస్థలకు వంద ఎకరాల చొప్పున కేటాయించాలని సోమవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. అలాగే గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కోసం గుంటూరులో కేటాయించిన మున్సిపల్ స్థలం 2,954 చదరపు గజాలకు లీజు కాలపరిమితిని 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పెంచుతూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇంకోవైపు.. రాజధాని అమరావతిలోని భూసమీకరణ స్కీం జోన్లలో కీలకమైన మౌలిక వసతుల కల్పనకు రూ.904 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూ గ్రామాల అభివృద్ధికి జోన్లవారీగా ఈపీసీ విధానంలో టెండర్లు పిలవాలని పేర్కొన్నారు.

మహిళల సహకారంతో స్త్రీశక్తి గ్రాండ్ సక్సెస్

» విద్యార్థినులకు బస్‌పాసుల శ్రమ తప్పించాం

» మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకొచ్చాం

» ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్

» ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు



ఆర్టీసీపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, పాల్గొన్న అధికారులు

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళల సహకారంతో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. పథకం అమలుపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్షించారు. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్), బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా వంటి అంశాలపై ఆరా తీశారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు బదులిచ్చారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఉచిత బస్సులను మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని, అవసరమైన మేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వివరించారు. సీఎం మాట్లాడుతూ.. 'ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువ. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకుంటారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచీ మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తి చూపించాను. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే.. ఇప్పుడు స్త్రీ శక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది' అని అన్నారు.

సహకరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు

'స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అనవసర ప్రయాణాలు పెట్టుకోవడం లేదు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని, అందుకనుగుణంగా సహకరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. ఆర్టీసీ సిబ్బందికీ ప్రయాణికులు సహకరించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే మరింత ఉత్సాహంగా పని చేస్తాం. ప్రజలకు, మహిళలకు మరింత మేలు చేకూర్చగలం' అని సీఎం అన్నారు.

బోర్డులు... లైవ్ ట్రాకింగ్ పెట్టండి

స్త్రీ శక్తి పథకం కింద నడిపే బస్సులకు వెనుక, ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తంగా 8,458 స్త్రీ శక్తి బస్సులకు బోర్డులు పెట్టాలని చెప్పారు. సీట్లకోసం పోటీ పడితే ఆర్టీసీ సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఇప్పటి వరకు ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తలేదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం మహిళలు ప్రయాణిస్తే, 60 శాతం మంది పురుషులు ప్రయాణించే వారని.. ఇప్పుడు 65 శాతం మేర మహిళలు ప్రయాణిస్తుంటే.. 35 శాతం మేర పురుషులు ప్రయాణిస్తున్నారని అధికారులు వివరించారు. రెండు, మూడు రోజుల్లో గుంటూరు డిపోలో స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపడతామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. లైవ్ ట్రాకింగ్ విధానం అమల్లోకి వస్తే బస్సుల వేళలు తెలుసుకుని, ఆ మేరకు తమ ప్రయాణ సమయాలను మహిళలు ఫిక్స్ చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్టిక్యులేటెడ్ ఈ - బస్సులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ తరహా బస్సులు ప్రస్తుతమున్న సాధారణ బస్సులకు, మెట్రో రైలుకు మధ్య మిడిల్ లెవెల్ ట్రాన్స్ పోర్టు వ్యవస్థగా ఉంటాయని అధికారులు వివరించారు.

రఘురామపై ఎఫ్ఐఆర్ కొట్టివేత

- గచ్చిబౌలి పోలీసులు నమోదు చేసిన కేసులో డిప్యూటీ స్పీకర్‌కు సుప్రీంలో ఊరట



న్యూఢిల్లీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2022లో రఘురామ ఎంపీగా ఉన్న సమయంలో గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్‌లోని ఆయన నివాసం వద్ద ఒక వ్యక్తి (కానిస్టేబుల్ ఎస్‌కే ఫరూక్ బాషా) అనుమానాస్పదంగా తిరిగారు. ఈ విషయాన్ని సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించిన భద్రతా సిబ్బంది ఆయనను విచారించగా, ఐడీ సహా ఇతర ధ్రువీకరణ కార్డులు చూపించేందుకు నిరాకరించారు. దీంతో అనుమానించి ఆయనను గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై రఘురామ పీఏ అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు విధి నిర్వహణలో ఉన్న తనపై దాడి చేశారని కానిస్టేబుల్ ఫరూక్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రఘురామతోపాటు ఆయన కుమారుడు భరత్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును క్వాష్(కొట్టివేయాలని) చేయాలని కోరుతూ రఘురామ, భరత్‌లు హైకోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పుని రఘురామ 2022, జూలై 12న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలు జరిగాయి. సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయిలతో కూడిన ధర్మాసనం రఘురామపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

నాపై తప్పుడు కేసులు పెట్టడంలో

నాటి జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ధ్వజం

న్యూఢిల్లీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తనపై అక్రమ కేసులు బనాయించడంలో గత వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. తనకులాగే ఎన్నో వేలమందిపై అక్రమ కేసులు పెట్టారని, ఆ కేసుల్లో బాధితులకు ఊరట కలిగించే ప్రయత్నం ప్రస్తుత ప్రభుత్వం చేయాలని కోరారు. తనపై మోపిన తప్పుడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ద్వారా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో సీఆర్పీఎఫ్ పోలీసుల ఫిర్యాదును బుట్టదాఖలు చేసి, అప్పటి నిఘావిభాగం కానిస్టేబుల్ ఫారూఖ్ బాష ఫిర్యాదు మేరకు నాపై, నా కుమారుడిపై, సీఆర్పీఎఫ్ పోలీసులపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సుప్రీంకోర్టులో జరిగిన తుది వాదనల్లో ఫారుఖ్ బాష ఈ కేసును కొనసాగించడానికి తనకు ఆసక్తి లేదని అఫిడవిట్ దాఖలు చేశాడని అతడి న్యాయవాదులు చెప్పినట్లు తెలిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు ఆ కేసు కొట్టి వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఫారూఖ్ బాషపై ఒత్తిడి తెచ్చి తప్పుడు కేసు పెట్టించారు. ఇప్పుడు తన తప్పు తెలుసుకుని కేసు వెనక్కి తీసుకొని ఉంటాడు" అని రఘురామ అన్నారు. కస్టోడియల్ టార్చర్ కేసులో డీఐజీ స్థాయి అధికారి సునీల్ నాయక్‌ను తక్షణమే విచారించాలని రఘురామ అన్నారు.

60 రోజులు గైర్హాజరైతే అనర్హతే..

"సెప్టెంబరు 18 నుంచి జరగనున్న శాసనసభ సమావేశాలకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు హాజరు కావాలి. గతంలో కొంతమంది గైర్హాజరయ్యారు. ఈసారి 60 రోజులపాటు శాసనసభ సమావేశాలు హాజరు కాని శాసనసభ్యులపై అనర్హత వేటు పడుతుంది. శాసనసభ నిర్వహణ, కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటీ అధికారుల నియామకం కోసం ప్రత్యేక బడ్జెట్ ఉండాలి" అని రఘురామ చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో 'ఆంధ్రజ్యోతి'ది నిర్మాణాత్మక పాత్ర

- నూజివీడు చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా' సమావేశం

నూజివీడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్మాణాత్మక, బాధ్యతాయుత పాత్ర పోషిస్తోందని ఏలూరు జిల్లా నూజివీడు మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం సక్సెస్ మీట్ నూజివీడులోని సంగం కాంప్లెక్స్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి' ద్వారా ప్రజలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించేందుకు తమ కౌన్సిల్‌తోపాటు మంత్రి పార్థసారథి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, టీడీపీ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు, పట్టణ బీజేపీ అధ్యక్షురాలు ఎం.నాగరాణి, మున్సిపల్ అధికారులు, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

'ఆంధ్రజ్యోతి' జనవరి 28న నూజివీడులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. దీనిలో రూ.2కోట్లు ఖర్చు చేసి చెరువు గండ్లు పూడ్చారు. రూ.80 లక్షలతో నూజివీడు-తిరువూరు ప్రధాన రహదారిని అభివృద్ధి చేశారు. ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్యకు రూ.3.75 కోట్లతో పరిష్కారం చూపారు. ఇండోర్ స్టేడియం పనులకు రూ.2కోట్లు మంజూరు చేయించారు. పట్టణంలో రహదారుల అభివృద్ధికి రూ.2.86 కోట్లు మంజూరు చేయగా, కొన్ని టెండర్ దశలో, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. రూ.68 లక్షలతో డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు రూ.48 లక్షలు మంజూరు చేశారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు కోసం డీపీఆర్‌ను రూపొందించి మంత్రి కొలుసు కేంద్ర ప్రభుత్వానికి పంపారు.



నూజివీడులో జరిగిన 'అక్షరం అండగా పరిష్కారమే అజెండా' భేటీలో మాట్లాడుతున్న నూజివీడు మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ

బెట్టింగ్ కట్టడెలా?

(మొదటి పేజీ తరువాయి)

(మొదటి పేజీ తరువాయి)

యాప్‌ల ఊబి నుంచి యువతను కాపాడుతుందనే ఆశ ఒకవైపు ఉన్నా.. ఊసరవెల్లిలా రూపం మార్చుకుని మరో దారిలో వచ్చే ప్రమాదముందని పోలీసులు అంటున్నారు. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన చట్టం ద్వారా లీగల్ బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేయవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే డ్రీమ్ లెవెన్ లాంటి క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు, రమ్మీకి సంబంధించినవి, చిన్న పిల్లల గేమ్‌లలో డబ్బుల లావాదేవీలు ఉన్నటువంటి వాటిని అదుపు చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం వీటికి జియో ఫెన్సింగ్ వేస్తుంది గనుక దేశమంతా ఇవి కనుమరుగవుతాయి. జూదం, బెట్టింగ్‌ను ప్రోత్సహించే గేమ్‌లు నిషేధిత జాబితాలోకి వస్తాయని కొత్త చట్టంలో కేంద్రం స్పష్టం చేసింది. ఇప్పటివరకూ ఒక రాష్ట్రంలో నిషేధించిన యాప్‌లు మరో రాష్ట్రంలో అందుబాటులో ఉండటంతో ఎలాంటి ఫలితం కనిపించేది కాదు. ఇకమీదట ఆ పరిస్థితి ఉండదు. అయితే ఇక ఎదురయ్యే సవాలు విదేశాల నుంచి వస్తుంది. బెట్టింగ్ యాప్‌లకు పుట్టినిల్లు లాంటి మలేసియా, చైనా, ఉక్రెయిన్ వంటి దేశాల నుంచి బెట్టింగ్ నిర్వహించే అవకాశం ఉంది. అక్కడి నుంచి మన దేశంలోని టెలిగ్రామ్ గ్రూపుల్లోకి ఏపీకే ఫైల్స్ ద్వారా లింక్ పంపి డౌన్‌లోడ్ చేసుకోమని ఆఫర్ ఇచ్చే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడ్డ వ్యక్తులు వాటిని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముందని అంటున్నారు. విదేశాల నుంచి సోషల్ మీడియా గ్రూపుల్లోకి లింకులు పంపే యాప్‌లను కట్టడి చేయడం ఎలా? చైనా, మలేసియాలో ఉంటూ ఏపీకే ఫైల్స్ ద్వారా గేలం వేసే వ్యక్తుల్ని ట్రాక్ చేయడం ఎలా? అనే ప్రశ్నలు పోలీసుల నుంచి వస్తున్నాయి. వాటిని కట్టడి చేయాలంటే పెద్దఎత్తున అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని పోలీసు అధికారులు చెబుతున్నారు. మిర్రర్ సర్వర్లు ఉదాహరణకు ఉక్రెయిన్‌లో ఉంటే, లోకేషన్ భారత్‌లో చూపించే వాటికి మూల్ ఖాతాలు ఉండాలి. మూల్ ఖాతాలు లేకపోతే డబ్బులు దారి మళ్లించే అవకాశం ఉండదు. ఎక్కువ కాలం లావాదేవీలు జరపని ఖాతాల వివరాలు బ్యాంకర్ల నుంచి తీసుకుని వారికి కమీషన్ ఆశ చూపించి ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. ఇకపై అనుమానితులకు తమ బ్యాంకు ఖాతా ఆపరేట్ చేసుకునే అవకాశం ఇవ్వరాదని, అటువంటి లావాదేవీలతో జైలుకు వెళ్లాల్సి వస్తుందని ప్రచారం చేయాలని నిపుణులు, పోలీసులు చెబుతున్నారు.

అంతా ఆన్‌లైన్..

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు ఒక డొమైన్ కొని వెబ్‌సైట్ డిజైన్ చేయిస్తారు. యాప్ ద్వారా గేలం వేసేందుకు ఇన్‌ఫ్లూయన్సర్లకు అడిగినంత చెల్లిస్తారు. గోప్యంగా కాల్ సెంటర్ నడుపుతారు. చేతిలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న వారిని ఎంచుకుంటారు. ఈజీమనీకి ఆశపడే వారిని ఉచ్చులోకి లాగుతారు. మొదట్లో వంద, రెండొందల రూపాయలు బెట్టింగ్ పెట్టే వారికి గెలుపు రుచి చూపిస్తారు. డబ్బు వస్తోందన్న ఆశతో వేల రూపాయలు బెట్టింగ్ ఆడేలా చేస్తారు. తర్వాత మొత్తం లాగేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో నిషేధం ఉన్నా..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం నిషేధంలో ఉన్నా మరింత పుంజుకొంటున్నాయి. టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ లింకులు, పైరసీ వెబ్‌సైట్ల ద్వారా ఏపీకే ఫైళ్లు పంపి యువతను ఆకర్షిస్తున్నారు. వీటిలో అత్యధికంగా మోసపూరిత యాప్‌లు, వ్యక్తిగత సమాచారం దోచుకునే మాల్వేర్ అని సైబర్ పోలీసులు చెబుతున్నారు. ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసే సమయంలో యూజర్లు ఎటువంటి అనుమతులు అడిగినా 'అలౌ' నొక్కేస్తున్నారని, ఆ క్షణం నుంచి బ్యాంక్ ఖాతా మొదలుకొని ఫోన్ కాంటాక్టులు, ఫొటోలు అన్నీ స్కామర్ల చేతిలోకి వెళ్లిపోతున్నాయని సైబర్ నిపుణులు చెబుతున్నారు. ఐపీఎల్ సీజన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఫిర్యాదులు గణనీయంగా పెరుగుతున్నట్లు ఏపీ పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల గత రెండేళ్లలో ఏపీలో పదుల సంఖ్యలో ఆత్మహత్యలు నమోదయ్యాయి.

అవగాహన పెరగాలి..

యువత గేమింగ్ యాప్‌లకు అలవాటు పడకుండా అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ పెద్దఎత్తున ప్రచారం చేయిస్తున్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. యువత గేమింగ్ యాప్‌ల నుంచి మొదలు పెట్టి ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మళ్లుతున్నారని చెప్పారు. 'మొదట వంద రూపాయలతో ప్రారంభించి తర్వాత ఆ మొత్తం వేలల్లోకి చేరుతోంది. తక్కువ మొత్తం బెట్టింగ్ పెట్టినప్పుడు డబ్బులు వస్తాయి. తర్వాత ఆశపడి ఎక్కువ మొత్తం అప్పులు చేసి పెడతారు. కొందరు అంతా పోగొట్టుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితిని అరికట్టేందుకు నెలరోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. యువతలో అవగాహన తీసుకొచ్చేందుకు కృషి చేశాం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం సమాజానికి చాలా మంచిది. కాకపోతే దొడ్డిదారిన మళ్లీ వచ్చే యాప్‌లను కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుంది. బాధ్యత గల ప్రతి ఒక్కరి సహకారం కావాలి. టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది' అని జగదీశ్ అన్నారు.

క్షమాపణ చెప్పకుంటే ఎన్‌టీవీపై

క్రిమినల్ కేసు పెడతా

- 24 గంటల్లో స్పందించకుంటే ఎస్టీ కమిషన్‌కూ ఫిర్యాదు చేస్తా: మంత్రి సంధ్యారాణి



విశాఖపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తనపై ఎన్‌టీవీ దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలతో ఆ చానల్ కథనాలు ప్రసారం చేస్తోందని, వాటికి ఆధారాలు చూపించాలని, లేదా 24 గంటల్లో క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. లేదంటే క్రిమినల్ కేసులు పెడతానని, గిరిజన మహిళగా తన హక్కులకు భంగం కలిగించేలా ఫేక్ ప్రచారం చేసిన ఎన్‌టీవీపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని సంధ్యారాణి స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఒక అధికారి ఏసీబీకి పట్టుబడిన వ్యవహారంలో తనపై ఎన్‌టీవీలో తప్పుడు కథనాలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడారు. గిరిజన మహిళగా తన ఎదుగుదల చూసి ఓర్వలేక ఎన్‌టీవీ తప్పుడు కథనాలు ప్రసారం చేస్తోందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గడచిన ఏడాదిలో రూ.1,300 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేశామని, మారుమూల గిరిజన గ్రామాలకు డోలీ మోతలు ఉండకూడదని పెద్దఎత్తున నిధులు వెచ్చించామని మంత్రి చెప్పారు. శాఖాపరంగా అంత అభివృద్ధి జరుగుతుంటే సైకో జగన్‌కు వత్తాసు పలికుతున్న ఆ ఛానల్ తనపై తప్పుడు ఆరోపణలతో కథనాలు ప్రసారం చేస్తోందన్నారు. తన కుమార్తె జన్మదిన వేడుకలు విజయవాడలో నిర్వహిస్తే, తిరుపతిలో చిందులు వేశామని జగన్ పత్రిక సాక్షిలో తప్పుడు కథనాలు ప్రసారం చేశారని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెడితే ఇప్పుడు కాళ్లబేరానికి వచ్చారని ఆమె అన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఒక అధికారి ఏసీబీకి పట్టుబడితే మంత్రికి ఏం సంబంధమని ప్రశ్నించారు. ఏసీబీకి దొరికిన అధికారిపై విచారణ జరుగుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆయన స్థానంలో ఒక మహిళా అధికారికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించామన్నారు.

ఏపీ హైకోర్టుకు

మరో ముగ్గురు న్యాయమూర్తులు

- కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫారసు

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టుకు మరో ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. దేశవ్యాప్తంగా 14 మంది హైకోర్టు న్యాయమూర్తుల బదిలీకి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో సోమవారం భేటీ అయిన కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. గుజరాత్ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దోనాది రమేశ్, కోల్‌కతా హైకోర్టు నుంచి జస్టిస్ శుభేందు సమంతను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసింది. వీరి బదిలీకి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. కాగా, వీరిలో జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ డి. రమేశ్‌లు గతంలో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తులుగా సేవలందించారు.

ఇద్దరూ తెలుగు వారే



- **జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్..** స్వగ్రామం విజయనగరం జిల్లా, పార్వతీపురం. ఆయన 1964 మే 21న జన్మించారు. విశాఖపట్నంలోని ఎంవీపీ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1988 నుండి 2002 వరకు 14 ఏళ్లపాటు పార్వతీపురం, విజయనగరంలో న్యాయవాదిగా పనిచేశారు. 2002లో జిల్లా సెషన్స్ జడ్జి(గ్రేడ్-2)గా ఎంపికయ్యారు. ఉమ్మడి ఏపీలోని వివిధ కోర్టుల్లో న్యాయాధికారిగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించారు. 2015, జూలై 3 నుంచి 2018, డిసెంబరు 31వరకు ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేశారు. 2019, జూన్ 12న న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అమరావతిలో ఏపీ హైకోర్టు ఏర్పాటు చేశాక నియమితులైన మొదటి న్యాయమూర్తి ఆయనే. తర్వాత 2023, నవంబరు 2న గుజరాత్ హైకోర్టుకు బదిలీ అయ్యారు.



- **జస్టిస్ డి. రమేశ్..** స్వగ్రామం చిత్తూరు జిల్లా, మదనపల్లిలోని కమ్మపల్లి. 1965, జూన్ 27న జన్మించారు. నెల్లూరు వీఆర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి హైకోర్టులో 2000-04 వరకు ప్రభుత్వ న్యాయవాదిగా, 2007లో ఏపీ సర్వశిక్ష అభియాన్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా చేశారు. 2020, జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023, జూలై 24న అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు.



- **జస్టిస్ శుభేందు సమంత..** 1971, నవంబరు 25న జన్మించారు. కోల్‌కతా యునివర్సిటీ హజ్రా క్యాంపస్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. తమ్లుక్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అనంతరం, న్యాయాధికారిగా ఎంపికయ్యారు. పశ్చిమ మిద్నాపూర్‌లో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా పనిచేశారు. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జిగా చేశారు. కోల్‌కతా సిటీ సెషన్స్ కోర్టు చీఫ్ జడ్జిగా పనిచేశారు. 2022, మే 18న హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

'లిక్కర్' చార్జిషీట్లపై ఏసీబీ కోర్టు అభ్యంతరాలు

- దర్యాప్తు అధికారికి మెమో జారీ

విజయవాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో సిట్ దాఖలు చేసిన రెండు చార్జిషీట్లపై ఏసీబీ కోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ రెండు చార్జిషీట్లపై మొత్తం 21 అభ్యంతరాలకు మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని దర్యాప్తు అధికారికి న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం మెమో జారీ చేశారు. నిందితులందరికీ ఈ కేసుకు సంబంధించిన కాపీలు అందించారా అని కోర్టు ప్రశ్నించింది. అవినీతి నిరోధక చట్టం ఈ కేసుకు ఎలా వర్తిస్తుందో తెలియజేయాలని అడిగింది. ఇప్పటివరకు ఎంతమంది సాక్షులను సిట్ విచారించిందో తెలియజేయాలని, ఎంతమంది సాక్షుల నుంచి సీఆర్పీసీ 161 వాంగ్మూలం నమోదు చేశారు అని ప్రశ్నించింది. రెండు చార్జిషీట్లలో ప్రిలిమినరీ/ఫైనల్ చార్జిషీట్ అని చెప్పలేదన్న విషయాన్ని గుర్తు చేసింది. ఫోరెన్సిక్ నివేదికలు కోర్టుకు సమర్పించకుండా చార్జిషీటు ఎలా అర్హత పొందుతుందని అడిగింది. కేసులో 7 నుంచి 15 మంది వరకు ఉన్న నిందితులను ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదని మెమోలో ప్రశ్నించింది. చార్జిషీట్‌లో ప్రేయర్ పోర్షన్ సరిగ్గా సమర్పించాలని సిట్‌ను న్యాయాధికారి భాస్కరరావు ఆదేశించారు. కాగా, మద్యం కుంభకోణంలో దాఖలు చేసిన రెండు చార్జిషీట్ల కాపీలను పెన్‌డ్రైవ్‌లో నిందితులకు అందజేయాలని సిట్ నిర్ణయించింది. మొత్తం 11 పెన్‌డ్రైవ్‌ల్లోకి చార్జిషీట్లను కాపీ చేసి వాటిని న్యాయాధికారి పి.భాస్కరరావుకు చూపించారు. ఇక, మద్యం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి రిమాండ్ పొడిగింపునకు సంబంధించి సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఇక చెవిరెడ్డి దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్ల విచారణను వాయిదా వేసింది.

బీసీలకు జన ఔషధి స్టోర్లు

- ప్రతి మండలంలో ఏర్పాటుకు సీఎం గ్రీన్‌సిగ్నల్
- 1.63 కోట్ల కుటుంబాలకు వైద్య బీమా సౌకర్యం

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జన ఔషధి స్టోర్లను బీసీ యువతకు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. బీసీ కార్పొరేషన్ నుంచి పెద్దఎత్తున వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఏర్పాటుకు తక్షణమే అనుమతులివ్వాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాల మెరుగుదల, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలలు, ఉచితంగా వైద్య పరీక్షలు, యోగా-నేచురోపతి అభివృద్ధి వంటి అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రతి మండలంలో జనరిక్ ఔషధాలు లభించేలా చూడాలన్న సీఎం ఆలోచనకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సూచించడంతో.. వాటికి వెంటనే ఆమోదం తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకూ వైద్య బీమా అందించే అంశంపైనా చర్చించారు. ప్రస్తుత విధానం ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలుగుతుండగా, 1.63 కోట్ల కుటుంబాలకు వర్తించేలా మార్పులు చేయాలని సీఎం సూచించారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని నిర్మించేలా ప్రణాళిక అమలుచేయాలని సీఎం సూచించారు. మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల పురోగతిపై చర్చించారు. డబ్ల్యూహెచ్‌వో నిర్దేశాల ప్రకారం రాష్ట్రంలో మరో 12,756 పడకలు అందుబాటులోకి తేవాల్సి ఉందని, దీనిపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. మూడు రీజనల్ స్టడీ సెంటర్లలో 64 మంది సభ్యుల నియామకానికి అనుమతులిచ్చారు. అమరావతి పరిధిలో నేచురోపతి యూనివర్సిటీ ఏర్పాటుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించేందుకు తలపెట్టిన ఉచిత వైద్య పరీక్షల పైలెట్ ప్రాజెక్టును కుప్పం నియోజకవర్గంలో 45రోజుల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. 108 వాహనాల సిబ్బందికి యూనిఫామ్ అమలు చేయాలని నిర్దేశించారు. ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకాన్ని త్వరలోనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీ ఏర్పాటు చేస్తాం

సమీక్షలో భాగంగా పెర్కిన్స్ ఇండియా, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లు భాగస్వామ్యంతో అమరావతిలో మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. దీనిపై ఆ సంస్థల ప్రతినిధులు సీఎంను కలిసి ప్రజంటేషన్ ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర విద్య, సమాన హక్కులు, అందరికీ అందుబాటులో మౌలిక వసతులు సృష్టించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. స్పందించిన సీఎం చంద్రబాబు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సూచించారు. సమీక్షలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రత్యేక సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య రంగంలో ఆవిష్కరణలకు 'బ్రెయిన్'

- బయోడిజైన్ నిపుణులతో సీఎం సమావేశం
- పరిశోధనలు, శిక్షణ, స్టార్టప్‌ల కోసం ఎంవోయూ

వైద్య ఆరోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ (బీఆర్ఐఏఎన్-బ్రెయిన్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్‌కు చెందిన వివిధ దేశాల వైద్య నిపుణులతో సీఎం సమావేశమయ్యారు. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో అంతర్భాగంగా ఈ రిసెర్చ్ ఇన్నోవేషన్ కార్యకలాపాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం ఏపీని వైద్య రంగంలో ఆవిష్కరణలు మెడ్‌టెక్ పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే రోడ్ మ్యాప్‌పై సీఎం చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతికత బదిలీ, స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో సహకారంపై అంతర్జాతీయ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా భారత్ బయోడిజైన్-బయోడిజైన్ ఆస్ట్రేలియా కలిసి పనిచేయనున్నాయి.

డిప్యూటీ తహశీల్దార్ డ్రగ్స్ దందా!

- కొండాపూర్‌లో డ్రగ్స్‌తో రేవ్ పార్టీ
- తెలంగాణ ఈగల్, పోలీసుల దాడి.. ఆరుగురి అరెస్టు

రాయదుర్గం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి.. డ్రగ్స్‌తో రేవ్ పార్టీ చేసుకుంటున్న ఆరుగురిని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ వింగ్- ఈగల్, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి 20 గ్రాముల కొకైన్, 3 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకోగా.. రాజమండ్రిలో డిప్యూటీ తహశీల్దార్(డీటీ)గా పనిచేసే మణిదీప్ డ్రగ్స్ దందా వెలుగులోకి వచ్చింది. ఈ వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్ సోమవారం వెల్లడించారు. కొండాపూర్‌లోని రాజేశ్వరి నిలయం అనే సర్వీస్ అపార్టుమెంట్‌లో డ్రగ్స్‌తో రేవ్‌పార్టీ నిర్వహిస్తున్నట్లు ఉప్పందుకున్న ఈగల్, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. తేజ (తేజారెడ్డి), విక్రమ్ (విక్రమ్‌రెడ్డి), మన్నె నీలిమ, చందన్, పురుషోత్తమ్‌రెడ్డి, భార్గవ్ అనే నిందితులను అరెస్టు చేశారు. వీరికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. తేజ డ్రగ్స్ సప్లయర్‌గా పనిచేస్తున్నట్లు.. బెంగళూరుకు చెందిన రాహుల్ అనే డ్రగ్స్ పెడ్లర్ పరారీలో ఉన్నట్లు డీసీపీ వివరించారు. తేజకు మణిదీప్ డ్రగ్స్ అలవాటు చేసినట్లు తెలిపారు. 'మణిదీప్ రాజమండ్రిలోని తన సొంత ఫాంహౌస్‌లో పలుమార్లు డ్రగ్స్ పార్టీలు నిర్వహించాడు. ఈ పార్టీలకు తేజ సప్లయర్‌గా మారాడు. రాహుల్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకునేవాడు' అని డీసీపీ వివరించారు. నీలిమ, విక్రమ్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కాగా.. తేజారెడ్డికి క్లౌడ్ కిచెన్ బిజినెస్ ఉంది. విక్రమ్‌తో ఇటీవల సంచలనం సృష్టించిన మల్నాడు కిచెన్ నిందితుడు సూర్యకు స్నేహం ఉన్నట్లు గుర్తించామని డీసీపీ వెల్లడించారు. దీంతో.. సూర్య నెట్‌వర్క్‌తో తాజాగా పట్టుబడ్డ ముఠాకు లింకులున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. తాజా కేసుతో డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్‌కు సంబంధం లేకున్నా.. అతడిని విచారిస్తే.. బెంగళూరు, గోవాలోని డ్రగ్స్ నెట్‌వర్క్ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయన్నారు.

అక్కడ తీగ లాగితే.. ఇక్కడ డొంక కదిలింది!

అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్‌లో డ్రగ్ పెడ్లర్లను పట్టుకుంటే రాజమండ్రిలో డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ వ్యవహారం బయటపడింది. తెలంగాణ ఈగల్ టీమ్ అందించిన సమాచారంతో ఏపీ పోలీసులు మణిదీప్ గురించి ఆరా తీస్తున్నారు. ఉన్నతాధికారులతో అతడికి సత్సంబంధాలు ఉన్నాయని తెలిసింది. రాజమండ్రి నుంచి దాదాపు ప్రతి వారం హైదరాబాద్‌కు విమానంలో వెళ్లి వస్తాడని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

నాకు సంబంధం లేదు: మణిదీప్

రాజమహేంద్రవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మణిదీప్ ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ పరిపాలనా కార్యాలయంలో చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఇతడు కడియం మండలానికి చెందిన ఓ వైసీపీ నాయకుడి మేనల్లుడు. మణిదీప్‌కు ఫోన్ చేయగా.. డ్రగ్స్ కేసులో తన పేరు టీవీల్లో చూసి షాక్ తిన్నానని, తన తల్లి కంగారుపడుతోందని, తాను అసలు ఇటీవల హైదరాబాద్ వెళ్లనేలేదని చెప్పాడు. తాము హైదరాబాద్ పోలీసుల నుంచి సమాచారం కోరామని, రికార్డులన్నీ పరిశీలించి స్పష్టత తెస్తామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ వెల్లడించారు. డ్రగ్స్ వ్యవహారం వెలుగుచూడడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సోమవారం ధవళేశ్వరం ఆఫీసుకు వెళ్లి మణిదీప్ గురించి ఆరా తీశారు. మణిదీప్ రెగ్యులర్‌గా ఆఫీసుకు వస్తున్నాడని అక్కడి అధికారి ఒకరు తెలిపారు. కాగా.. రేవ్‌పార్టీలో పట్టుబడిన తేజారెడ్డి కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందినవాడు. విక్రమ్‌రెడ్డి స్వస్థలం ఆలమూరు మండలం జొన్నాడ.

నేడు నేవీలోకి 'హిమగిరి', 'ఉదయగిరి'



ఐఎన్ఎస్ ఉదయగిరి

విశాఖపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి మంగళవారం విశాఖపట్నంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతులమీదుగా తూర్పు నౌకాదళంలో చేరనున్నాయి. వేర్వేరు షిప్‌యార్డుల్లో తయారై ఒకేసారి, ఒకేచోట నేవీలో ప్రవేశించడం వీటి ప్రత్యేకత. ప్రాజెక్టు 17ఏలో మొదటిదైన స్టెల్త్ ఫ్రిగేట్ హిమగిరి (ఎఫ్34)ని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ నిర్మించగా, ఉదయగిరి (ఎఫ్35)ని ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ రూపొందించింది. భారత నౌకాదళం వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ నౌక కూడా ఇదే కావడం విశేషం. వీటిని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు. ఒక్కొక్కటి 6,700 టన్నులు కలిగిన ఈ ఫ్రిగేట్‌లు వీటికి ముందున్న శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్ల కంటే ఐదు శాతం పెద్దవి. ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణులు, మీడియం రేంజ్ ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులు, 76 ఎంఎం మీడియం రేంజ్ గన్, 30 ఎంఎం, 12.7 ఎంఎం ఆయుధాలు, యాంటీ సబ్‌మెరైన్, సముద్ర అంతర్భాగంలో ప్రయోగించే ఆయుధాలు అమర్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.